ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-7-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 171 పేజీలు: 12 వెల: 6.50

పహల్గాంపై చర్చ జరపవలసిందే: విపక్షాలు
గాజాలో అన్నార్తులపై ఆగని దాడులు 9లో

# గ్రీన్ ఎనర్జీలో అద్భుతాలు

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అమరావతి డిక్లరేషన్ విడుదల చేసిన ముఖ్యమంత్రి

### 500 గి.వా గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యం

### విశాఖలో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న ఎన్టీపీసీ


### కాకినాడలో త్వరలోనే గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి: సిఎం చంద్రబాబు


సోమవారం విజయవాడలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అమరావతి డిక్లరేషన్ విడుదల చేస్తున్న సిఎం చంద్రబాబు, చీఫ్ సెక్రటరీ విజయానంద్, నెడ్ క్యాప్ ఎండి కమలాకర్ బాబు

**విజయవాడ, జూలై 21,ప్రభాతవార్త ప్రతినిధి :** ఇంధన రంగంలో అద్భుతాలు సాధించే దిశలో ఎపి ప్రభుత్వం నిర్మాణత్మకంగా వ్యవహరిస్తోందని సిఎం చంద్రబాబు తెలిపారు. ఎపి గ్రీన్ ఎనర్జీకి సరైన చిరునామాగా తీర్చిదిద్దుతామన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్, నెడ్ క్యాప్ ఎండి కమలాకర్ బాబు సమక్షంలో గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ విడుదలచేసారు. 2030 నాటికి ఎపిని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టే దిశలో డిక్లరేషన్‌లో ప్రకటించారు. ఇటీవల అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్‌పై రెండు రోజుల పాటు అమరావతిలో జరిగిన సమ్మిట్‌లో పాల్గొన్న 600 మంది ప్రతినిధులు, ఇండస్ట్రీరంగ నిపుణులు పాల్గొన్నారు. మెత్తం 7 సెషన్స్‌గా సమ్మిట్ జరిగింది. ఈ సమ్మిట్‌లో గీన్ హైడ్రోజన్‌ను తక్కువ వ్యయంతోనే ఉత్పత్తి చేసేలా కొత్త సాంకేతికను అభివృద్ధి చేయాలని సిఎం స్పష్టం చేశారు.
ఇంధన రంగంలో ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలని రంగంలో లోతైన పరిశోధన సంబంధిత రంగానికి చెందిన శాస్త్రవేతలు చేయాలని సిఎం పిలుపు నిచ్చారు. సంప్రదాయ ఇంధనవనరులకారణంగా తీవ్రమైన >>2

# ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా

## అనారోగ్య కారణాలతో వైదొలగుతున్నట్లు ప్రకటించిన ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ, జూలై 21:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజుననే ఉపరాష్ట్రపతి జగ్‌దీప్‌ధన్‌ఖడ్ సంచలన ప్రకటనచేసారు. తన ఆరోగ్యకారణాల రీత్యా వైద్యుల సలహాలను అనుసరించి తాను తన ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లుప్రకటించారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదిముర్మకు పంపించిన ధన్‌ఖడ్ తన రాజీనామా వెంటనే అమలులోకి వచ్చినట్లు పరిగణించాలనికోరారు. వైద్యుల సలహామేరకు తన ఆరోగ్య పరిరక్షణకు ఇదే సరైన మార్గమని భావించి తాను ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామాచేస్తున్నానని అన్నారు. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణం ప్రకారం తాను రాజీనామాచేస్తున్నట్లుప్రకటించారు. తాను పదవిలో ఉన్నంతకాలం రాష్ట్రపతి తనకు సంపూర్ణమద్దతునిచ్చి ప్రోత్సహించారని ఆమెతో కలిసి పనిచేసిన కాలం తనకు జీవితంలో గుర్తుండిపోతుందని ఆయన అన్నారు. అలాగే ఆయన ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రివర్గ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పదవిలో >>2


సోమవారం స్పీకర్ ఓంబిర్లాకు నోటీసు అందిస్తున్న ఎంపీలు

# జస్టిస్ వర్మ అభిశంసన!

### 208 మంది ఎంపిల సంతకాలతో స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌కు నోటీసులు

### వర్మ తొలగింపు డిమాండ్ చేసిన కాంగ్రెస్, బిజెపి, టిడిపి, జెడియు, జనసేన, సిపిఎం తదితర పార్టీలు

### వర్మ నివాసంలో కాలిన కరెన్సీ కట్టల కేసు

**న్యూఢిల్లీ,జూలై 21:** జస్టిస్‌వర్మ అభిశంసన తీర్మానం ప్రక్రియను పార్లమెంటులో ప్రారంభించారు. మొత్తం 145 మంది లోక్‌సభ ఎంపిలు ఈ అభిశంసన తీర్మానంపై సంతకాలుచేసారు. రాజ్యసభలోకూడా 63 మంది విపక్ష ఎంపిలు సోమవారం రాజ్యసభ చైర్మన్ జగదీప్‌ధన్‌ఖడ్‌కు తమ నోటీసులు అందచేసారు. రాజ్యాంగంలోని 124,217, 218 అధికరణల ప్రకారం జస్టిస్ వర్మను తొలగించాలంటూ ఎంపిలు నోటీసులు జారీచేసారు. కేంద్రమాజీ మంత్రి రవిశంకర్‌ప్రసాద్‌తోపాటు వివిధ పక్షాల నాయకులు ఈ తీర్మానంపై సంతకాలుచేసారు. స్పీకర్ >>2



# కమ్యూనిస్టు కురువృద్ధుడు అచ్యుతానందన్ కన్నుమూత

### ఎమ్మెల్యేగా ఏడుసార్లు ఎన్నికైన కేరళ మాజీ సిఎం

**తిరువనంతపురం,జూలై 21:** కేరళ మాజీముఖ్యమంత్రి, కమ్యూనిస్టు కురు వృద్ధుడు వి.ఎస్. అచ్యుతానందన్ కన్నుమూశారు. గతనెల గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన అచ్యుతానందన్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. 101 ఏళ్ల వయసున్న అచ్యుతానందన్, 2006 నుంచి 2011 వరకు కేరళ సిఎంగా పనిచేశారు. 1923 అక్టోబర్ 20న కేరళలో జన్మించిన అచ్యుతానందన్ ఏడుసార్లు ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మూడుసార్లు కేరళ విపక్షనేతగా వ్యవహరించారు. అవిభక్త వామపక్ష పార్టీలో చీలిక తర్వాత సిపిఎంను స్థాపించిన వ్యక్తుల్లో అచ్యుతానందన్ కూడా >>2

# ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి పెట్టుబడులు ఆకర్షించండి

### 'మేడిన్ ఇండియా' లక్ష్యాలు నెరవేరేలా కొత్త పాలసీ

### సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ పరికరాల ఉత్పత్తికి ఎపి అనుకూలమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రంగంలో మనం అద్భుతాలు సాధించాలన్నారు. అందుకు అనుగుణంగా మనం కార్యచరణ చేపట్టాలన్నారు. రాయలసీమలో శ్రీసిటీ, హిందుపూర్, కొప్పర్తి లాంటి చోట్ల ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తికి విస్తృతమైన అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తి చేసేందుకు అనువుగా ఈ ప్రాంతాలకు పెట్టుబడులను ఆకర్షించాలని సిఎం అధికారులను సూచించారు. సోమవారం సచివాలయంలో నూతనంగా రూపొందించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ 4.0 పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. 2025-30 ల మధ్య ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులను ఆకర్షించటమే లక్ష్యంగా నూతన విధానంపై ముఖ్యమంత్రి చర్చించారు. ఎలక్ట్రానిక్స్ పరికరాల దిగుమతులు తగ్గించటం, దేశీయంగా ఉత్పత్తి పెంపు, ఎగుమతుల లక్ష్యంగా నూతన విధానానికి రూపకల్పన చేసినట్టు అధికారులు సిఎంకు వివరించారు. గత ఏడాది దేశంలో 70 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్ సర్క్యూట్ బోర్డులు దిగుమతి అయ్యాయని ఈ రంగంలో భారీగా డిమాండ్ ఉందని అధికారులు తెలపగా..


సోమవారం ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ 4.0 పై సిఎం చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల రంగంలో సెల్ఫ్‌రిలయన్స్, మేడ్ ఇన్ ఇండియా లక్ష్యాలు నెరవేరాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. అయితే అంతర్జాతీయ స్థాయి డిమాండ్‌ను తీర్చేందుకు వీలుగా ఎపిలో >>2

# అజ్ఞాతంలోకి పేర్ని నాని

**విజయవాడ, జూలై21, ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) అజ్ఞాతంలోకి వెళ్లినట్లు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేసారంటూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పలు స్టేషనుల్లో ఫిర్యాదు చేసారు. ఆ మేరకు నమోదయిన కేసుల్లో తనను అరెస్ట్ చేస్తారనే ఉద్దేశంతో నాని అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. జూలై 8న పామర్రులో మాజీ మంత్రి, వైఎస్సార్సీ నేత పేర్నినాని రప్పా రప్పా అంటూ కొట్టిన డైలాగులు ఇంకా ఆయనను వెంటాడుతూనే ఉన్నాయి. ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రప్పా రప్పా అని చెప్పడం కాదు.. రాత్రికి రాత్రి చేసేయాలంటూ >>2

# సిట్ విచారణకు మాజీ మంత్రి గైర్హాజర్

**విజయవాడ,జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎక్సైజ్ మంత్రి కె. నారాయణస్వామికి మూడు రోజుల క్రితం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను అనుసరించి సోమవారం ఉదయం 10 గంటలకు సిట్ కార్యాలయంలో విచారణకు నారాయణస్వామి హాజరు కావాల్సి ఉంది. అనారోగ్యం, వ్యక్తిగత కారణాల వల్ల విచారణకు రాలేకపోతున్నానని మాజీ మంత్రి నారాయణ స్వామి సిట్ అధికారులకు సమాచారం అందజేశారు. వాస్తవానికి సోమవారం మాజీ మంత్రి నారాయణస్వామి సిట్ కార్యాలయానికి హాజరు కావాల్సి ఉంది. కానీ, అనూహ్యంగా ఆయన విచారణకు రానని >>2

# 3 అంశాలపై అభిప్రాయం చెప్పండి

### వివేకా హత్యకేసులో సిబిఐతో సుప్రీం కోర్టు

### అవినాశ్ బెయిలు రద్దుపై ఆ తర్వాత విచారణ జరుపుతామని వెల్లడి

**విజయవాడ,జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి వివేకా హత్య కేసు నిందితుల బెయిలు రద్దు పిటీషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో మూడు అంశాలపై సిబిఐ అభిప్రాయాన్ని సుప్రీం ధర్మాసనం కోరింది. సిబిఐ అభిప్రాయం చెప్పాక అవినాష్‌రెడ్డి బెయిలు రద్దుపై విచారిస్తామని పేర్కొంది. తదుపరి విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. ఇంకా తదుపరి దర్యాప్తు అవసరమని సిబిఐ భావిస్తుందా?లేదా?కోర్టుకు చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది.
ఎపి ప్రభుత్వం కడప సెషన్స్ కోర్టులో వేసిన క్లోజర్ రిపోర్టుపైనా సిబిఐ అభిప్రాయాన్ని సుప్రీం ధర్మాసనం కోరింది. కేసు ట్రయల్,తదుపరి దర్యాప్తు ఏకకాలంలో కొనసాగించే అవకాశం ఉందా? అని సిబిఐ అభిప్రాయాన్ని న్యాయస్థానం అడిగింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న అవినాష్‌రెడ్డి సహా పలువురి బెయిలు రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో వివేకా కుమార్తె సునీత,సీబీఐ పిటీషన్ దాఖలు చేశారు. అవినాష్‌రెడ్డితో పాటు పలువురు నిందితులకు గతంలో తెలంగాణ హైకోర్టు బెయిలు ఇచ్చింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సీబీఐ,సునీత సవాల్ చేశారు.

# రాష్ట్రమంతా జోరుగా వర్షాలు


విజయవాడ నగరంలో కొత్త అమ్మోరు ఆలయ సమీపంలో లోతట్టు రోడ్డుపై వర్షం నీరు

### విశాఖ, కాకినాడ, కోనసీమ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మోస్తరునుంచి భారీ వర్షాలు

### 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

**విజయవాడ,జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావం స్పష్టంగా కన్పిస్తుంది.పలు ప్రాంతాల్లో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి.మోస్తరు నుంచి భారీ వర్షాలు ఆయా ప్రాంతాల్లో కురుస్తున్నాయి.కొన్ని ప్రాంతాల్లో ముసురు వాతావరణం ఏర్పడింది.దాదాపు రోజంతా జల్లులు కురుస్తున్నాయి.వర్షాలకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు ఇబ్బంది కలుగుతుంది.
జిల్లాల వారీగా వర్షాలు గమనిస్తే సోమవారం విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం, ప్రకాశం, విజయనగరం, గుంటూరు, పల్నాడు, శ్రీసత్యసాయి, బాపట్ల, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనకాపల్లి జిల్లాల్లో వర్షాలు కురిశాయి. స్థానిక సమాచారం ప్రకారం రాత్రి 7 గంటల వరకు అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా మందసలో 81 మిల్లీమీటర్లు, పైడిభీమవరంలో 79 మిలీమీటర్లు, ప్రకాశం జిల్లా టంగుటూరు, విజయనగరం జిల్లా పూసపాటిరేగలో 77 మిలీమీటర్ల వర్షపాతం నమోదైంది.
ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలలో చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. మార్కాపురం, పెద్దారవీడు, యర్రగొండపాలెం మండలాల్లో తుపాను ప్రభావంతో రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఎగువనుంచి వరద >>2

# మూడేళ్లలో అమరావతి పూర్తి

### వేగంగా సాగుతున్న నిర్మాణాలు

### రెండో విడత ల్యాండ్ పూలింగ్‌పై అభ్యంతరాల్లేవు

### వచ్చే మార్చికి ప్రభుత్వ భవనాల నిర్మాణం: మంత్రి నారాయణ



**విజయవాడ జూలై21,ప్రభాతవార్తప్రతినిధి.:** గత ప్రభుత్వం అమరావతి రైతులతో పాటు కాంట్రాక్టర్లను కూడా అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు మంత్రి నారాయణ...అమరావతి నిర్మాణం మూడేళ్లలో ఖచ్చితంగా పూర్తిచేసి తీరుతామని మంత్రి మరోసారి స్పష్టం చేసారు..ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను సీఆర్డీఏ ఇంజినీర్లతోకలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. మంత్రులు, హైకోర్టు న్యాయ మూర్తులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల బంగ్లాలతో పాటు ఆలిండియా సర్వీస్ అధికారుల క్వార్టర్ల నిర్మాణపనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ఆయా నిర్మాణాలకు సంబంధించి నిర్మాణ సంస్థల ప్రతినిధులను వివరాలు అడిగి వివరాలు తెలుసుకున్నారు..మొత్తం కార్మికులు ఎంతమంది పనిచేస్తున్నారు?నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న సామాగ్రి,మెషినరీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత నేలపాడులోని ఆలిండియా సర్వీస్ అధికారుల క్వార్టర్ల వద్ద మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.
అమరావతిలో భవనాలు,ట్రంక్ రోడ్లు,సీవరేజి పనులు వేగంగా జరుగుతున్నాయి..ఎల్పీఎస్ లే అవుట్‌లలో పనులకు కూడా టెండర్లు పూర్తయ్యాయి. 2014-19 మధ్యలోనే అధికారుల కోసం 4000 ఇళ్ల నిర్మాణానికి టెండర్లు కూడా పూర్తి చేసి నిర్మాణాలు ప్రారంభించామన్నారు అయితే గత ప్రభుత్వం అన్ని పనులను నిలిపివేసిందన్నారు. తిరిగి పాత టెండర్లు రద్దు చేసి, న్యాయపరమైన చిక్కులురాకుండా జాగ్రత్తలు తీసుకుని కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఆలస్యమైందన్నారు. రాజధానిలో అన్నిపనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వీటిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు 12 టవర్లలో 288 ఫ్లాట్లు,ఆలిండియా సర్వీస్ అధికారులకు 6 టవర్లలో మొత్తం 144 ఫ్లాట్లు నిర్మిస్తున్నామన్నారు. అలాగే ప్రిన్సిపల్ సెక్రటరీల కోసం 25 బంగళాలు,సెక్రటరీల కోసం 90 బంగళాలు, మంత్రుల కోసం 35 బంగళాలు, జడ్జిల కొరకు 36 బంగళాలు, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కొరకు మొత్తం 21 టవర్లలో 1968 ఫ్లాట్లు నిర్మిస్తున్నామన్నారు.

22-7pg2exHMNWJQE.qxd:22-7pg2exHMNWJQE.qxd 01/01/01 8:57 AM Page 1





కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పుట్టిన రోజు సందర్భంగా పార్లమెంటుహౌస్ వద్ద ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నేతలు

# జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా

>> ఉన్నంతకాలం ప్రధానిమోదీ ఇచ్చిన సహకారం వెలకట్టలేనిదని పదవిలో ఉన్నకాలంలో తాను ఎంతో నేర్చుకున్నానని ఆయన అన్నారు. ఈ ఏడాది మార్చిలో ఆయన ఛాతీనొప్పి అసౌకర్యంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. జూన్‌లోనూ ఉత్తరాఖండ్‌లోని కుమావు విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవంలో ధన్‌ఖడ్ స్పృహ తప్పిపడిపోయారు. ఈ క్రమంలోనే ఆరోగ్య పరిరక్షణకోసం రాజీనామాచేస్తున్నట్లు ధన్‌ఖడ్‌ప్రకటించారని ఆయన సన్నిహితులు బిజెపి నేతలు చెపుతున్నారు. రాజస్థాన్‌లోని ఒబిసి సామాజిక వర్గానికి చెందిన ధన్‌ఖడ్ మూడు దశాబ్దాలుగా ప్రజాజీవితంలో కొనసాగుతున్నారు. సాధారణ రైతు కుటుంబంనుంచి వచ్చిన ఆయన దేశంలోనే రెండో అత్యున్నతస్థానానికి ఎదిగారు. 1951 మే 18న రాజస్థాన్‌లోని ఝున్‌ఝునుజిల్లా కిథనా గ్రామంలో జన్మించిన ధన్‌ఖడ్ ఎల్‌ఎల్‌బి కోర్సు తర్వాత 1979లో నవంబరులో రాజస్థాన్ బార్ అసోసియేషన్‌లో అడ్వకేట్‌గా నమోదయ్యారు. రాజస్థాన్ హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీసుచేసారు. 1989లో జనతాదళ్ తరపున ఝున్‌ఝును లోక్‌సభ స్థానంనుంచి ధన్‌ఖడ్ గెలిచారు. 1990లో ప్రధాని చంద్రశేఖర్ కేబినెట్‌లో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రిగా పనిచేసారు. 1993-98 మధ్య ఎమ్మెల్యేగా కొనసాగారు. పివినరసింహారావుప్రధానిగా ఉన్న కాలంలో కాంగ్రెస్‌లో చేరారు. 1998నుంచి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటూ న్యాయవాద వృత్తిలోనే కొనసాగారు. 2008 తర్వాత బిజెపిలో చేరిన ధన్‌ఖడ్ 2019లో అనూహ్యంగా పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆనాడు బెంగాల్ గవర్నర్‌గా సిఎం మమతా బెనర్జీకి చుక్కలుచూపించారన్న ప్రచారం ఉంది. యూనివర్సిటీ ఛాన్సలర్‌గా గవర్నర్‌ను తొలగిస్తూ మమత ప్రవేశపెట్టిన ఆర్డినెన్స్‌లతోసహా అన్ని బిల్లులను కూడా సందేహాలు నివృత్తిచేయాలంటూ పెండింగ్‌లోనే ఉంచడంతో మమతా దీదీకి ధన్‌ఖడ్‌మధ్య కోల్డ్‌వార్ నడిచింది. 2022లో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అధికార ఎన్డీయేకూటమి ఆయనను అభ్యర్థిగా దించింది. విపక్షాల అభ్యర్థి మార్గరెట్ ఆళ్వాపై 346 ఓట్లతేడాతో విజయం సాధించారు. భారత 14వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలుచేపట్టారు.

# గ్రీన్ ఎనర్జీలో అద్భుతాలు

>> కాలుష్యం బారిన పడుతున్నామని నెట్ జీరో కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారమని సిఎం అన్నారు. ఇక సమీప భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్ దేన్నారు.ఇంధన రంగంలో అది గేమ్ ఛేంజర్‌గా మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే తక్కువ ఖర్చుతో సామాన్యులు కూడా వ్యయం భరించేలా ఉండే దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఏపిలోనూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. విశాఖలో ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ హైడ్రోజన్ తయారు చేసేందుకు ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని అన్నారు. అలాగే కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని ఏపి నిర్దేశించుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 గిగావాట్ల సామర్థంతో ఎలక్ట్రోలైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తితో పాటు ఏపిలో సౌర, పవన, పంప్డ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన వనరులు ఉన్నాయని స్పష్టం చేశారు. అమరావతిలో కృత్రిమ మేథ కేంద్రంగా క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా నూ తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి అన్నారు. రెండు రోజుల సదస్సు అనంతరం అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్‌ను ప్రకటిస్తామన్నారు.ఏడాది తర్వాత డిక్లరేషన్ అమలు పై సమీక్షిస్తామని సిఎం వెల్లడించారు. యూనివర్సిటీలు, పరిశోధకులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ అంశంపై సిఎం మాట్లాడుతూ.. గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం పెరిగింది. పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాలి. 2070 నాటికి కర్బన రహిత ఇంధనాలు వాడాలన్నది మన జాతీయ లక్ష్యమన్నారు..తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజ్ పై దృష్టి సారించాలి. కేంద్రం కూడా గ్రీన్ హైడ్రోజన్ పరిశోధన, ఉత్పత్తికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకునేందుకు ఏపి ఎప్పుడూ ముందు ఉంటుంది. ఇంధన ఖర్చు తగ్గాలి ప్రజలకు ప్రయోజనం చేకూరాలన్నదే ముఖ్యం. గ్రీన్ హైడ్రోజన్ తో అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఇవ్వడం సాధ్యం. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంగా ప్రధాని నిర్ణయించారు. అందుకు వీలుగా గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంతో ఏపి ప్రముఖ భాగస్వామిగా ఉంటుంది అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.ఈ సమ్మిట్‌లోపాల్గొన్న గ్రీన్ హైడ్రోజన్ కంపెనీల సిఇఒలు, సిఒఒలు, ఎండిలు రెండు రోజుల పాటు చర్చించిన అంశాల ఆధారంగా డిక్లరేషన్ తాజాగా నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. భారత్‌లో స్వచ్ఛమైన ఇంధనాల ఉత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు విధివిధానాలు రూపొందించేలా డిక్లరేషన్ రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పించాలని లక్ష్యంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి దేశంలోనే అతిపెద్ద ఎకో సిస్టంను రాష్ట్రంలో నెలకొల్పటమే డిక్లరేషన్ ఉద్దేశ్యం. 2027 నాటికి 2 గిగావాట్లు, 2029కి 5 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ల తయారీ లక్ష్యంగా 2029 నాటికి ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కిలో హైడ్రోజన్ గ్యాస్ రూ.460 నుంచి రూ.160కి తగ్గించేలా పరిశోధనలు, కార్యాచరణ 2029 నాటికి 25 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ పంపిణీకి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా దీన్ని తీర్చిదిద్దాలని డిక్లరేషన్‌లో నిర్ణయించారు.ఆవిష్కరణలు, పరిశోధనల కోసం రూ.500 కోట్లు వ్యయం చేయాలని నిర్ణయం గ్రీన్ హైడ్రోజన్ దిశగా కృషి చేసే 50 స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పించాలని డిక్లరేషన్‌లో వెల్లడించారు.



సోమవారం కోల్‌కతాలో అమరవీరుల సంస్మరణ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించిన టిఎంసి కార్యకర్తలు

# ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఎపికి 606 కోట్లు, తెలంగాణకు1705 కోట్లు

## రాజ్యసభలో వైఎస్సార్సీ ఎంపీ రఘునాథరెడ్డి ప్రశ్నకు కేంద్ర గృహ పట్టణాభివృద్ధి శాఖ జవాబు

## సముద్ర వాణిజ్యం బిల్లుకు వైఎస్సార్సీ మద్దతు

**రాజంపేట, జూలై 21 ప్రభాతవార్త :** గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 మిషన్ కింద ఆంధ్ర రాష్ట్రానికి 606.15 కోట్లు కేటాయించినట్లు కేంద్ర పట్టణ గృహ నిర్మాణ శాఖ మంత్రి తోఖాన్ సాహూ పేర్కొన్నారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల్లో వైఎస్సార్సీ ఎంపీ మేడా రఘునాథ రెడ్డి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా సంబంధిత మంత్రి లిఖితపూర్వక సమాధానం చెప్పారు. పిఎంఎవై 2.0 మిషన్ కింద దేశంలో 7.10 లక్షల కోట్ల మంది తక్కువ ఆదాయ, మధ్య ఆదాయ వర్గాల ప్రజలకు ఇల్లు నిర్మించాలని లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు 2.3 లక్షల కోట్లు వ్యయమవుతుందని, అందులో కేంద్రం వాటా 1.6 లక్షల కోట్లుగా పేర్కొన్నారు. దీని ప్రకారంగా ఆంధ్రకు 606 కోట్లు, తెలంగాణకు 1705.22 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పథకం మార్గదర్శక సూత్రాల ప్రకారం రాష్ట్రస్థాయిలోనే లబ్ధిదారులను సర్వే చేసి ఎంపిక చేస్తారని తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ నినాదంతో చేపట్టిన ఈ పథకాన్ని 1.9.2024 న దేశవ్యాప్తంగా ప్రారంభించి రాష్ట్రాలు అడిగిన మేరకు 10817.65 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇదిలావుండగా రాజ్యసభలో జరిగిన సముద్రం వాణిజ్యం బిల్లుకు వైఎస్సార్సీ తరఫున ఎంపీ రఘునాథరెడ్డి మద్దతు ఇచ్చారు. అలాగే అంతర్గత జల మార్గాల ఏకీకరణ బిల్లుకు కూడా వైఎస్సార్సీ మద్దతు ప్రకటించింది.

# మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు పథకంలో జీరో ఫేర్ టిక్కెట్: సిఎం చంద్రబాబు

## రాష్ట్రంలో ఇకపై ఎసి ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు

**విజయవాడ,జూలై 21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి మహిళలకు అమలు చేయనున్న ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంలో మహిళలకు జీరో ఫేరో టిక్కెట్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు... ఉచిత ప్రయాణంతో ఎంతమేర వారికి డబ్బులు ఆదా అయ్యాయి అనే అంశంపై స్పష్టత ఉండాలన్నారు.100 శాతం ప్రభుత్వం ఇస్తున్న రాయితీ.వంటి వివరాలు ఆ టిక్కెట్‌లో పొందుపరచాలని చెప్పారు. సోమవారం సచివాలయంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఏపి రాష్ట్రాలకు ఆర్థికంగా ఎంత భారం పడింది... మన రాష్ట్రంలో ఎంత వ్యయం కానుందనే అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడం ద్వారా ఎంత లబ్ధిపొందారనే విషయం రాష్ట్రంలోని మహిళా ప్రయాణికులు అందరికీ సులభంగా తెలుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఇందుకు సంబంధించి సాఫ్ట్‌వేర్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.. ఎట్టిపరిస్థితుల్లో పథకాన్ని ఆగస్టు 15 నుంచి సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

**ఆర్టీసీని లాభాల బాట పట్టించండి**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం త్వరలో అమలు చేస్తున్నందున ఆర్టీసీకి భారం కాకుండా అధికారులు కార్యచరణ చేపట్టాలన్నారు. ఇతర ఆదాయ మార్గాలు పెంపొందించుకోవడం, నిర్వహణా వ్యయం తగ్గించుకోవడంద్వారా సంస్థను లాభాలబాట పట్టించాలని సిఎం సూచించారు. లాభాల ఆర్జనకు ఎలాంటి మార్గాలున్నాయి అనే అంశంపై చర్చ జరగాలన్నారు. ఆదాయం వృద్ధికి ఎటువంటి విధానాలు తీసుకురావాలి అనే దానిపై ఒక కార్యాచరణ రూపొందించాలన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇకపై ఎసి ఎలక్ట్రానిక్ బస్సులుమాత్రమే కొనుగోలుచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం ఉన్నవాటిని ఎలక్ట్రికల్ బస్సులుగా మారిస్తే నిర్వహణా వ్యయం తగ్గుతుందని, అలాగే ఇందుకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేఅంశంపైనా అధ్యయనం చేయాలని సిఎం స్పష్టం చేశారు.

# 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం

## లోక్‌సభలో కేంద్రం వెల్లడి

**గుంతకల్లు రైల్వే, జూలై 21,ప్రభాతవార్త :** కేంద్రప్రభుత్వ సిబ్బందికి సంబంధించిన 8వ కేంద్ర వేతన సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్రప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్ సభకు తెలిపారు. సోమవారం తమిళనాడులోని శ్రీ పెరంబదూర్ నుంచి లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న డిఎంకె సభ్యుడు టిఆర్ బాబు, ఉత్తరప్రదేశ్‌లోని దౌరాహ్రా నుంచి సమాజ్ వాది పార్టీ నుంచి లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆనంద్ బహదూరియాలు అడిగిన ప్రశ్న (నెంబర్ :150)కు మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిస్తూ కేంద్రప్రభుత్వం సర్వీసులలో పనిచేస్తున్న సిబ్బంది వేతనాల పెంపుదలకు సంబంధించిన 8వ కేంద్రవేతన సంఘానికి సంబంధించి చైర్‌పర్సన్, సభ్యులతో ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిర్ణయించినట్లు వెల్లడించారు. 8వ కేంద్ర వేతన సంఘం చేసిన సిఫార్సులను అమలు చేయనున్నట్లు ఆయన లోక్‌సభకు తెలిపారు.

# జస్టిస్ వర్మ అభిశంసన!

>> ఓంబిర్లాకు ఈ నోటీసులను అందచేసారు. ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపి, టిడిపి, జెడియు, జెడిఎస్, జనసేనపార్టీ, ఎజిపి, శివసేన షిండేవర్గం, ఎల్జేఎస్‌పి, ఎస్‌కెపి, సిపిఎం ఇతరులు ఈ తీర్మానంపై సంతకాలుచేసారు. ఎంపిలు అనురాగ్‌సింగ్ ఠాకూర్, రవిశంకర్‌ప్రసాద్, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, రాజీవ్‌ప్రతాప్‌రూడీ, పిపి చౌదరి, సుప్రియా సూలే,కెసి వేణుగోపాల్ తదితరులు స్పీకర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అంతకుముందు కాంగ్రెస్ ఎంపి కె సురేష్ మాట్లాడుతూ తమ పార్టీ జస్టిస్‌వర్మపై ప్రవేశపెట్టిన తీర్మానానికి సంపూర్ణమద్దతు ఇస్తోందని అన్నారు. ఇండియా కూటమి పార్టీలుకూడా వర్మపై అభిశంసన తీర్మానానికి సంపూర్ణ మద్దతుప్రకటించాయన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే 40 మంది ఎంపిల సంతకాలను సేకరించిందని, ఇతర విపక్ష పార్టీలసభ్యులతో కలిసి సమిష్టి కృషిచేస్తుందని చెప్పారు. ఈఏడాది మార్చి 15వ తేదీ జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో 500 రూపాయలనోట్లు కాలిన కట్టలు లభించిన అంశం తీవ్ర వివాదాస్పదం అయింది. వీటిపై సుప్రీం సిజెఐ నియమించిన త్రిసభ్య కమిటీ నివేదిక, ఆపై ఆనాటి చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా సిఫారసులతో పార్లమెంటు ప్రస్తుతం అభిశంసనకు ముందుకువచ్చింది. అయితే వర్మ తన రాజీనామాచేసేందుకు తిరస్కరించారు. దీనితో ఇపుడు ఆయన తొలగింపు అనివార్యం అయింది. అయితే తనపదవీచ్యుతి తీర్మానం సవాల్‌చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. ఈ పిటిషన్ విచారణకు రానున్నది. ఏకపక్షంగా విచారణ జరిగిందని, తన అభిప్రాయాలకు గౌరవం ఇవ్వలేదని, నోట్లకట్టలకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తన వాదనలు వినిపిస్తున్నారు.

# భారతీయ చెస్‌కు గర్వకారణం కోనేరు హంపి

## అభినందించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 21,ప్రభాతవార్త ప్రతినిధి:** అంతర్జాతీయ వేదికపై కోనేరు హంపి మరింత ప్రకాశించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి నారా లోకేష్‌లు ఆకాంక్షించారు. ఫిడే వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌కు చేరిన తొలి భారత మహిళగా ఆమె అరుదైన రికార్డు సాధించారని అభినందించారు. హంపి సాధించిన విజయం పట్ల గర్వంగా ఉందన్నారు. ఇది కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు...భారతీయ చెస్‌కు గర్వకారణమైన క్షణం అని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్యానించారు. టైటిల్‌ను ఇంటికి తీసుకురావాలని కోరారు. అగ్రశ్రేణి చెస్ క్రీడాకారిణి,గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి సూపర్ ఫామ్‌ను కొనసాగిసో్తంది. గత ఏడాది ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌గా నిలిచిన ఆమె...ఇప్పుడు ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ సెమీ ఫైనల్ చేరిన తొలి భారత క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది.

# అచ్యుతానందన్ కన్నుమూత

>> ఒకరు. కేరళ రాజకీయ చరిత్రలో కీలక నేత అయిన అచ్యుతానందన్ దేశంలో అత్యంత గౌరవనీయ కమ్యూనిస్టు నేతల్లో ఒకరిగా పేరుగాంచారు. కార్మికుల హక్కులు, భూ సంస్కరణలు, సామాజిక న్యాయం కోసం ఆయన ఎంతో కృషి చేశారు. లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలకఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేతగా పేరుంది. బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేశారు అచ్యుతానందన్. ఆ తర్వాత దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ జీవనం సాగించారు. కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టి 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. స్వాతంత్ర్యానికి ముందున్న ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి స్థాయికి చేరింది. 1964లో సిపిఐ జాతీయ కౌన్సిల్‌ను వదిలేసి, సిపిఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 వరకూ కేరళ అసెంబ్లీకి ఎన్నికైన అచ్యుతానందన్, ఒకసారి (2006-2011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు. అవినీతికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఎన్నడూ వెనకంజ వేయని అచ్యుతానందన్, రాష్ట్రంలో భూ ఆక్రమణదారులపైనా సిఎంగా ఉక్కుపాదం మోపారు. ఈ చర్యలతో అనేకమంది వ్యతిరేకమైనా ఆయన వెనుకడుగు వేయలేదు. ప్రజలు, పార్టీ మధ్య అంతరం వచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ క్రమశిక్షణనూ పక్కనబెట్టి ప్రజల పక్షాన నిలబడటానికే పెద్దపీట వేశారు. ఈ క్రమంలో అవమానాలు ఎదురైనా తన నిజాయితీబాటను, నిరాడంబరతను ఏనాడూ ఆయన విడిచిపెట్టలేదు. 1923లోపుట్టినా ఆధునిక అవసరాలనుకూడా అర్థం చేసుకున్న నిత్య అధ్యయనశీలి అచ్యుతానందన్. పాతతరంలో భూమి కొంతమంది చేతుల్లో కేంద్రీకృతమైనట్లుగా, సాంకేతిక ప్రపంచంలో సాఫ్ట్‌వేర్‌ల రూపంలో కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం సాగుతోందని గుర్తించిన ఆయన, అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ కోసం ఉద్యమాలు చేశారు. 2016లో 93వ ఏట ప్రవేశించినా కమ్యూనిస్టులకు అచ్యుతానందన్ విజయవంతమైన నేతగా నిలిచారు.

# జగన్ దోచుకున్న రూ.3500 కోట్లకు రెవిన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేయాలి: యనమల

**విజయవాడ,జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి మద్యం కుంభకోణంలో మాజీ సిఎం జగన్ అధికారాన్ని అడ్డంపెట్టుకుని దోచుకున్న రూ.3500 కోట్లకు రాష్ట్రప్రభుత్వం రెవిన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేయాలని, లేని పక్షంలో కొత్త చట్టం తీసుకురావాలని తెలుగుదేశం సీనియర్ నేత యనమల రామకృష్ణుడు సూచించారు. హత్య చేసే వ్యక్తి కంటే ఆర్థిక నేరస్థుడు చాలా ప్రమాదకరమని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని గుర్తు చేశారు. 3,500 కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డి మాస్టర్ మైండ్ అయితే..ప్రధాన లబ్ధిదారుడు జగనే అని యనమల అన్నారు. ప్రజలను మోసం చేసిన వారిని న్యాయ విచారణతో పాటు ప్రజాకోర్టులోకి తీసుకురావాలని సూచించారు.

# మాజీ మంత్రి గైర్హాజర్

>> సిట్ అధికారులకు సమాచారమిచ్చారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వంలో నారాయణస్వామి ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన ప్రమేయం లేకుండానే నూతన మద్యం పాలసీని రూపొందించినట్లు సిట్ అధికారులు భావిస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయన పాత్ర ఏమీ లేదని దర్యాప్తులో తేలడమే కారణం. అందుకే మద్యం కుంభకోణం కేసులో సాక్షిగా స్టేట్ మెంట్ ఇవ్వాలని మాజీమంత్రి కె.నారాయణ స్వామికి సిట్ నోటీసులు జారీ చేసింది. లిక్కరు కుంభకోణంలో ఇప్పటికే 49 మందిని నిందితులుగా చేర్చారు. ఈ కేసులో రాజ్ కసిరెడ్డి(ఏ1) ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. తాజాగా వైసీపీ ఎంపి మిథున్ రెడ్డిని అరెస్టు చేసారు.ఈ కేసులో పలువురు కీలక నిందితులపై విచారణ కొనసాగుతోంది. నూతన మద్యం పాలసీ పేరుతో గత జగన్ ప్రభుత్వం సుమారు రూ.3500 కోట్ల వరకూ కొల్లగొట్టినట్లు సిట్ అంచనా వేస్తోంది. ప్రతి నెలా రాజ్ కసిరెడ్డి కోట్ల రూపాయలు ఎంపీ మిథున్ రెడ్డి, నాటి వైఎస్సార్సీ నేత విజయసాయిరెడ్డి, జగన్ సతీమణి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ ఆర్థిక వ్యవహారాలు చూసే గోవిందప్ప బాలాజీకి (ఏ33) అందజేసేవాడని వెల్లడించింది. మొత్తంగా ఈ కేసులో జగన్ మోహన్‌రెడ్డి అంతిమ లబ్ధిదారుగా ఉన్నాడని సిట్ ఆదివారం విడుదల చేసిన 305 పేజీల ప్రాథమిక అభియోగపత్రంలో పేర్కొంది.

### వారం - వర్జ్యం

22-07-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
ద్వాదశి ఉ.7.06, త్రయోదశి తె.4.40
మృగశిర రా.7.26
వర్జ్యం : రా.3.19-తె.4.49
దు.ఉ.8.22-9.14, 2) రా.11.55-12.47
శుభసమయం: ఉ.7.30-8.15, సా.6.46-7.30
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకొంటారు. పెట్టుబడులకు తగిన సమయం.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. వివాహ యత్నాలు నిదానంగా సాగుతాయి.

**మిథునం:** భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**కర్కాటకం :** ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**సింహం:** ఆర్థిక వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. ఇంటా బయటా చికాకులు ఎదురైనా సన్నిహితులు సాయం అందిస్తారు.

**కన్య :** బంధువులతో ఏర్పడిన మనస్పర్థలు పరిష్కరించుకొంటారు. పెట్టుబడులలో స్వల్పలాభాలు పొందుతారు.

**తుల :** ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎదురైన చికాకులు తొలగించుకొంటారు. అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** దీర్ఘకాలిక సమస్యలు చాకచక్యంగా పరిష్కరించుకొంటారు. సంతానం అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు.

**ధనుస్సు:** మిత్రుల సాయంతో ముందుకు సాగుతారు. కాంట్రాక్టులు పొందుతారు. వృత్తి,వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**మకరం:** ఆర్థిక వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు.

**కుంభం:** బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా సాగుతాయి.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. సోదరుల నుండి ఆస్తిలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాయచూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలలో మిశ్రమం

**గుంతకల్లు రైల్వే, జూలై 21,ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని రాయచూరు రైల్వే ఇన్స్‌స్టిట్యూట్ పాలక మండలికి జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 234ఓట్లకు గాను 219ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. సోమవారం రాయచూరు రైల్వే ఇన్స్‌స్టిట్యూట్‌లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరిగింది. అనంతరం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎంప్లాయిస్ సంఘ్ బలపరిచిన అభ్యర్థులు : కార్యదర్శిగా సంజీవ్,కోశాధికారిగా పల్లా చెన్నకేశవలతో పాటు మరో ముగ్గురు కమిటీ మెంబర్లను సభ్యులు ఎన్నుకున్నారు. మజ్దూర్ యూనియన్ బలపరిచిన అభ్యర్థులు : సంయుక్త కార్యదర్శిగా వి వెంకట ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మరో ముగ్గురు కమిటీ సభ్యులను సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటర్లు ఎన్నుకున్నారు. మొత్తం మీద పాలకమండలిలో ఎంప్లాయిస్ సంఘ్‌కు ఐదుగురు,మజ్దూర్ యూనియన్‌కు నలుగురు సభ్యులున్నారు.

# అజ్ఞాతంలోకి పేర్ని నాని

>> చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. హైకోర్టులోనూ ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించినా చుక్కెదురు కావడంతో పేర్ని నాని ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన కోసం గాలిస్తున్న ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి రప్పా.. రప్పా.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసారంటూ తెలుగుదేశం కార్యకర్తలు పేర్ని నానిపై కృష్ణా జిల్లా పామర్రు పిఎస్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్‌స్టేషన్లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. పామర్రు కేసును కొట్టివేయాలంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు పేర్ని నాని విజ్ఞప్తిని తోసిపుచ్చుతూ తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది.

# రాష్ట్రమంతా జోరుగా వర్షాలు

>> నీరు వచ్చి చెరువులు నిండు కుండల్లా మారుతున్నాయి. మార్కాపురం మండలం వేములకోట చెరువుకు పెద్ద ఎత్తున వాగు నుంచి వర్షపు నీరు వస్తుంది. గత పదేళ్లలో ఎన్నడూ లేని నీరు ప్రస్తుతం వస్తుండడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోనసీమ జిల్లాలో నిన్న రాత్రి నుంచి వర్షం కురవడం మొదలైంది. జిల్లా కేంద్రమైన అమలాపురం, పి.గన్నవరం, అంబాజీపేట, సఖినేటిపల్లి ప్రాంతాల్లో తెలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఈరోజు తెల్లవారుజామున నుంచి కూడా మోస్తరు వర్షం అక్కడక్కడ కురుస్తున్నాయని విజయవాడ (అమరావతి) వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాబోయే 5 రోజుల్లో ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పిడుగులు కూడా పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాబోయే నాలుగు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వివరించింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతోపాటు ద్రోణి ప్రభావం కొనసాగుతోందని, దీని వల్ల భారీ వానలు పడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

ఆదివారం వరకూ ఉన్న ఉపరితల ఆవర్తనం దక్షిణ ఒడిశా పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి నైరుతి దిశగా ప్రయాణిస్తోందని వెల్లడించారు. కర్ణాటక నుంచి దక్షిణ ఆంధ్రప్రదేశ్ వరకూ ద్రోణి ప్రభావం కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. ఎపిలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జులై 24వ తేదీన ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.విజయవాడ నగరాల్లో ఉదయం, సాయంకాల సమయాల్లో కుంభవృష్టి కురుస్తుంది.దీంతో కొన్ని ప్రాంతాల్లో వాన నీరు చేరి ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతుంది,కొత్తవారి గుడి దగ్గరల్లోను, సోరంగం దగ్గరలోను, కరెన్సీ నగర్‌కు వెళ్లే దారుల్లో వాననీరు చేరుతుంది. గుంటూరులో వర్షం అధికంగానే ఉంది, ఏలూరు, కాకినాడ, భీమవరం, టమచిలీపట్టణం నగరాలపై వర్షం ప్రభావం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రల్లో వర్షం జనజీవనాన్ని ప్రభావితం చేస్తుంది.

**మంత్రి గొట్టిపాటి రవికుమార్ టెలీకాన్ఫరెన్స్**

ఇక వర్షాల ప్రభావంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయవాడ పరిధిలో విద్యుత్ శాఖ అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షాలు, ఈదురుగాలుల వల్ల కూలిన కరెంటు స్తంభాలను పునరుద్ధరించాలని అన్నారు. తెగిన విద్యుత్ తీగలు, దెబ్బతిన్న ఫీడర్ల పునరుద్ధరణ చర్యలను చేపట్టాలని తెలిపారు.

# పెట్టుబడులు ఆకర్షించండి

>> భారీస్థాయిలో ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాల్సి ఉందని సిఎం స్పష్టం చేశారు. అదే సమయంలో ఉత్పత్తి చేసిన పరికరాలకు బ్రాండ్‌ను సృష్టించటం అనేది కీలకమైన అంశమని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ విస్తృత ఉత్పత్తికి ఆస్కారం ఇచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఉత్పత్తికి అనువైన ఎకో సిస్టంను కూడా ఏర్పాటు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 100 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులను ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆకర్షించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సిఎం సూచించారు. ప్రస్తుతం ఈ రంగంలో బెంగుళూరు, చెన్నై లాంటి నగరాల్లో భూమి లభ్యత తీవ్రంగా ఉందని ఎపికి ఇది సానుకూల అంశమని... రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ పరిశ్రమల్ని స్థాపించేందుకు అనుకూల ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. తిరుపతి సమీపంలోని శ్రీసిటీ, కర్నూలు సమీపంలో ఓర్వకల్లు, కొప్పర్తి, హిందూపూర్ లాంటి ప్రాంతాలు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయని స్పష్టం చేశారు. వీటితో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల్ని ప్రోత్సహించేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రతీ ఇంటికీ ఓ పారిశ్రామిక వేత్త ఉండాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు.

**విశాఖ, అమరావతి, తిరుపతి మూడు రీజియన్లు ఐటీ కంపెనీలకు అనుకూలం**

విశాఖ, అమరావతి, తిరుపతి నగరాల్లో ఐటీ కంపెనీల ఏర్పాటుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాంతాల్లో 500 ఐటీ కంపెనీలకు కేటాయించటం ద్వారా ఒకేసారి ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. విశాఖలో ఐటి ఐటిఇఎస్ సంస్థలతో పాటు లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకూ మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చని అన్నారు. ఈ ప్రాంతాల్లో కోవర్కింగ్ స్పేస్‌లను కూడా ఏర్పాటు చేయాలని సిఎం సూచించారు.



ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులు

## ఆక్వాటిక్ చాంపియన్ షిప్ పోటీలలో అనంతపురం క్రీడాకారుల ప్రతిభ

**అనంతపురం, జులై 21 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జూనియర్ సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో అనంతపురంకు చెందిన ఈత క్రీడాకారులు వారి ప్రతిభ చాటి అందరి మన్ననలను పొందారు. వివరాల మేరకు.. ఈ నెల 19, 20వ తేదీలలో విశాఖపట్నంలో జరిగిన సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ ఛాంపియన్షిప్ పోటీలలో అనంతపురం జిల్లాకు చెందిన ఈత క్రీడాకారులు 5 స్వర్ణం, 2 రజతం, 3 కాంస్య పతకాలను గెలుచుకొని రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచారు. ఈ పోటీలలో గ్రూప్-1 క్రీడాకారుడు ఎస్. కార్తికేయ 5 స్వర్ణ పతకాలను గెలుచుకోవడమే కాకుండా వ్యక్తిగత ఛాంపియన్షిప్ కైవసం చేసుకొని తన సత్తాను చాటుకున్నాడు. గ్రూప్-1 యస్.కార్తికేయ 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ స్వర్ణం 00:29:85 సెకండ్స్, 100 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ స్వర్ణం 01:06:10, 200 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ స్వర్ణం 02:26:52, 100మీటర్లు ఫ్రీస్టయిల్ స్వర్ణం 00:58:30 సెకండ్స్, 200 మీటర్లు ఫ్రీస్టయిల్ స్వర్ణం 02:07:67, పి.అకుల్‌సాయి, 100మీటర్లు బ్యాక్ స్ట్రోక్ కాంస్యం 01:21:57, 200మీటర్లు బ్యాక్ స్ట్రోక్ కాంస్యం 03:00:29,

గ్రూప్-2 ఎమ్.ఎస్.ఎస్.జస్విన్ నాయుడు 100మీటర్లు బ్యాక్ స్ట్రోక్ రజతం 01:16:05, 200మీటర్లు బ్యాక్ స్ట్రోక్ రజతం 02:54:01, 50మీటర్లు బ్యాక్ స్ట్రోక్ కాంస్యం 00:34:84, పతకాలను గెలుచుకున్న ఈత క్రీడాకారులను జిల్లా ఈత సంఘం అధ్యక్షులు కామని రవిశేఖర్ రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు వెంకట రెడ్డిలు అభినందించారు.

# ముసుగులో ఉన్న రాజకీయ నేరస్తుడు జగన్

## హోం మినిస్టర్ అనిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హోం మినిస్టర్ అనిత

**మడకశిర టౌన్ జూలై 21 ప్రభాతవార్త.** ముసుగులో ఉన్న రాజకీయ నేరస్థుడు జగన్మోహన్ రెడ్డి అని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. మడకశిర పట్టణం లో ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో హోం మినిస్టర్ వంగ లపూడి అనిత మాట్లాడుతూ: రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఏ ఒక్కరి పైన తప్పుడు కేసులు పెట్టలేదని. తప్పు చేసిన వారి పైనే కేసులు పెడుతున్నామన్నారు ఎంపీ మిథున్ రెడ్డిని కూడా చట్ట పరిధిలోనే అరెస్ట్ చేశామన్నారు. మిథున్ రెడ్డి అరెస్ట్ అక్రమ సక్రమ అనేది కోర్టు తేలుస్తుంది అన్నారు. గత ప్రభుత్వం మాదిరి కక్ష సాధింపులు చేయడం లేదని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంలోపే ప్రజల్లోకి ధైర్యంగా తిరుగుతున్నామన్నారు. చేసిన మంచిని చెప్పుకోవడానికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాయలసీమను ప్రపంచవైపు చూసే విధంగా కూటమి ప్రభుత్వం పరిశ్రమలు తీసుకువస్తుంది అన్నారు. అందులో భాగంగానే మడకశిర కు 2,700 కోట్లతో డిఫెన్స్ పరిశ్రమను ఈ ప్రాంతంలో 7,000 కోట్లతో 2,000 మెగా వాట్లు సోలార్ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రైతుల నుండి భూములు కూడా స్వీకరించడం ప్రారంభించింది అన్నారు. రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా తగ్గిపోయింది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి రెండు డ్రోన్ కెమెరాలు అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు సినిమాలు సీరియల్ లో అధికంగా హింసను ప్రేరేపించే విధంగా చూపిస్తున్నారు. దీనిపై మేధోమదం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి సామాజిక స్పృహ అవసరమన్నారు. జిల్లాకు హంద్రీనీవా ద్వారా సాగునీరు త్రాగునీరు ఇచ్చామన్నారు 11 మందిని ఇచ్చి జగన్కు ఇంటికి పంపించిన ఇంకా బుద్ధి రాలేదు అన్నారు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్నారు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అని కొనియాడారు, గత ప్రభుత్వంలో నాడు నేడు ద్వారా పైన పటారం లోన లొటారం ల రంగులు వేసి నిధులు దోచుకున్నారు అన్నారు, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి. కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ. మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు. జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్. మండల కన్వీనర్లు. కౌన్సిలర్లు వైస్ చైర్మన్ లు వెంకట లక్ష్మమ్మ. ప్రభావతి. ఉమా శంకర్.శ్రీనివాసులు. సుభద్ర నాగేంద్ర. విక్రమ్. మేఘన రమేష్.కార్యదర్శి తిమ్మరాజు. నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## పల్లవోత్సవంలో చైర్మన్ నాయుడుతో మైసూరు మహారాజు కుటుంబం



**తిరుమల,జూలై 21ప్రభాతవార్తప్రతినిధి:** మైసూరు మహారాజు జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం తిరుమలలో పల్లవోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుండి సాయంత్రం శ్రీదేవి భూదేవిసమేత మలయప్ప స్వామి ఊరేగింపుగా కర్నాటక సత్రానికి చేరుకున్నారు. ఇక్కడ అర్చకులు, మైసూరు మహారాజు కుటుంబీకులు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాద నివేదించారు. మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదాదేవి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్‌లు టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడును దుశ్శాలువతో, మెమోంటోతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కర్నాటక దేవాదాయశాఖ కమిషనర్ ,బోర్డు సభ్యులు నరేశ్,కృష్ణమూర్తి ,తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,జూలై 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. సోమవారం ఉదయం ఎంపి కమ్మంపాటి రామ్మోహన్‌రావు, మాజీఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, హైకోర్టు జడ్జి జస్టీస్ చంద్రకుమార్ వేర్వేరుగా ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# అన్యమత ఉద్యోగులపై చర్యలకు సిద్ధం!



**తిరుమల,జూలై 21ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానంలో ఉద్యోగం చేస్తూ అన్యమతాన్ని ఆచరిస్తున్న, ఆ మత ప్రార్థనలు చేసుకుంటున్న టిటిడి ఉద్యోగులను సాగనంపాలని కృతనిశ్చయంతో ప్రభుత్వ ఆదేశాలతో టిటిడి పాలకమండలి సిద్ధమైంది. ఇప్పటికే కొందరు ఉద్యోగులు టిటిడిలో పనిచేస్తూ అన్యమతాన్ని ఆచరిస్తున్నారనే ఆధారాలతో వారందరిపై చర్యలు తీసుకున్న విషయం విదితమే. ఇప్పుడు టిటిడిలో హిందూ మతంపై విశ్వాస మున్న ఉద్యోగులు పెద్దఎత్తున నిరసనలు తెలియజేసే రీతిలో ఉన్నారు. అన్య మత ఉద్యోగుల విషయంలో ఇక ఉపేక్షించ కూడదని బోర్డు కఠినంగా వ్యవహరించనుంది. దీనిపై ఇప్పటికే కేంద్ర మంత్రి, టిటిడి బోర్డు సభ్యులు కూడా తీవ్రస్థాయిలో ఆగ్రహం వెలిబుచ్చిన విషయం విదితమే.ఈ నేపథ్యంలో మంగళవారం(నేడు) తిరుమల అన్నమయ్య భవనంలో జరిగే పాలక మండలి సమావేశంలో అన్యమత ఉద్యోగులను సాగనంపేందుకు ఆమోదం తెలపనున్నారు. ఇప్పటికే తిరుమలలో దుకాణాల లైసెన్స్‌ల రెన్యువల్, దుకాణాలు ఏర్పాటులో అవకతవకలు వంటి అంశాలతో బాటు తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో మరింత మెరుగ్గా పేదలకు వైద్యసేవలందించేందుకు అవసరమైన వైద్యుల నియామకం, మౌళిక సదుపాయాలు కల్పన, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న భవనాలను ఉపయోగంలోకి తీసుకురావ దానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. రోజురోజుకూ తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రెట్టింపవుతుండటంతో వారికి తగిన సౌకర్యాలు కల్పిస్తున్నా ఆలయం వెలుపలకు క్యూలైన్లు రాకుండా చూడాలని సిఎం చంద్రబాబునాయుడు కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో తిరుమలలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం సాధ్యాసాధ్యాలపై బోర్డు చర్చించి తగిన విధంగా నిర్ణయాలు తీసుకోనుంది. ఇక కాంట్రాక్టు ఉద్యోగుల సమస్య లపై బోర్డులో చర్చకు వచ్చే సూచనలు ఉన్నాయి.

## మొదటిఘాట్ రోడ్డుపైనే వన్యప్రాణుల సంచారం!

### - కాలినడక మార్గాల్లోనూ అలర్ట్ అయిన టిటిడి



**తిరుమల,జూలై 21ప్రభాతవార్తప్రతినిధి:** దట్టమైన శేషాచలం కొండల మధ్యలో తిరుమలకు ఉన్న రెండు ఘాట్‌రోడ్లలో మొదటిఘాట్‌రోడ్డుపైనే చిరుతపులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు సంచారం ఎక్కువగా ఉంటుంది. తరచూ ఈ ఘాట్‌లో అటు వాహనదారులు,ఇటు కాలినడక భక్తులు కలిసే ఏనుగుల ఆర్చి వద్ద, ఏడవమైలు ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో చిరుతపులులు రోడ్డుదాటుతూ కనిపిస్తుండటం జరుగుతుంది. తిరుమల పుణ్యక్షేత్రం కావడంతో ఉదయం నుండి రాత్రి వరకు తిరుమలకు టిటిడి ఉద్యోగులు, స్థానికులు, వ్యాపారులు, ఇతరత్రా పనులపై ద్విచక్రవాహనాలపై అత్యధికంగా ఘాట్‌రోడ్లపై రాకపోకలు సాగిస్తుంటారు.ఈ సమయాల్లో చిరుతపులులు తరచూ వాహనదారులకు కంటపడుతున్నాయి. అయితే సమాచారం అందుకుని టిటిడి అటవీశాఖ, విజిలెన్స్ అధికారులు శబ్ధాలు చేస్తూ వాటిని అడవిలోకి మళ్ళించేస్తారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం వన్యప్రాణులు సంతానోత్పత్తి జరుపుకునే సమయం కావడంతో ఆగస్ట్, సెప్టెంబర్‌మాసాల్లో వన్యప్రాణులు, చిరుతపులులు, ఎలుగుబంట్లు, అడవిలో ఒకచోటనుండి మరోచోటుకు సంచరిస్తూ కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్లపై కనిపిస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఏకంగా ద్విచక్రవాహనదారులను రాత్రి 9గంటల వరకే అనుమతించాలని టిటిడి నిర్ణయించింది. భక్తులేగాక స్థానికులు, వ్యాపారులు, టిటిడి ఉద్యోగులు విధులు ముగించుకుని సాయంత్రం తరువాత ఘాట్‌లో ద్విచక్రవాహనాలపై తిరుపతికి దిగుతుంటారు. రాత్రి 11గంటల వరకు ఇలా వాహనాల్లో దిగుతుంటారు. వీరికి పూర్తిరక్షణ కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాచరణ అమలుచేసింది. అలాగే అలిపిరి నడకమార్గంలో గాలిగోపురం వద్ద నుంచి ఏడవమైలు మీదుగా లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు మెట్లమార్గంలో వందమంది వరకు భక్తులను గుంపుగా పంపుతున్నారు.

# పోలీసుకు సాంకేతిక పరిజ్ఞానం కీలకం, సత్యశోధనలో సృజనాత్మక దృక్పథం అవసరం : డిజిపి



**విజయవాడ,జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (హైదరాబాద్) 77 ఆర్ఆర్ బ్యాచ్‌కు చెందిన 28 మంది ప్రొబెషనరీ ఐ.పి.ఎస్. అధికారులు స్టడీ,కల్చరల్ టూర్ లో భాగంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర పోలీస్ ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పోలీస్ ఉన్నతాధికారులు పోలీస్ శాఖలోని పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు.ప్రధానంగా పోలీస్ శాఖలో అమలవుతున్న సంస్కరణలు, పోలీసింగ్ లో టెక్నాలజీ వినియోగం, నేరాల నియంత్రణ, సైబర్ నేరాలను అరికట్టడానికి పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలు గురించి వివరించి అవగాహన కల్పించడం జరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వైజాగ్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర విజయవంతానికి తీసుకున్న చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ , క్రౌడ్ కంట్రోలింగ్ కు వాడిన సాంకేతికతను గురించి ప్రొబెషనర్ ఐ.పీ.ఎస్. అధికారులకు వివరించారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ శాఖ రూపొందించిన "అస్త్రం" యాప్ గురించి, మహిళలు, బాలికల రక్షణకు రూపొందించిన శక్తి యాప్ "శక్తి టీమ్స్", రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఏర్పాటు చేసిన "ఈగల్ టీమ్స్ సాధిస్తున్న ఫలితాల, పనితీరు గురించి వివరించారు. నేరపరిశోధనలో "ఏఐఖి వినియోగం గురించి, పోలీసింగ్ మరియు ప్రజాసేవలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలను అన్వేషించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఇటీవల అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "ఏఐ హ్యాక్ థాన్"వివరాలను తెలిపారు. ఇందులో అభివృద్ధి చేసిన పలు సాంకేతిక అంశాల మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ టెక్నాలజీ పెరిగే కొద్దీ నేరస్తులు పోలీసు శాఖకు సరికొత్త సవాళ్లను విసురుతున్నారన్నారు. వీటిని అధిగమించడానికి యువ పోలీస్ అధికారులు టెక్నాలజీ మీద మరింత పట్టుసాధించాల్సిందిగా సూచించారు. పోలీసుకు సాంకేతిక పరిజ్ఞానం కీలకం, సత్యశోధనలో సృజనాత్మక దృక్పథం అవసరం అన్నారు.

యువ ఐ.పీ.ఎస్ అధికారులు పోస్టింగ్ పొందిన ప్రాంతాల్లో స్థానిక భాషల మీద పట్టు సాధించాలని ఉద్బోధించారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెరపాలంటే భాషే మార్గమన్నారు. కెరీర్ కొత్తల్లో తాము ఎదుర్కొన్న సవాళ్లను, పోలీస్ శాఖలో ఎదురయ్యే వివిధ రకాల సమస్యలు, సవాళ్లపై తన స్వీయ అనుభవాలను యువ ఐ.పీ.ఎస్ అధికారులతో డీజీపీ పంచుకున్నారు

## విజయవాడలో 24వ తేదీన చదరంగం పోటీలు

**విజయవాడ,జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరంలోని ఠాగూర్ గ్రంథాలయం నందు జులై 24 వ తేదీ 135వ అయ్యంకి వెంకట రమణయ్య మెమోరియల్ సందర్భంగా సంయుక్తంగా జిల్లా స్థాయి చదరంగం పోటీలను నిర్వహిస్తున్నారు.ఉమ్మడి కృష్ణా జిల్లాలలోని అన్ని వయస్సుల వారికి ఈ పోటీలు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు సరస్వతీ సామ్రాజ్యం ట్రస్ట్ అధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీ అయ్యంకి మురళీకృష్ణ. గ్రంథాలయం గ్రేడ్ వన్ టి ఎం ఎల్ ఆఫీసర్ కె రమాదేవి తెలిపారు.ఈ చదరంగం పోటీలకు జిల్లాలలోని అన్ని స్కూలు విద్యార్థినీ విద్యార్థులు క్రీడాకారులు విజయవంతం చేయా లని వివరాలకు 778046 6509, 9030 308 811 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## స్వచ్ఛ విజయవాడ, ప్లాస్టిక్ నిషేధంపై డ్యాన్స్ పోటీలు

### జూలై 27న కృష్ణాతీరంలోని హరిత బెరం పార్క్‌లో డ్యాన్స్ కాంపిటీషన్స్ ప్రారంభం : కలెక్టర్ లక్ష్మీశ



**విజయవాడ జూలై 21, ప్రభాతవార్త ప్రతినిధి:** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛ విజయవాడ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అవగాహన పెంచేందుకు డ్యాన్స్ కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బెరం పార్క్ లో డాన్స్ కాంపిటీషన్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొని పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఆదివారం జూలై 27న హరిత బెరం పార్క్ లో డాన్స్ కాంపిటీషన్స్ ప్రారంభం అవుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి వయసు గల వారికి వివిధ కేటగిరీలు ఉంటాయని, మొదటి క్యాటగిరిలో 6 కంటే తక్కువ వయసు, ఏడు నుంచి పది వయసుగల వారు రెండో కేటగిరీ, 11 నుండి 15 వయసు గల వారు మూడో క్యాటగిరి, 16 సంవత్సరాలు కంటే ఎక్కువగా ఉన్నవారు నాలుగో కేటగిరీలో డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోలో,,గ్రూప్ పర్ఫామెన్‌లు క్లాసికల్,జనరల్ క్యాటగిరిలలో ఈ పోటీ కేటగిరీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు విజయవాడ నగర పాలక సంస్థ వారి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన పోస్ట్ లో ఉన్న రిజిస్ట్రేషన్ లింక్ ను క్లిక్ చేసి, వివరాలు నింపి రిజిస్టర్ చేసుకోగలరని తెలిపారు. లేదా కోడ్ ని స్కాన్ చేసి రిజిస్టర్ చేసుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కె. చైతన్య, వెస్ట్ ఎమ్మార్వో షేక్ ఇంతియాజ్, విజయవాడ నగరపాలక సంస్థ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరావతిలో రెండో విడత ల్యాండ్ పూలింగ్‌పై ఎవరూ అభ్యంతరం చెప్పలేదు - మంత్రి నారాయణ

**విజయవాడ జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని ప్రాంతంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్‌పై ఎవరూ అభ్యంతరం చెప్పలేదని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి, పురపాలకశాఖ ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ పొంగూరు తెలిపారు.ల్యాండ్ పూలింగ్‌పై వచ్చే కేబినెట్‌లో చర్చిస్తామని తెలిపారు. కేబినేట్ సబ్ కమిటీలో మాట్లాడిన తర్వాత ల్యాండ్ పూలింగ్‌పై ముందుకెళ్తామని తెలిపారు. అమరావతి క్యాపిటల్ సిటీలో లీగల్, టెక్నీకల్ సమస్యలు అన్ని పరిష్కరించామని తెలిపారు. సోమవారం అమరావతి ప్రాంతంలో మంత్రి నారాయణ పర్యటించారు. రాజధానిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడారు. 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లకు టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, మంత్రుల బంగ్లాలు పరిశీలించామని చెప్పారు మంత్రి నారాయణ. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు 12 టవర్లు కేటాయించామని, మొత్తం 288 అపార్టుమెంట్లు అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆలిండియా సర్వీస్ అధికారులకు ఆరు టవర్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు.

## ఎఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధపడిన జెసి

### ఎస్పీ అయినా, ఏఎస్పీ అయినా ఏమీచేయలేరంటూ చిందులు

**అనంతపురం, జులై 21, ప్రభాతవార్త బ్యూరో:** తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండల పరిధిలో పోలీసు బందోబస్తు మధ్య పవర్‌గ్రిడ్ టవర్ల ఏర్పాటుకు ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం ఏఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధపడినట్లు మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు. టవర్ ఏర్పాట్లకు భూములిచ్చిన రైతులు నష్టపోయారని, వారితో పెద్దఎత్తున తరలివచ్చి నిరసన తెలుపుతామని, చేతనైతే అడ్డుకోవాలంటూ ఏఎస్పీకి జేసీ సవాల్ విసిరారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన చైతన్యే నీకంటే మేలని, నీవు వచ్చీరాగానే మొదలు పెట్టావని, పవర్‌గ్రిడ్ వాళ్లతో ఎంత నొక్కావని ఏఎస్పీని ఉద్దేశించి మాట్లాడారు. గత అయిదేళ్లలో తాము తీవ్రంగా నష్టపోయామని, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని మా కష్టాలు నీవు తీరుస్తావా, వాటన్నింటికీ సమాధానాలు చెప్పాలని జేసీ పేర్కొన్నారు. పోలీసు బందోబస్తుతో టవర్ నిర్మాణ పనులు చేపడతావా, మా అనుచరులపై కేసు నమోదు చేయిస్తావా అంటూ ఏఎస్పీపై ఊగిపోయారు. మా దగ్గర అన్ని జీవోలు ఉన్నాయని, నీవు ఫిర్యాదు చేస్తే మేము ఫిర్యాదు చేస్తామని, నీ మీద కేసు కూడా పెడతామని ఏఎస్పీని ఉద్దేశించి హెచ్చరించారు. తన భార్య, కోడలుతో ఏఎస్పీ కార్యాలయం వద్దకు బుధవారం ఉదయం వచ్చి కూర్చుంటామని, ఏఎస్పీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండు చేశారు. ఈ నెల 18న జరిగిన సంఘటనకు ఏఎస్పీనే కారణమని, అందులో కూడా మా అనుచరులపై కేసు నమోదు చేయడం ఏమిటని జేసీ ఏఎస్పీపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

## ప్రజాశ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా సేవలు

### ప్రతి గిరిజన గ్రామంలో అభివృద్ధి కనిపించాలి: మంత్రి సంధ్యారాణి



**తిరుపతి,జూలై 21ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణతో ముందుకువెళుతున్నారని, సిఎంను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ కష్టపడి సంక్షేమాన్ని ప్రజలకు అందించాలని రాష్ట్రమహిళ శిశుసంక్షేమశాఖ,గిరిజనసంక్షేమశాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి గిరిజన గ్రామంలో అభివృద్ధి ఫలాలు కనిపించాలని, సమస్యల పరిష్కారానికి అవసరమైన మార్పులు,చర్యలు తీసుకోవడంలో అధికారులు ముందుండాలని అన్నారు. రాష్ట్రంలో ప్రజా శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్ళాలని మంత్రి అధికారులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతి పద్మావతి విశ్రాంతిభవనంలో మహిళ స్త్రీసంక్షేమశాఖ, గిరిజనసంక్షేమశాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో గిరిజన విద్యాసంస్థలు,వసతిగృహాలు, శిశు సంక్షేమ కేంద్రాల అభివృద్ధికి అనేక నిధులు మంజూరయ్యాయని తెలిపారు. బాలికల హాస్టల్ తిరుపతిలో కొత్తభవనాలు, సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణాలకు 352లక్షలు రూపాయలు, ఇఎంఆర్ఎస్ 2 క్రింద 180లక్షలతో అదనపు సిబ్బంంది నివాసాల నిర్మాణాలు చేపడుతామన్నారు. శ్రీకాళహస్తిలోని అప్పర్‌బాలుర వసతిగృహంకు 240లక్షలు రూపాయలు, సిఎస్ఆర్ నిధులక్రింద 23సంస్థలకు కలిపి 176.55లక్షలు మరమ్మతులు, ఆధునీకరణకు వ్యయంచేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనులు పూర్తయితే తిరుపతిలజిల్లాలో గిరిజన విద్యాసంస్థలు, హాస్టల్స్, శిశుసంక్షేమ కేంద్రాలకు మౌళికసదుపాయాలు మెరుగవుతాయని అన్నారు. ప్రతి చిన్నారికి పోషకాహారం ,విద్య,ఆరోగ్యం చేరువకావాలన్నారు. పథకాల్లో పారదర్శకత ఉండాలని ,క్షేత్రస్థాయిలో సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలని మంత్రి ఆదేశించారు.

### వైసిపి నేత బిరదవోలు అరెస్టు : నేతలలో ఆందోళన

**పొదలకూరు (నెల్లూరు), జూలై 21, ప్రభాతవార్త :** పొదలకూరులోని రుస్తుం మైనింగ్ కేసులో వైసిపి నేత బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల ఈ కేసులో శ్రీకాంత్‌రెడ్డిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే రుస్తుం మైనింగ్ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి,పలువురు రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. శ్రీకాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో తన నివాసంలో అరెస్టు చేసి పోలీసులకు నెల్లూరుకు తీసుకొని వస్తున్నారు. విషయం తెలిసి వైసిపి నేతలలో ఆందోళన నెలకొంది.

## ఎర్రచందనం కేసులో ఐదేళ్లు జైలుశిక్ష మూడు లక్షలు జరిమాన

**రొంపిచెర్ల, జులై 21, ప్రభాతవార్త:** ఎర్రచందనం కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, మూడు లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎ. నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. డిప్యూటీ రేంజ్ అధికారి బాబు ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... 2018వ సంవత్సరం జూలై 3న బెంగళూరుకు చెందిన టి.మునియప్ప, ఎం. మంజునాథలు ఆరు ఎర్రచందనం దొంగలను తరలిస్తుండగా రొంపిచెర్ల మండలం, మోటుమల్లెల గ్రామపంచాయతీ, పెండ్లికణం గుడి సమీపంలో అప్పటి రేంజ్ ఆఫీసర్ రామ్లా నాయక్, సెక్షన్ ఆఫీసర్ చిన్నబాబు, బీట్ ఆఫీసర్ జగదీష్ దాడి చేసి పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ఆరు ఎర్రచందనం దొంగలను స్వాధీనం చేసుకొని నిందితులతో పాటు కోర్టుకు అప్పగించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నెం.18/ఎ.టి.ఓ/నిట్ నెం.597/2025-26, తేది: 18.07.2025
గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, బాపట్ల వారి కార్యాలయ పరిధిలోని గ్రామములో SBM గ్రాంట్ ద్వారా హాస్టల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన 1 పనికి అంచనా విలువ: రూ.18.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లను ఇ-సైటు నందు తేది: 25.07.2025 నుండి అందుబాటులో ఉండును. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.inలో చూడగలరు. సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, బాపట్ల
DIPR.No.17048/CL/Advt/1/1/2022-23, తేది: 21.07.2025


ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)
NIT No. 16/MAU61-USI0HB(OTH)/335/2025-CETT Dt.19.07.2025.
E Procurement Short Tender Notice
Name of Work: "Providing Approach Roads to the Institutions allotted lands in the Amaravati Capital City"– Estimate Cost Rs.2,02,40,000/-
The bid can be downloaded on AP e-procurement portal from 23.07.2025 to 31.07.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 31.07.2025 up to 15.00 Hrs, Technical bid opening 31.07.2025 @16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Vijayawada.

ఏ రాయిని విసిరాం అని కాదు చూడాల్సింది. యుద్ధానికి అది తనవంతు సాయం చేసిందా లేదా అనేది చూడాలి.

-విండ్సర్

# ఉరి గురి?

పాకిస్థాన్‌లో ఇక మరణ శిక్షలుండవు. ఇక నేరగాళ్లు చెల్లాచెదురుగా విజృంభించవచ్చునేమో! అనుమానం రాక తప్పదు. పాక్ పార్లమెంటు క్రిమినల్ (అమెండ్‌మెంట్) 2025 చట్టంగా ఆమోదం పొందిన 'న్యాయ సవరణలు' మంచివే అనుకుందాం. కానీ భయం భక్తీ లేకపోతే ఎవరైనా, ఎంతకైనా తెగించి రెచ్చిపోయే కలికాలంలో ఉన్నాం కదా! ఆలోచించాలి. అవి ఎవరి సంస్కరణకు ఉపయోగపడతాయో! ప్రస్తుత పాకిస్థాన్‌లో సవరణ బిల్లు టెర్రరిస్టులకు హైజాకర్లకు ఆశ్రయం ఇవ్వడం, మహిళలకు బహిరంగంగా వలువలూడదీయడం వంటి నేరాలకు గతంలో ఉన్న మరణశిక్షను యావజ్జీవ ఖైదుగా మార్చారు. ఈ బిల్లును పాక్ హోంశాఖ సహాయ మంత్రి తలాల్ చౌదరి పాకిస్థాన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 354 ఎ, 402సి లలో సవరణ బిల్లు ప్రతిపాదించి నెగ్గించుకున్నారు. ఈ బిల్లు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించేవారికీ మరణశిక్ష రద్దు చేస్తోంది. అంటే భారతదేశం భయపడుతున్నట్లుగానే ఏ దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు చేపట్టినా పాక్ రక్షణలో ఉన్న ఉగ్రవాదులకు పాకిస్థాన్ దేశ చట్టాల ప్రకారమే శిక్షలు ఉంటాయనే మిషతో వారిని జీవించినంతకాలం బతికించాలనే ఉద్దేశం కనపడుతోంది. మహిళలను వివస్త్రను చేసిన వారికి ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన వారికి మరణశిక్ష లేదంటే ఇకపై దుష్కృత్యాలకు పాల్పడే వారిని పరోక్షంగా కఠినశిక్షల నుంచి తప్పించినట్లే. అంతే కాదు ఇలాంటి నేరాలకు ఇక ఎంతో తేలికగా పాల్పడవచ్చునని దాయాది దేశ సంజాతులకు పరోక్ష వెసులుబాటే కదా! మరో అర్థం తారసిల్లదు. పాక్ సెనేట్‌లో తీవ్రంగా చర్చించినా వ్యతిరేకించిన వారి అభిప్రాయాలకు విలువ లేకుండా పోయింది. ఇలా ఎందుకు జరిగిందో పాకిస్థాన్ నడిగితే 'యూరోపియన్ యూనియన్‌తో పాకిస్థాన్‌కు ఉన్న 'జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ ప్లస్' వాణిజ్య ఒప్పందమేనంటారు. కానీ ప్రపంచమంతా నివ్వెరపోయేటట్లు 'ఉగ్రవాదులను ఉరి' నుంచి తప్పించే చర్యగా భావించాలి. ఎన్నో కేసుల క్షమాభిక్ష విషయంలో కూడా రాష్ట్రపతిని కోరేవారెవరూ తాము అమాయకుడిని కావున తమ శిక్షరద్దు చేయమని అడగడం కన్నా తమకు న్యాయం జరుగనందున కోర్టులు వేసిన కఠిన శిక్షల్ని తగ్గించమనే కోరుకుంటారు. ఎందుకంటే 'క్షమ' అనేది శిక్షల్ని రద్దు చేసేందుకు కాదు. కఠిన శిక్ష సాధారణ శిక్షల మధ్య ఉన్న వ్యత్యాసాలను తగ్గించి వ్యక్తుల్ని సంస్కరించడానికి కాన న్నది న్యాయ శాస్త్రాలు చెబుతున్నాయి. కుటుంబపరువు దక్కించుకోవాలనే. అదేదో తీవ్రమైన నేరాలు చేసిన వారి శిక్ష రద్దు చేయడమంటే ఎన్ని ఘోరాలు నేరాలు చేసినా ఎక్కడో అక్కడ ఉపశమనం దొరుకుతుందిలే అనే తప్పుడు సంకేతాలు నేరస్తులకు వెళ్తాయనే. ఆంధ్రప్రదేశ్‌లోని చిలుకలూరి పేట బస్సు దహనం కేసులో ముద్దాయిలకు క్షమాభిక్ష లభించినా, పార్లమెంట్‌పై దాడి కేసులో అఫ్జల్ గురుకి క్షమాభిక్ష తిరస్కరించినా ఈ సిద్ధాంతాలకులోబడే జరిగింది. తనవారు పరవారని కాదు. ఆదిమ యుగంలో ఉన్నట్లు కన్నుకుకన్ను, పన్నుకుపన్ను అనే శిక్షలు కాల క్రమేణా మారిపోయి కారాగారా వాసానికి పరిమితమ య్యాయి. అందులోనే నేర తీవ్రతను బట్టి మరణశిక్ష, యావజ్జీవ ఖైదులుగా పొడిగించారు. ఏది ఏమయినా జీవించేహక్కు, యావజ్జీవం బందిఖానాలో ఉండడం వీటిలో ఏదైనా కఠినత్వమే. ఎవరూ కావాలని జీవించే హక్కును కాలరాసుకోరు అనే సూత్రానికి లోబడి 'ఉరిశిక్ష'లు రద్దుచేయాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వారు ఎంతో కాలంగా పోరాడుతున్నారు. భారీ జరిమానాలకు, జీవిత ఖైదులకు లొంగని, భయపడని నేరస్థులకు మరణశిక్ష వేయడం ఎంతమాత్రమూ అభ్యంతరం ఉండకూడని విష యం. మనిషిలోనే నేరాలోచన రాకుండా ఉండేందుకు, నేర ప్రవృత్తిని దూరం చేసేందుకు ఉపయోగపడే 'కఠిన శిక్ష'లే లేకుంటే కట్టుబాటుకో చట్టానికో లొంగే పరిస్థితి ఉండదు. ఎందుకంటే ఇతిహాసాల నీతి వాక్యాలకో, ఉప నిషత్తుల సారాంశాలకో, పేదరాశి పెద్దమ్మల కథల నీతి వాక్యాలకో లొంగే పరిస్థితులు కనపడటం లేదు. యూరో పియన్ దేశాలతో వాణిజ్య సంబంధాలను పెంపొందించ డానికి, అంతర్జాతీయ వేదికపై పాక్ విశ్వసనీయలకు రెండు తీవ్రమైన శిక్షలను తప్పించాలనుకోవడం తిరోగ మన చర్య. అడుగడుగునా పరిశోధనల్లో అధునాతన సాంకేతికతను స్వీకరిస్తున్నా భారతీయులకు దాయాది దేశం చేస్తున్న న్యాయసంస్కరణలు ఏమాత్రం రుచించడం లేదు. మహిళలను వివస్త్రను చేయడమంటే ఆ నేరం హత్యతో సమానమైన నేరంగా పరిగణించాలని అందుకు మరణశిక్షే సమంజసమని సెనేటర్లు వాదించినా పాక్ సభలో ఆ దేశపు న్యాయశాఖామంత్రి అందుకు అంగీకరించ లేదు. దానికి కారణం తమ రహస్య అజెండా కారణం గానే. సభలో జరిగిన చర్చకు ఆమాత్యుల వారి సమాధానమేమిటంటే మరణశిక్షల అమలులో లేని యూరప్‌లో నేర నియంత్రణ సజావుగానే ఉందికదా! అని సరిపెట్టుకున్నారు. ఇక్కడ యెమెన్‌లో 2017 నుండి ఒక హత్య కేసులో సనా సెంట్రల్ జైల్లో మగ్గుతున్న కేరళ నర్సు 'నిమిష ప్రియ' కేసు కూడా ప్రస్తావనార్హం. మరణశిక్ష పడిన 'నిమిష'ను ఆ శిక్షనుంచి తప్పుకోవాలంటే షరియా ప్రకారం ఉన్న ఒక అవకాశం దక్కినట్లయింది. కేవలం బ్లడ్‌మనీ (దియా)తో హతుని కుటుంబం నుంచి క్షమాభిక్ష లభిస్తే 'ఉరి' తప్పుతుంది. ఆమెకున్న అన్ని అవకాశాలు మూసుకుపోయినా ఆమె ప్రాణం 'ఉరికంబ' ఛాయల్లో ఊగిసలాడుతోంది. ఆమెకెవరు రక్ష. శిక్షల విషయంలో ప్రపంచమంతా ఒక ప్రాతిపదిక లేకపోవడాన్ని కూడా చర్చించాల్సిన సమయం ఆసన్నమైంది.



తొందరపడి నిర్ణయాలకు రావడం అనే వ్యాయామాన్ని మాత్రమే మూర్ఖులు చేస్తుంటారు.

విలియం కాంటన్



ఏదైనా పనిలో లీనమైనప్పుడు ప్రపంచంలోని ఏ విషయమూ నీలో చొరబడకూడదు. చాలా మంది వినోద సమయాలలో కూడా దీనిని పాటించలేరు.

చార్లెస్ కింగ్స్‌లే

# ప్రజావాక్కు



## ఓటర్ల జాబితా పారదర్శకంగా జరగాలి

ఇటీవల బీహార్ రాష్ట్రంలో ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియ తీవ్ర వివాదానికి దారి తీసింది. వేలాది మంది ఓటర్ల పేర్లు తొలగింపబడ్డాయన్న ఆరోపణలు, తప్పుడు చేర్పులు, ఒకే వ్యక్తికి బహుళ ఓటింగ్ హక్కులు లభించడం లాంటి విషయాలు ప్రజల్లో ఆందోళనకు దారి తీశాయి. ఒకవర్గం పేర్లు ఉద్దేశపూర్వకంగా తొలగించడమో, మరొక వర్గం పేర్లు చేర్చడమో జరిగితే ప్రజాస్వామ్యంలో విశ్వాసం నశిస్తుంది. ఈ నేపథ్యంలో, ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలి. జాబితా తయారీకిపూర్తి పారదర్శకత అవసరం. ఓటరు వివరాల ఆధార్ లింకింగ్, చిరునామా ధృవీకరణ వంటి ప్రక్రియలు నిబంధనల ప్రకారం, ప్రజల అవగాహనతో జరగాలి. ప్రతి మార్పుపై సంబంధిత వ్యక్తికి ముందుగానేసమాచారం ఇవ్వాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## సాంకేతిక సమస్యలు సరిదిద్దాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ప్రతీ నెల ఒకే రోజు క్లస్టర్ స్థాయిలో స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నది. అయితే సమావేశాల రోజున ఉపాధ్యాయుల హాజరు నమోదు, సమావేశపు ఫీడ్ బ్యాక్ విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో కూడా ఇదేవిధంగా జరిగింది. కానీ విద్యా శాఖ సరిదిద్దడంలేదు. జూన్ నెలలో 19వ తేదీన జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌లో సాయంత్రం ఐదు గంటలనుండిఉపాధ్యాయుల ఫేషియల్‌అటెండెన్స్ యాప్‌లో హాజరు పడక ఉపాధ్యాయ ఇబ్బందులుపడ్డారు. ఉపాధ్యాయులు ఫెసియల్ అటెండెన్స్ ఇన్ టైమ్ మధ్యాహ్నం ఒంటి గంటకు రిపోర్ట్ చేయాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## వృథా ప్రయాస

నదీ జలాల పంపకం పైన బనకచర్ల ప్రాజెక్టు విషయం పైనా కేంద్రమంత్రి ద్వారా వివాద పరిష్కారం చేసుకుందామని రెండు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులైన చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, ఢిల్లీ వెళ్లి సమస్యను అలాగే వదిలి పెట్టి వచ్చేసారు. పరిష్కారానికి ఓ కమిటీని వేస్తారట. ఆ కమిటీ రిపోర్టు ఎప్పటికి వస్తుందో, వచ్చినా ఆమోదయోగ్యంగా ఉంటుందో లేదో చెప్పలేం.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## హిందీ భాషపై స్టడీ అవర్స్ అవసరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అత్యధిక సీట్లు సాధించినప్పటికీసొంతంగా ప్రభుత్వాన్ని పెట్టుకోగలసత్తా ఉన్నప్పటికీ రాజకీయ అవసరాలు కారణంగా భారతీయ జనతా పార్టీ జనసేన పొత్తుపెట్టుకున్నది. సొంత నిర్ణయాలు తీసుకునే స్థితిలో పడిపోయింది. ఈ నేపథ్యంలో హిందీభాషను దక్షిణాది మీదరుద్దడానికి పవన్ కళ్యాణ్‌ను పావుగా ఎంచుకున్నది. విద్యా శక్తి పేరుతో ఐఐటి కాన్సెప్టును నాలుగు నుండి ఐదు వరకు స్టడీ అవర్‌గా మ్యాథమెటిక్స్ సైన్స్ ఇంగ్లీష్‌లతో సక్సెస్ స్టోరీలను చెబుతూ, కెరీర్ గైడెన్స్ చేస్తూ మోటివేట్ చేయమని సూచించింది. ఈనేపథ్యంలో హిందీ భాష ఆరవతరగతి నుండి పదవ తరగతి వరకు చదివినప్పటికీ హిందీలో ఏ విద్యార్థిని విద్యార్థి అనర్గళంగా మాట్లాడలేకపోతున్నారు. విద్యాశాఖ పర్యవేక్షణా అధికారులు కూడా హిందీ వారికి రాక హిందీ టీచర్ ఏమి రాస్తాది రైట్ అని టిక్ పెట్టి వెళ్ళిపోతున్నారు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## స్థానికులుగా నిరూపించుకోవాలి

బీహార్‌లో ఎన్నికల ఓటర్ లిస్ట్ సమగ్ర సవరణ పేరుతో ఎన్నికల సంగం చేపట్టిన విధానం విమర్శలకు దారితీస్తోంది. ఏ విలువలు అయితే టీఎన్ శేషన్‌కాలంలో ప్రవేశపెట్టబడ్డాయో తరవాత జెఎం లింగ్డో వంటి వారు కొనసాగించి దాన్ని పటిష్టం చేశారు. కానీ గత దశాబ్దకాలంగా ఆ సంస్థ తన స్వతంత్రతను కోల్పోయింది. బీహార్ అంటే ఒక సుసంపన్నం అయిన రాష్ట్రం కానీ ప్రభుత్వ పాలసీలు లోపంవల్ల బీహార్ దేశంలోని ఒక వలస రాష్ట్రంగాపెరుపొందింది. మరిఎన్నికల అధికారి జూలై 15 నుండి జూలై 28 వరకు ఇచ్చిన టైం లోనే మేము బీహార్ గడ్డ మీదేపుట్టాంఅనిరుజువు చేసుకోవాల్సి నదుస్థితిలోకి నెట్టబడ్డారు.

- భారత అవినాష్, జనగామ

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

రైతులు తమ పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలంలో పశువులకు లంపి స్కిన్ మిగతా వ్యాధులు మేకలు గొర్రెలకు కూడా రోగాలు వస్తాయి. ముద్దపు చర్మవ్యాధి సోకితే పాడి రైతుకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పాల దిగుబడి గణనీయంగా తగ్గి రైతుకు ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగులుతుంది. పశు సంవర్ధక శాఖ గ్రామాల వారీగా పశువులకు ముందస్తు టీకాలు వేయాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెలుగు రాష్ట్రాల నీటి వాటాలు తేలేదెప్పుడు?

*70వేల టీఎంసీల నీటితో దేశాన్ని సస్యశ్యామలం చేస్తానని చెప్పిన వారికి ఒక్క ప్రాజెక్టును కూడా సరిగ్గా కట్టడం చేతకాలేదు. తాను జాతీయ రాజకీయాల్లోకి వెళితే దేశం మొత్తం నీళ్ల ఇస్తామని ప్రగల్భాలు పలికారు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం పాటుపడిన కెసిఆర్ వాటర్‌మ్యాన్ అయితే, రేవంత్‌రెడ్డి వాటామ్యాన్ అని హరీష్‌రావు విమర్శిస్తున్నారు. ఎవరు వాటర్ మ్యానో, వాటా మ్యానో లక్షకోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎందు కు పనికిరాకుండాపోయి, వెక్కిరిస్తుండటం చూస్తే ప్రజలం దరికీ అర్థమవుతుంది. కాళేశ్వరం నిర్మించిన ఇద్దరు ఇంజి నీర్ల ఇళ్లల్లో సోదాలు చేస్తే రూ.300 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు ఏసీబీ దాడుల్లో గుర్తించారు. పిల్ల చేపల ఇళ్లల్లోనే ఇన్ని ఆస్తులు దొరికితే తిమింగలాలైన మీరు ఎన్నివేల కోట్లు కాళేశ్వరంలో దోచుకున్నారో ప్రజలకు అర్థమవుతున్నది.*

డా.కప్పంపల్లి సత్యనారాయణ

ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ గోదావరి బనకచర్ల ప్రాజెక్టును తలపెట్టిన విషయాన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దానిని ఆపటానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి కేంద్రానికి ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలుమార్లు లేఖలు రాశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జలవనరులశాఖ మంత్రిని కలిసి ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని వినతిపత్రాలు ఇచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని పార్టీల ఎంపీలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనలు స్వీకరించింది. అవసరమైతే దీనిపై న్యాయపోరాటం చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం సర్వశక్తులను ఒడ్డుతున్నది. ముఖ్యమంత్రి తెలంగాణ నీటి ప్రయోజనాలకు మరణశాసనం రాస్తున్నారని హరీష్‌రావు మాట్లాడుతున్నారు. బనకచర్లకు బీజం పడిందే బీఆర్ఎస్ ప్రభుత్వం పాలించిన 2016 సంవత్సరంలో. అదే సంవత్సరం ఈప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ మొదట జీ.ఓ. ఇచ్చింది. అప్పుడు మౌనంగా ఉండి ఈరోజు అధికారం పోయింది కాబట్టి ఏదోవిధంగా వివాదం సృష్టించి రాజకీయ లబ్ధి పొందటానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం విడిపోయిన తరువాత రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ విషయమై 2016, సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగిన తొలి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడుతూ.. కృష్ణానదిలో రెండు రాష్ట్రాల్లో ఇప్పటికే ఉన్న, ప్రస్తుత నిర్మాణంలో ఉన్న ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం వెయ్యి టీఎంసీలకుపైగా నీరు అవసరమవుతుందని, అదే సమయంలో గోదావరినదిలో ప్రతీ సంవత్సరం 3వేల టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వృథాగా వెళుతోందని, ఆ నీటిని ఆంధ్రప్రదేశ్ ఎలా సమర్థంగా వినియోగించాలో నిర్ణయించుకోవాలని కెసిఆర్ పేర్కొన్నారు. దీనితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018 మార్చిలో జీ.ఓ.ఆర్.టి.నం. 230జారీ చేసి గోదావరి వరద నీటిని కృష్ణానదిలోని ప్రకాశం బ్యారేజీకి తరలించి, ఆపై కొమ్ము మూరు కాలువ ద్వారా పెదగంజం వరకు, అక్కడి నుండి గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు ఎత్తిపోతల ద్వారా పంపించి, అక్కడి నుండి పెన్నా నదిలోని సంగం బ్యారేజీకి చేర్చే పథకానికి డీపీఆర్ తయారీకి వ్యాప్కో సంస్థను నియమిం చింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదే సంవత్సరం జూన్ నెలలో జీ.ఓ.ఎం.ఎస్. నం.51 జారీ చేసి, గోదావరి పెన్నా నదుల అనుసంధానికి ఫేజ్ 1లోని పనులకు రూ. 6020.15 కోట్లతో పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఆ తర్వాత 2018 సెప్టెంబర్ 5న జీ.ఓ.ఎం.ఎస్. నం. 98 ద్వారా కొన్ని మార్పులతో ఫేజ్1లోని గోదావరి పెన్నా నదుల అనుసంధానం పనుల కోసం రూ.6020.15 కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చింది. తదుపరి అక్టోబర్‌లో ఈ ప్రాజెక్టు కింద రెండు ప్యాకేజీలకు టెండర్లు ఆహ్వానించారు. దీనితో గోదావరి, పెన్నా లింక్ ప్రాజెక్టు కింద పనులు పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. దానికి ఇరు రాష్ట్రాల మంత్రులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర అధికారుల సమక్షంలో ఈ సమావేశం జరిగింది. ఇది రహస్యంగా జరిగిన సమావేశం కాదు. ఇందులో రాష్ట్రాల మధ్య నీటివాటాల విషయం చర్చకు రాలేదు. రాయలసీమకు గోదావరి నీటిని జగన్ చేతిలో కెసిఆర్ పెట్టారనే విషయం వీడియోలు, వివిధ పత్రికల్లో వచ్చి అప్పటి వార్తలు బహిర్గతమవటంతో.. ప్రజల దగ్గర బీఆర్ఎస్‌కు ముఖం చెల్లటం లేదు. దీనిని కప్పిపుచ్చుకోవటం కోసం చంద్రబాబు



కు గోదావరి నీటిని రేవంత్‌రెడ్డి ధారాదత్తం చేస్తున్నారు. దీనికి ఆధారాలు మాత్రం చూపటం లేదు. రాష్ట్రం విడిపోయిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కృష్ణాపై ఎటువంటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంతో ఆ నీటిని తెలంగాణ ఉపయోగించుకోలేకపోయింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 1200 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్ అదనంగా తరలించుకుపోయింది. బీఆర్ఎస్ పాలనలో నీటిపారుదల రంగంపై పదేండ్లలో 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి, 199 టీఎంసీల నీటిని ఉపయోగించింది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేనాటికి కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే.. ఎస్ఎల్‌బీసీకి 40 టీఎంసీలు, కల్వకుర్తికి 40, నెట్టెంపాడుకు 25, పాలమూరు రంగారెడ్డికి 95, డిండికి 30 టీఎంసీల నీళ్లు మనం ఉపయోగించుకునే అవకాశం ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో ఈప్రాజెక్టులు 70, 80శాతం పూర్తయ్యాయి. అయినా వాటిలో ఒక్క ప్రాజెక్టును కూడా బీఆర్ఎస్ పూర్తి చేయకపోవడంతో దక్షిణ తెలంగాణ తీవ్రంగా నష్టపోయింది. కృష్ణాలో ఆంధ్రప్రదేశ్‌కు 512టీఎంసీలు, తెలంగాణకు 299టీఎంసీల చొప్పున నీటి కేటాయింపులకు 2016వ సంవత్సరంలో కెసిఆర్ ఒప్పుకొని సంతకం చేశారు. ఆంధ్రా 66, తెలంగాణ 34 నిష్పత్తిలో నీటిని వాడుకోవాలి. కానీ, ఏ ఒక్క సంవత్సరం కూడా తెలంగాణ తనకు కేటాయించిన నీటిని వాడుకోలేదు. గత 10ఏళ్లలో ఆంధ్రా మాత్రం ప్రతీ సంవత్సరం తనకు కేటాయించిన నీటికన్నా ఎక్కువ నీటిని తరలించుకుపోతుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తుండిపోయింది. బీఆర్ఎస్ పాలనలో కృష్ణాపై ప్రాజెక్టులు పూర్తిచేయకపోవడంతోనే మనకు రావాల్సిన వాటా నీటిని కూడా ఉపయోగించుకోలేక పోయాము. నాడు అధికారంలో ఉండి అలయ్ బలయ్ చేసుకుంటూ ఇరు రాష్ట్రాల మధ్య నీటి సమస్యలపై దృష్టిపెట్టలేదు. నేడు ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టగానే ఇరురాష్ట్రాల మధ్యజల వివాదాల పేరిట సెంటిమెంట్‌కు ఆజ్యం పోసి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. కృష్ణా నీటిని అప్పటి ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌కు కెసిఆర్ తాకట్టుపెట్టినందుకే కృష్ణా బేసిన్ జిల్లాల్లోని మొత్తం 36 సీట్లలో మూడింటిని మాత్రమే బీఆర్ఎస్ గెలిచింది. కృష్ణా పరివాహక ప్రాంతం 70శాతం తెలంగాణలో ఉంటే, 30శాతం మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, కనుక కృష్ణా జలాల్లో 70శాతం వాటా తెలంగాణకు కావాలని, గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలను తేల్చిన తరువాతే ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం బనకచర్లపై నిరభ్యంతర పత్రం ఇవ్వాలని గతమార్చిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌ను కలిసి విన్నవించారు. సముద్రంలో కలుస్తున్న 70వేల టీఎంసీల నీళ్లు వృథాగా కలిసిపోతున్న 3వేల టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాకు తరలించి ఉపయోగించుకోవాలని కెసిఆర్ జగన్‌కు సలహా ఇచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలోని నదులలో ప్రవహించే నీటిపైనే కాదు.. దేశం మొత్తం ప్రవహించే నీళ్లపై సైతం నీటిపారుదల ఇంజినీర్ కెసిఆర్ అధ్యయనం చేసి నిగ్గు తేల్చారు. దేశంలో నీటి వసతి లేక దాదాపు 44కోట్ల ఎకరాల భూమి సాగుయోగ్యం కావడం లేదు. కనీసం ప్రతి ఏటా సముద్రంలోకి పోతున్న 70వేల టీఎంసీల నీటిని వాడుకోలేకపోతున్నామని, తాగు, సాగునీరు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 2022వ సంవత్సరంలో టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో కేసీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. జాతీయ పార్టీ పెట్టి దేశ రాజకీయాల్లో చక్రం తిప్పడం ద్వారా ఈ నీటిని పొలాలకు మళ్లిస్తానని ఆయన ప్రగల్భాలు పలికారు. రాష్ట్రంలో కట్టక కట్టక ఒకే ఒక్క కాళేశ్వరం లాంటి పనికిమాలిన ప్రాజెక్టు కట్టి తెలంగాణ ప్రజల నెత్తిన పెట్టారు. దేశ రాజకీయాల్లో చక్రంతిప్పుతానని అత్యాశకు పోయిన కెసిఆర్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా చుట్టి తెలంగాణ ప్రజలు ఆయనను ఫామ్ హౌస్‌కు పరిమితం చేశారు. 70వేల టీఎంసీల నీటితో దేశాన్ని సస్యశ్యామలం చేస్తానని చెప్పిన వారికి ఒక్క ప్రాజెక్టును కూడా సరిగ్గా కట్టడం చేతకాలేదు. తాను జాతీయరాజకీయాల్లోకి వెళితే దేశం మొత్తం నీళ్లు ఇస్తామని ప్రగల్భాలు పలికారు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం పాటుపడిన కెసిఆర్ వాటర్‌మ్యాన్ అయితే, రేవంత్‌రెడ్డి వాటామ్యాన్ అని హరీష్‌రావు విమర్శిస్తున్నారు. ఎవరు వాటర్ మ్యానో, వాటా మ్యానో లక్షకోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు పనికిరాకుండాపోయి, వెక్కిరిస్తుండటం చూస్తే ప్రజలందరికీ అర్థమవుతుంది. కాళేశ్వరం నిర్మించిన ఇద్దరు ఇంజినీర్ల ఇళ్లల్లో సోదాలు చేస్తే రూ.300 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు ఏసీబీ దాడుల్లో గుర్తించారు. పిల్ల చేపల ఇళ్లల్లోనే ఇన్ని ఆస్తులు దొరికితే తిమింగలాలైన మీరు ఎన్నివేల కోట్లు కాళేశ్వరంలో దోచుకున్నారో ప్రజలకు అర్థమవుతున్నది. •

# ఇజ్రాయెల్ యుద్ధకాంక్షకు బలిపశువులెందరో!

మహమ్మద్ ఆరిఫ్

నేను ఎన్నో మృతదేహాల వాసనను భరించాను. ఇక భరించలేను..ఇది గాజా స్ట్రిప్, లెబనాన్ యుద్ధంలో సైనిక సేవల్లో పాల్గొన్న డానియర్ ఎడ్రీ అనే సైనికుడు తన సూసైడ్ నోట్‌లో రాసిన వ్యాఖ్యలివి. ఒక ఏడాది పాటు ఆపరేషనల్ డ్రైవర్‌గా పని చేసిన అతను తీవ్రమైన మానసిక ఒత్తిడితో 2025లో జూలైలో బిరియా ఫారెస్ట్‌లో తనను తాను గన్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గాజాలో యుద్ధ అనుభవాల తర్వాత ఎలిరాన్ మిజ్రాహీ అనే సైనికుడు పోస్ట్‌ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్డీ) అనే మానసిక వ్యాధితో బాధపడుతూ మళ్లీ యుద్ధానికి పిలిచే ముందు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గోలానీ బ్రిగేడ్‌కు చెందిన మరో సైనికుడు స్దేతైమన్ సైనిక స్థావరంలో తన సహచరుడి రైఫిల్‌తో కాల్చుకొని సూసైడ్ చేసుకున్నాడు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. 2023 అక్టోబర్‌లో హమాస్, ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎంతో మంది ఇజ్రాయెలీ సైనికులు మానసిక కుంగుబాటుతో ప్రాణాలు తీసుకున్నట్టు అనేక నివేదికల ద్వారా స్పష్టమవుతున్నది. యుద్ధకాంక్షతో గాజాలో మారణహోమాన్ని సృష్టించడమే కాకుండా లెబనాన్ తోపాటు పలు దేశాలపై తరచూ దాడులకు పాల్పడుతూ సామాన్య ప్రజల ప్రాణాలు తీస్తున్న ఇజ్రాయెల్ సొంత సైనికుల ప్రాణాల గురించి కూడా పట్టించుకోవడం లేదని స్పష్టమవుతున్నది. గాజాలో 2023 అక్టోబర్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత సుమారు 390 మంది సైనికులు మరణించినట్టు స్వయంగా ఐడీఎఫ్ వెల్లడించింది. అయితే ఇవి దీనికి రెట్టింపు ఉండవచ్చని తెలుస్తున్నది. సైనికుల కొరత కారణంగా ఇజ్రాయెల్ రిజర్విస్టుల పేరుతో లక్షలాది మందిని బలవంతంగా యుద్ధ భూమిలోకి పంపిస్తున్నది. గాజాలో యుద్ధాన్ని విస్తరించడానికి ఇజ్రాయెల్ సుమారు మూడు లక్షల మంది రిజర్విస్టులను పిలిచింది. వీరిలో చాలా మందికి యుద్ధంలోకి వెళ్లడానికి ఇష్టం లేకపోయినా బలవంతంగా వెళ్లాల్సి వచ్చింది. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారినికూడా యుద్ధంలోకి తిరిగి పంపించినట్లు హారెట్జ్ అనే మీడియాసంస్థ తన నివేదికలో పేర్కొన్నది. మా సైనికులు యుద్ధం చేయడానికి నిబద్ధత చూపడం లేదు. అందుకే మేము మానసికంగా అస్థిరంగా ఉన్నవారిని కూడా నియమించుకోవాల్సి వస్తున్నది అని ఒక సైనిక అధికారి తమకు చెప్పినట్లు హారెట్జ్ తన నివేదికలో పేర్కొన్నది. సాధారణ పౌర జీవితంలో ఉన్న వారిని రిజర్విస్టులుగా, గాజా, లెబనాన్‌లో యుద్ధం కోసం ఇజ్రాయెల్ బలవంతంగా పంపించింది. యుద్ధ ఒత్తిడి, ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో ఈ రిజర్విస్టులు తీవ్ర మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యారు. పదేపదే హింసాత్మక దృశ్యాలు, పౌర మరణాలు చూడడంతోపాటు మృతదేహాల రవాణా వంటి భయానక అనుభవాలను ఎదుర్కోవడంతో వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో సైనికుల్లో పోస్ట్‌ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీడీఎస్) బాధితుల సంఖ్య పెరిగినట్టు అనేక నివేదికలు చెబుతున్నాయి. బలవంతంగా యుద్ధంలోకి నెట్టడం, మానసిక ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడంతో ఇజ్రాయెల్ సైనికుల ఆత్మహత్యల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతున్నది. ఇజ్రాయెలీ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ఆత్మహత్యల గురించి అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ హారెట్జ్, అల్ మయాదీన్ వంటి మీడియా సంస్థలు పలు అంశాలను వెలుగులోకి తెస్తున్నాయి. గాజాలోయుద్ధం ప్రారంభమైన 2023 అక్టోబర్ నుండి 43 మంది సైనికులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ సంస్థలు నివేదించాయి. ఈసంఖ్య 2011 తర్వాత అత్యధికమని పేర్కొన్నాయి. కాగా, ఈ ఆత్మహత్యల్లో ఎక్కువ భాగం రిజర్విస్టులదని, వీరు గాజా, లెబనాన్‌లోని యుద్ధ రంగాల్లో తీవ్రమైన హింసను చూశారని పేర్కొన్నాయి. యుద్ధంలో ఇజ్రాయెల్ సైనికులు ప్రాణాలుకోల్పోతున్నా మానసిక సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, ఆ దేశ పాలకులు పట్టించుకోవడంలేదు. సైనికులకు మానసిక ఆరోగ్యం విషయంలో సహాయమందించడానికి 800మంది మానసిక ఆరోగ్య అధికారులను నియ మించినప్పటికీ చాలా మంది సైనికులు తగినసమయంలో సహాయం పొందలేకపోతున్నారు. ఒక నివేదికప్రకారం సుమారు9వేలమంది సైనికులకు మానసికంగా అశక్తులుగా ఇజ్రాయెల్ వర్గీకరించింది. •

# గురుకులాల్లో సౌకర్యాలొద్దా?

డాక్టర్ మోటె చిరంజీవి

నాలుగు గోడల తరగతి గది విజ్ఞానాన్ని అందించే నిధి. గురువులు కొలువుండే సన్నిధి, అజ్ఞాన అంధకారాన్ని తొలగించే దీపం, విజ్ఞాన కుసుమాలను వికసింపచేసే నందనవనం. క్రమశిక్షణను అలవరిచే కుటీరం, నల్లబోర్డు చూపును విశాల ప్రపంచం, సుద్దముక్క పంచును తరగని విజ్ఞానం. గురువు చేతి కర్ర నేర్పును విచక్షణా జ్ఞానం, కలలను సాకారం చేసే బృందావనం, గమ్యాన్ని నిర్దేశం చేసే గురుకులం, జీవితాలను నిలబెట్టే ఆలయం, ఒకప్పుడు గురుకులాలు అలా వుంటే, ఇప్పుడు గురుకులాలు మృత్యుకుహారాలుగా మారుతున్నాయి. ఆహారం విషతుల్యమై కొందరు, అనారోగ్యంతో ఇంకొందరు, ఆత్మహత్యలు చేసుకుని మరికొందరు విద్యార్థులు మరణిస్తున్నారు. పిల్లల మరణాలు తల్లిదండ్రులకు తీరని కడుపు కోత మిగుల్చుతున్నాయి. పేద విద్యార్థులకు విద్యతో పాటు వసతి, ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వసతి గృహాల్లో కనీససౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ఎక్కడ చూసినా నిర్లక్ష్యం తాండవిస్తున్నది. ఏడాదిగా హాస్టళ్లలో అనుమానాస్పద మరణాలు, బలవన్మరణాలు, అనారోగ్యం, కలుషిత ఆహారం తిని చనిపోవడం వంటి ఘటనలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో విద్యార్థినులు వ్యాధుల బారిన పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. దశాబ్దాలుగా సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితులు మెరుగుపడకపోగా పాలకుల చిన్న చూపు కారణంగా దిగజారుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రత్యేకంగా గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు కొత్తగా సంక్షేమ వసతి గృహాలను మంజూరు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాటిలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వసతులు, సవాలక్ష



సమస్యలతో అస్తవ్యస్తంగా ప్రభుత్వ గురుకులాలు మారాయి. సరిపడా గదులు లేక కొన్ని, ఉన్నా శిథిలమై పెచ్చులూడే తరగతులు, కురుస్తున్న భవనాల కింద భయం భయంగా విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక చాలాచోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానగదులు లేవు, వాటికి తలుపులు కూడా లేవు. మల విసర్జనకూ బాటిళ్లు తీసుకొని ఆరుబయటకు వెళ్లాల్సి నదుస్థితి దాపురించింది. ఈక్రమంలోపాములు, తేళ్లు వంటి విషపురుగులూ కుట్టిన సందర్భాలూ లేకపోలేదు. చాలా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించడం లేదు. గత ప్రభుత్వం గురుకులాలు, ఆశ్రమ పాఠశాలు, హాస్టళ్లకు సన్నబియ్యంతోపాటు బలవర్ధకమైన పౌష్టికాహారం సరఫరా చేసింది. విద్యార్థులు కూర్చునేందుకు కుర్చీలు, పడుకొనేందుకు గార్మెంట్స్ లేక నేలపైనే కూర్చోబెట్టి క్లాస్‌లు చెప్పడం, రాత్రివేళల్లో అదే నేలపైనే పడుకోబెట్టడడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉన్న రాత్రి సమయంలో విపరీతంగా కొడుతున్నాయి అంటున్నారు విద్యార్థులు. వీటి నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలి. కలుషిత నీటి వల్ల విద్యార్థులు పలుమార్లు జ్వరాల బారిన పడుతున్నారు. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా అపరిశుభ్రంగానే ఉంటున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంలో కూడా అధికారులు నిర్లక్ష్యం కనిపిస్తోంది. అలాగే శుచి, రుచికరమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. బెంచీలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు. డార్మెట్రీలో బెడ్స్ కూడా లేక నేలపైనే పడుకోవాల్సి వస్తోంది. వసతి గృహంలో తలుపులు, కిటీకీలు లేకపోవడంతో విద్యార్థులు రాత్రి సమయంలో భయపడుతున్నారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. అరకొర ఉన్న వాటికి సైతం తలుపులు లేవు. ఇంకా తీవ్రమైన సమస్య ఏంటంటే నీటి వసతి కూడా లేదు. ఇక ఇతర సమస్యలు ఎలాగో తిష్టవేసి కూర్చుని ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తెలంగాణలో అంతంత మాత్రమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక గురుకులాలు ఏర్పడ్డాయి. ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 200 హాస్టల్‌లు కూడా లేవు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సుమారు 1100 వరకు గురుకులాలు ఏర్పాటు చేసి, 6 లక్షలకు పై చిలుకు విద్యార్థులు చదువుతున్నారు. విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రస్తుత ప్రభుత్వం గురుకులాల విషయంలో, అనేక మంది విద్యార్థులు అస్వస్థకు గురై చనిపోతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. కావలసిన నిధులను కూడా విడుదల చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన భోజనం, రక్షణ అందించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుకుంటున్నారు. •



## పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ

**వినుకొండ, జులై 21,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 11వ వార్డు రైలుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెనతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నేషనల్ హెల్త్ మిషన్ క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 150 పీహెచ్‌సీలు కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా పట్టణ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించలేదన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని చెప్పారు. పీహెచ్‌సీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన, వైద్యశాఖాధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగేతర శక్తిగా కాంట్రాక్టర్

### మాజీ మంత్రి అంబటి

**సత్తెనపల్లి, జూలై 21 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో రాజ్యాంగేతర శక్తిగా కాంట్రాక్టర్ దరువూరి నాగేశ్వరరావు పెత్తనం చేస్తున్నారని, ప్రజలు ఓట్లు వేసింది కన్నా లక్ష్మీనారాయణకా లేక కాంట్రాక్టర్ నాగేశ్వరరావుకో అర్థం కావడం లేదని మాజీమంత్రి



అంబటి రాంబాబు విమర్శించారు. సోమవారం మాజీమంత్రి విడుదల రజినితో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెంటపాళ్ళ పర్యటనకు సంబంధించిన కేసులో పోలీసుల ఎదుట హాజరై అనంతరం మీడియాతో అంబటి మాట్లాడారు. అసలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎవరో ప్రజలకు అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ప్రజలు ఓట్లు ఒకరికి వేస్తే మరొకరు పెత్తనం చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కాంట్రాక్టర్‌కు ఏమైనా రాసి ఇచ్చారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని అన్ని స్థలాలను ఆక్రమించుకుంటున్నారని, ప్లాట్లు వేసి మరీ అమ్మకానికి పెట్టారన్నారు. బార్లు, రెస్టారెంట్‌లు సైతం కాంట్రాక్టర్ చెప్పిన వారికే ఇచ్చారన్నారు. నియోజకవర్గం మొత్తం బెల్టుషాపులు నడుస్తున్నాయన్నారు. తమ హయాంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలు చేయాలని ఈ సందర్భంగా మాజీమంత్రి అంబటి రాంబాబు హితవు పలికారు.

## ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే పిజిఆర్‌ఎస్ లక్ష్యం

### -జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

**గుంటూరు తూర్పు, జులై 21 (ప్రభాతవార్త) :** ప్రజల సమస్యలను చట్టపరమైన పరిధిలో త్వరితగిన పరిష్కరించడమే పిజిఆర్‌ఎస్ ప్రధాన లక్ష్యమని ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో పిజిఆర్‌ఎస్ కార్యక్రమం



నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల ఫిర్యాదులు సతీష్‌కుమార్, పోలీస్ అధికారులు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు, వృద్దులు వంటి బలహీన వర్గాల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారికి న్యాయం చేకూర్చాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశిచంఆరు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా ముఖాముఖిగా మాట్లాడిన ఎస్పీ పోలీస్ అధికారులు వారి సమస్యలపై సంబంధిత పోలీస్ అధికారులతో తక్షణమే ఫోన్ ద్వారా సంప్రదించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ సుప్రజ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి స్వయంగా ఫిర్యాదుదారుల వద్దకు వెళ్ళి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎటివి రవికుమార్, ఏ.హనుమంతరావు, మహిళా డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, పిజిఆర్‌ఎస్ సిఐ బిలాలుద్దీన్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఎన్‌యు విద్యార్థికి జపాన్ ఫెలోషిప్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూలై 21, ప్రభాతవార్త:** వర్సిటీలోని ఫారెస్ట్రీ విభాగం విద్యార్థి వర్ల అవినాష్ జపాన్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. జపాన్‌లోని క్యోటో యూనివర్సిటీ ఇట్టో ఫెలోషిప్‌కు ఎంపిక చేస్తు ఆఫర్‌లెటర్‌ను వర్సిటీకి పంపింది. ఈ ఫెలోషిప్‌లో భాగంగా వచ్చే ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు అవినాష్ జపాన్‌లోని క్యోటో వర్సిటీకి చెందిన ఫారెస్ట్ ఎకాలజీ లేజొరేటరీ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కింద పరిశోధన చేయనున్నారు. ఫారెస్ట్ ప్రొడక్టివిటీ, కార్బన్ డైడనమిక్స్ అండ్ ఎకోసిస్టిమ్ ప్రాసెసెస్ అంశాలపై అధ్యయనం చేస్తారు. జపాన్ ఫెలోషిప్‌కు ఎంపికవడం పట్ల వర్సిటీ తాత్కాలిక వీసి ఆచార్య కె. గంగాధరరావు హర్షం వ్యక్తం చేస్తు ఆఫర్‌లెటర్‌ను అవినాష్‌కు అందజేశారు. నాణ్యమైన పరిశోధనలు చేసి వర్సిటీకి పేరును ఇనుమడింపచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్రీ విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున, అధ్యాపకులు డా। ఎన్.మిధున్‌కుమార్, డా। ఆర్ విజయ్‌కుమార్‌లు అభినందనలు తెలిపారు.

# గుంటూరు వార్త

## 3సంవత్సరాలలో అమరావతిని పూర్తి చేస్తాం

### అమరావతిలో నిర్మాణ పనుల పురోగతి పరిశీలించిన మంత్రి నారాయణ

**తుళ్ళూరు,జూలై 21,ప్రభాతవార్త :** ఎట్టి పరిస్థితుల్లో వచ్చే మూడేళ్ళలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.అమరావతిలో నిర్మాణంలో ఉన్న భవనాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ సీఆర్డీఏ ఇంజనీర్లతో కలసి సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ...టెండర్లు పూర్తయిన పనులు వేగంగా ఉందన్నారు.వర్షాకాలంలో పనులకు అంతరాయం కలగకుండా ఇంటర్నల్ పనులు జరుపుతున్నామని వెల్లడించారు.గత ప్రభుత్వం రైతులను,కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టిందని,తాము న్యాయపరమైన సమస్యలు రాకుండా టెండర్ల ప్రక్రియను చేపట్టామని చెప్పారు.అమరావతి నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితుల్లోనైనా మూడు సంవత్సరాల్లో పూర్తిచేస్తామని స్పష్టం చేశారు.ఇప్పటివరకు మొత్తం



కొనసాగుతున్నాయని తెలిపారు.గత టిడిపి ప్రభుత్వంలోనే ప్రజాప్రతినిధులు,అధికారుల కోసం ప్రారంభించిన 4,000ఇళ్ల పనుల కోసం అవసరమైన మ్యాన్‌పవర్ 90శాతం సిద్దంగా ఉండగా,మెషినరీ ఈ నెలాఖరుకు పూర్తిగా అందుబాటులోకి వస్తుందనితెలిపారు.ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,ఐఏఎస్ అధికారులు, సెక్రటరీలు,మంత్రులు,జడ్జిల కోసం నిర్మిస్తున్న బంగ్లాల పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.మిగిలిన భవనాలను వచ్చే సంవత్సరం మార్చి నాటికి పూర్తి చేయడానికి ప్రణాళిక సిద్దంగా 72సంస్థలకు భూములు కేటాయించామని,భూములు పొందిన సంస్థలతో సీఎం నేరుగా మాట్లాడారని మంత్రి నారాయణ తెలిపారు.డిసెంబర్ చివరినాటికి మెజార్టీ సంస్థలు పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు.రెండోదశ ల్యాండ్ పూలింగ్‌పై మంత్రివర్గ ఉప సంఘంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.ఐకానిక్ భవనాల నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో పాటు ప్రఖ్యాత డిజైన్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు సమావేశం కానున్నారని తెలిపారు.

## పి4పై ప్రత్యేక సమావేశం

**గుంటూరు తూర్పు, జులై 21 (ప్రభాతవార్త) :** పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ తోడ్పాటును అందించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం నరేడ్కో గుంటూరు కమిటీ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో మేయర్, కమీషనర్ అదనపు



కమీషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసులతో పి4పై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్, కమీషనర్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మానసపుత్రిక అయిన పి4 కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చిన నరేడ్కో కమిటీకి నగరపాలక సంస్థ నుండి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఆర్థికంగా అట్టడుగున్న ఉన్న పేదలను ఆదుకునేందుకు వారిని అభివృద్ధి పథంలో తీసుకురావడానికి పబ్లిక్, ప్రైవేటు పీపుల్స్ పార్టిసిపేషన్ ద్వారా ఉన్నత కటుంబాలు వారు సమాజంలో అట్టడుగువారిని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నారన్నారు. గుంటూరు నగరంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరిన వెంటనే నరేడ్కో కమిటీ సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో వారి కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకుని దత్తత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో నరేడ్కో గుంటూరు ప్రెసిడెంట్ కెసిహెచ్ అంకారావు, సెక్రటరీ ఎం.శ్రీనివాస్, ట్రెజరర్ కె.చిన్న తిరుపతయ్య, కార్పోరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంకోసం వచ్చే బాధితులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదు : బాపట్ల జిల్లా కలెక్టర్

**బాపట్ల, జులై21,ప్రభాతవార్త:** సమస్యల పరిష్కారం కొరకు వచ్చే బాధితులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మా సమస్యలు పరిష్కరించండి అంటూ జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన అర్జీదారులు కలెక్టర్‌ను వేడుకున్నారు. 191 అర్జీలు నమోదు అయ్యాయి. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నిటిని ఆయా శాఖల అధికారులకు పురమాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు. మిగిలిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థ పరిధిలోకి దస్త్రాలన్నింటిని తీసుకురావాలన్నారు. ప్రస్తుతం ఉన్న దస్త్రాలు, గతంలో ఉన్న దస్త్రాలన్నింటినీ ఏ ఐ లో ఉంచాలన్నారు. వారంలో ఒక లక్ష ఫైల్స్ అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పి4 అమలు తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, పరిశీలనకు వెళ్లే సమయంలో గ్రామ కమిటీలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు. అర్హులైన బంగారు కుటుంబాలు, మార్గదర్శిలు సరైన వారేనా, నీడ్ బేస్డ్ సర్వే సక్రమంగా జరుగుతుందా లేదా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అనర్హులు ఉన్నట్లు గుర్తిస్తే వారిని తొలగించాలని ఆదేశించారు. పి4



విధానంలో సవరణ ప్రక్రియకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సూర్య ఘర్, స్వచ్ఛతాహి కార్యక్రమాలను పరిశీలించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ అధికారులు ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలన్నారు. రెండు రోజుల ముందుగానే ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం పంపాలన్నారు. ప్రోటోకాల్ అమలు తీరులో సమస్యలు ఉత్పన్నం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది బదిలీల నేపథ్యంలో ఎన్.టి.ఆర్ పింఛన్ భరోసా పింఛన్ పథకం నగదు పంపిణీకి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా, డి ఆర్ డి ఎ పి డి శ్రీనివాసరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి : పల్నాడు జిల్లా కలెక్టర్

**నరసరావుపేట, జూలై 21 ప్రభాతవార్త :** ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే, డిఆర్‌ఓ మురళి, ఆర్డీవో మధులతతో కలిసి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. మొత్తం 249 సమస్యలను అర్జీల రూపంలో ప్రజలు కలెక్టర్‌కు అందజేశారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించి అర్జీలు రీఓపెన్ కాకుండా చర్యలు ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ సెంటర్లకు నాణ్యమైన కోడి గుడ్లు, పాలు, సరుకులు అందించాలి : బిసి, ఎస్సీ సంఘాలు**

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన కోడిగుడ్లు, పాలు, సరుకులు అందించాలని బిసి, మాలమహానాడు నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, గోదా జాన్‌పాల్‌లు విజ్ఞప్తి చేసి కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. కోడిగుడ్లు ప్రభుత్వ ముద్ర లేకుండానే ఇస్తున్నారని తెలిపారు. అదే విధంగా పేదవారికి పాఠశాలలు,



కళాశాలల్లో ఉచిత అడ్మిషన్లు ఇచ్చే అంశంపై చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

**చర్మకారులకు పింఛన్లు మంజూరు చేయాలి : ఎమ్మార్పీయస్‌యస్**

జిల్లాలోని డప్పు కళాకారులు, చర్మకారులకు పింఛన్లు మంజూరు చేయాలని ఎమ్మార్పీయస్‌యస్ నాయకులు చింతిరాల మీరయ్య, గురవయ్య, పేరయ్య, కోటేశ్వరరావు తదితరులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి పింఛన్లు నిలిచిపోయాయని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పింఛన్లు కొనసాగించాలన్నారు.

## అకాల వర్షాలతో పూర్తిగా మునిగిపోయిన వెద నాట్లు

### ఆందోళనలో రైతన్నలు

**కొల్లిపర, జులై 21 (ప్రభాతవార్త) :** గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొల్లిపర మండలంలో వెదపద్దతి ద్వారా వేసిన వరి పొలలు పూర్తిగా ముగినిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొల్లిపర, దావులూరు, చెముడుబాబు, చివలూరు, అత్తోట,



చక్రాయపాలెం తదితర గ్రామాల్లో పల్లపు ప్రాంతంలో వేసిన వెదనాట్లు పొలాలు చెరువులగా తలపించడంతో దెబ్బతింటాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## కుండపోత వర్షం

### - జలమయమైన రహదారులు - ఇళ్లలోకి వర్షపు నీరు

**కారంపూడి, జులై 21 ప్రభాతవార్త:** వరుణుడి కరుణతో సోమవారం మండలంలో కుండపోత వర్షం కురిసింది. ఏకధాటిగా గంటపాటు కురిసిన వర్షంతో మండలంలో రహదారులు జలమయమయ్యాయి. ఇప్పటివరకు ఎండ వేడితో ఇబ్బంది



పడిన ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది. మండలంలోని 15 గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. పత్తి



పంటకు వర్షం ఉపయోగపడింది. ఇప్పటికే బోర్ల కింద సాగు చేసిన పత్తి పంట రైతులు బోర్లలో నీరు రాక ఇబ్బంది పడ్డారు. వర్షం కురవడం పత్తి పంటకు ఊపిరిపోసింది. వర్షం కారణంగా కారంపూడిలోని రహదారులు జలమయమయ్యాయి. గాంధీబొమ్మ సెంటర్లో వర్షపునీరు మోకాలి లోతులో చేరడంతో గృహాల్లోకిఇ వర్షపునీరు చేరింది. వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

## పేటలో భారీ వర్షం

### - వాగులను తలపించిన సంజీవనగర్ రోడ్డు, జలమయమైన పలు రోడ్లు

**చిలకలూరిపేట, జులై 21, ప్రభాత వార్త:** పట్టణంలో సోమవారం సాయంత్రం గంటసేపు కుండపోత వర్షం కురిసింది. దీనితో భారీగా వర్షపునీరు పట్టణంలోని పలు వీధులలో వాగుల్లాగా ప్రవహించాయి. ముఖ్యంగా



సంజీవనగర్ ప్రాంతంలో నడుములలోతు వరకు నీరు ప్రవహించడం, ఆనీరు అక్కడ ఉన్న గృహాలలోకి వెళ్లడంతో స్దానికులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. కాలువలలో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిగా తొలగించక పోవడంతో ఈ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. అదేవిధంగా కళామందిర్ సెంటర్, గౌడబజార్, మార్కెట్ సెంటర్, ఆర్‌విఎస్ హైస్కూల్ రోడ్డు, సుబ్బయ్యతోట, శివాలయం



వీధి, రమేష్‌బాబు ఆసుపత్రి రోడ్, ప్రాంతాలలోని అన్ని రోడ్డు వాగుల్లాగ మారాయి. మార్కెట్ ప్రాంతంలో వరదనీరు దుకాణాలలోకి వెళ్లడంతో వ్యాపారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టణంలోని ప్రధాన మురుగుకాలువలలో ఉన్న పూడికలను పూర్తిస్దాయిలో తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## సిద్ధమౌతున్న పాలకమండలి దస్త్రం

### - భారీగా ఆశలు పెట్టుకున్న అధ్యాపకులు - రెండోసారి అవకాశం కోసం మరికొంత మంది

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూలై21, ప్రభాతవార్త:** వర్సిటీకి నూతన పాలకమండలి దస్త్రం సిద్ధమౌతుంది. అన్ని యూనివర్సిటీలకు ఒకేసారి పాలకమండలి సభ్యులను నియమించాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. దీంతో చాలా మంది అధ్యాపకులు పాలకమండలి సభ్యులుగా నియమింపచేసుకోవాలని ఎంతో ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు. పాలకమండలి సభ్యత్వం అంటే ఒక ఉన్నత హోదా. వర్సిటీ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక నిర్ణయాల్లో పాలకమండలిదే అత్యున్నత నిర్ణయం. ఆర్థిక పరమైన నిర్ణయాలు, విద్యా సంస్కరణలు, ఉద్యోగ నియామకాలు

ఇలా వరిసటీకి సంబందించిన కీలక అంశాలపై పాలకమండలికి అధికారం ఉంటుంది. అటువంటి హోదాను పొందేందుకు అధ్యాపకులు పోటీ పడుతున్నారు. అలాగే ఈ పదవికోసం ముగ్గురు ప్రిన్సిపాల్స్ కూడా ఆశలు పెట్టుకున్నట్లు తెలిసింది. గతంలో కంటే ఈ సారి పోటీలో నిలిచిన వారి జాబితా కొంచెం పెద్దదిగానే ఉంది. ఎందుకంటే వర్సిటీలో ప్రస్తుతం ప్రొఫెసర్‌లే ఎక్కువ మంది ఉన్నారు. వీరు వారి అకడమిక్, ఎక్స్‌ట్రాకరికులం, పరిపాలనాపరమైన అనుభవాలతో దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులు పరిశీలన



పూర్తయింది. ఎంపిక చేసిన వారిపై ఇంటిలిజెన్స్ నిఘాతో ఎంక్వయిరీ చేస్తారు. అతరువాత సీనియర్ ప్రొఫెసర్ కేటగిరిలో ఇద్దరు, సీనియర్ ప్రిన్సిపాల్/ డీన్ కేటగిరిలో ఒకరికి అవకాశం ఉంటుంది. వీరితో పాటుగా అనుబంద కళాశాలల నుంచి, వివిద పరిశ్రమల నుంచి, సామాజిక సేవల నుంచి కొంతమంది ఎంపికవుతారు. ఆయా సామాజిక వర్గాలను కూడా పరిగణలోకి తీసుకుని ఎంపిక చేస్తారు. ఇదిలాఉంటే గతంలో పనిచేసిన వారు కూడా మళ్ళీ అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య యూనివర్సిటీకి పాలకమండలిని నియమించారు. కొద్ది రోజుల్లో ఏఎన్‌యు కూ పాలకమండలి నియామకం జరిగే అవకాశాలు ఉన్నాయి.

# 7వ రోజుకి చేరిన మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

**తెనాలి, మున్సిపాలిటీ జులై 21 (ప్రభాతవార్త) :** మునిసిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె ఏడోరోజుకి చేరింది. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా శిబిరాన్ని సందర్శించి డాల్‌మిల్లు ముఠా కార్మిక సంఘం నాయకులు జి.వెంకటసుబ్బయ్య,



సీహెచ్.శేషగిరిరావులు మద్దతు తెలిపారు. అలాగే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఏవిఎస్ కుమారి, పి.విజయలక్ష్మీ, ఎస్.పావని, షేక్ హసీనాబేగం, జి.లావణ్య, సుజాత, కనకదుర్గ తదితరులు సంఘీభావం తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాటం చేయాలని, అప్పటి వరకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటియు నాయకులు షేక్ హుస్సేన్‌వలి, కేబీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కారభారతీయ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు నియామకం

**తెనాలి, టౌన్ జులై 21 (ప్రభాతవార్త) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కార భారతీ ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన ప్రముఖశిల్పి సూర్యశిల్పశాల అధినేత, కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఆదివారం విశాఖపట్నం లోని బీవిఆర్ కళాశాలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ సంస్కారభారతి సమావేశంలో ముఖ్య అతిధిగా సంస్కార భారతి అఖిలభారత కార్యదర్శి అసుతోష్ ఆడోని సమక్షంలో సంస్థ అధ్యక్షులు పివిఎస్ కృష్ణ, ప్రాంత ప్రధాన కార్యదర్శి దుర్భా శ్రీనివాస్‌లు, ఉపాధ్యక్షులుగా నియమితులైన కాటూరి వెంకటేశ్వరరావును అతిధిగా విచ్చేసిన అసుతోష్ ఆడోని చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన వివిధ కళాకారులు కళారత్న కాటూరి వెంకటేశ్వరరావుని అభినందించారు. శిల్పకళలో తెనాలి ఖ్యాతిని మరోమెట్టుకు తీసుకువెళ్ళిన కాటూరి వెంకటేశ్వరరావు, మన తెనాలి వాసికావటం మనందరికి గర్వకారణమన్నారు.



# ట్రాక్టర్ దొంగలించిన వ్యక్తి అరెస్టు


**కొల్లూరు, జులై 21 (ప్రభాతవార్త) :** కొల్లూరు గ్రామానికి చెందిన సానా కొండయ్య కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఈనెల 11వ తేది రాత్రి 10గంటల సమయంలో తన ట్రాక్టర్ను తెనాలి రోడ్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్



బంకు వద్ద పార్క్ చేసి ఫిర్యాదుదారడు అరుణాచలం వెళ్ళి వచ్చి ఈనెల 15వ తేదిన ఉదయం 6గంటలకు వచ్చి చూసుకోగా తన యొక్క 3లక్షల80వేల విలువైన చేసే ట్రాక్టర్ కనిపించకపోవడంతో చుట్టుప్రక్కల వెతికిన ఎలాంటి ఆచూకి దొరకపోవడంతో ఫిర్యాదుడు స్టేషన్కు వచ్చి రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. ఫిర్యాదు దారుడు ఇచ్చిన రిపోర్టుపై కొల్లూరు ఎస్సై జానకి అమరవర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. అధికారుల ఆదేశాల మేరకు కొల్లూరు ఎస్సై తన సిబ్బందితో గుంటూరు పట్టాభిపురం ఫ్లైఓవర్ వద్ద ముద్దా యి గోడల గోపిచంద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా సదరు ముద్దాయి కొల్లూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా తేలింది. కుటుబ పరిస్థితుల వలన కూలీ పనులు మరియు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్తూ ఉండేవారు. ఆ క్రమంలో చెడు వ్యసనాలకు అలవాటు పడి షుమారు రెండు సంవత్సరాల క్రితం గుంటూరు చుట్టుగుంట క్యాటరింగ్ పనులకు వెళ్ళూ గుంటూరులో ఉంటున్నారు. ఈనెల 11వ తేదిన రాత్రి కొల్లూరు వచ్చి తిరిగి గుంటూరు వెళ్ళే క్రమంలో ఏదైనా ట్రాక్టర్ దొంగతనం చేద్దామని అనుకుని ట్రాక్టర్ను దొంగలించడం జరిగింది. దొంగలించిన ట్రాక్టర్‌ను గుంటూరు ఫ్లైఓవర్ వద్ద పొదలో దాచి పెట్టానని ముద్దాయి ఒప్పుకోనడంతో ముద్దాయిపై కేసు నమోదు చేసి ముద్దాయిని రిమాండ్ నిమిత్తము తెనాలి కోర్టు ముందు హాజరు పర్చడం జరిగిందన్నారు.

# ఉపకారగారంలో ఇషిత్ (ఐఎస్ హెచ్‌టి హెచ్) క్యాంపెయిన్ నిర్వహణ

**సత్తెనపల్లిటౌన్, జులై21, (ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశానుసారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో భాగమైన డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్.ఐ.వి/ఎయిడ్స్ (దిశా) వారు లెప్ర సొసైటీ వారి సహకారంతో



సత్తెనపల్లి ఉప కారాగారం లో ఉన్న ఖైదీలకు ఇషిత్ (ఐ ఎస్ హెచ్ టి హెచ్) క్యాంపెయిన్ నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో భాగంగా కారాగారం లో ఉన్న ఖైదీలకు హెచ్.ఐ.వి మరియు టిబి మరియు హెపటైటిస్, సిఫిలిస్ పరీక్షలు నిర్వహించిఅవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ టి.వెంకటరత్నం, జైల్ హెడ్ వార్డ్ ఎన్.విశ్వేశ్వరరావు, జైలు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జయప్ర,సత్తెనపల్లి ఐసీటీసీ కౌన్సిలర్ రఘునాథ్ ,ల్యాబ్ టెక్నీషియన్ సుబాని తదితరులు పాల్గొన్నారు

# బైపాస్‌రోడ్డును బాగు చేయండి : వినియోగదారుల సంఘం

**నకరికల్లు, జులై 21 ప్రభాతవార్త :** నరసరావుపేట బైపాస్‌రోడ్డును బాగు చేయాలని పట్టణ వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు కుంచాల స్వామి విజ్ఞప్తి చేశారు. దర్గా వద్ద నుండి వల్లపుచెరువు గంగమ్మగుడి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. రోడ్డుపై గుంటలు ఏర్పడి వర్షాకాలంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీంతో పాటు ఆ మార్గంలో ఇష్టానుసారంగా ఇళ్ళ మెటీరియల్‌ను, వ్యర్థాలను, మట్టికుప్పలను రోడ్ల వెంట పోయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మట్టికుప్పలను తొలగించడంతో పాటు కాలువలు నిర్మించాల్సిన అవసరం ఉందని, ప్రమాదాలను అరికట్టాలని ఈ సందర్భంగా కుంచాల స్వామి విజ్ఞప్తి చేశారు.

# పమిడిమర్రు, లింగంగుంట్ల గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు

నరసరావుపేట, జూలై 21 ప్రభాతవార్త : మండలంలోని పమిడిమర్రు, లింగంగుంట్ల గ్రామాలలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు నాయకత్వంలో



నిర్వహించారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో వర్షం కురుస్తున్నప్పటికీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఇంటింటికి వెళ్ళి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధిని వివరించారు. ఏడాది పాలనలో ఇచ్చిన హామీలలో 90 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మహిళలకు తల్లికి వందనం పేరుతో నగదు జమ చేయడం జరిగిందన్నారు. వారి బిడ్డల చదువుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. అదే విధంగా ఉచిత బస్సు ప్రయాణం మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు అండగా ప్రభుత్వం నిలిచిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. తొలుత గ్రామంలో ఆయనకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# నాశిరకం మద్యంతో గత ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని పాడు చేసింది : కొమ్మాలపాటి



**నరసరావుపేట, జూలై 21 ప్రభాతవార్త :** నాశిరకం మద్యంతో వైకాపా ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని పాడు చేసిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఐదేళ్ల పాటు మద్యం, మైనింగ్, ఇళ్ళ స్థలాల పేరుతో అనేక స్కాంలకు వైకాపా ప్రభుత్వం పాల్పడిందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీగా టిడిపి అప్పుడు పోరాటం చేసిందని, అయితే తమపై అక్రమ కేసులు పెట్టారని గుర్తు చేశారు. మద్యం కుంభకోణంలో అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఆ పార్టీ ఎం.పి.మిధున్‌రెడ్డి ఇప్పటికే అరెస్ట్ అయ్యారని, ఆయనతో పాటు వారి వెనుక ఉన్న పెద్ద మనుషులంతా బయటకు వస్తారని, వారికి శిక్షలు పడతాయని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ తెలియజేశారు.

# ఘనంగా నూజెండ్ల పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం

**నూజెండ్ల, జులై21, ప్రభాతవార్త:** నూజెండ్ల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన



పాలకవర్గం ప్రమాణస్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు హాజరయ్యారు. నూతన ఛైర్మన్‌గా బచ్చు అంజిరెడ్డి, సభ్యులుగా గంగినేఇన బ్రహ్మయ్య, మందా ఏసులచే ప్రమాణస్వీకారం చేయించి నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ సహకార సంఘాలు బలోపేతం చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఐదేళ్ళ వైకాపా పాలనలో సొసైటీలను దోపిడి చేశారని, దొంగ రుణాలతో దివాళా తీయించారని విమర్శించారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వంలో సొసైటీలు సమర్థవంతంగా పని చేయాలన్నారు. తెదేపాలో కష్టపడే వారిని అధిష్టానమే నేరుగా గుర్తించి పదవులు అందించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ మీసాల మురళి, మండల తెదేపా అధ్యక్షులు గంగినేని బాబు, సొసైటీ ఛైర్మన్ ముండ్రు సుబ్బారావు, తెదేపా సీనియర్ నాయకులు లగడపాటి వెంకట్రావు, వంకాయలపాటి పేరయ్య, కాకాని వీరాంజనేయులు, గంగినేని బ్రహ్మయ య్య, మరిడి సురేష్, కుంటా కోటిరెడ్డి, నక్కా బుల్లేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకి ఇళ్ళు నిర్మిస్తామని మోసగించిన కాంట్రాక్టర్‌కి రిమాండ్

తెనాలి, టౌన్ జులై 21 (ప్రభాతవార్త) : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు అనే పథకంలో ఇల్లులేని నిరుపేదలకి ప్రభుత్వం అర్హులైన వారికి సెంటుస్థలాన్ని



మంజూరు చేసి, ఇళ్ళపట్టాలు అందించగా ఇంటి నిర్మాణం చేస్తానని వారి వద్ద డబ్బులు తీసుకుని మోసగించిన కాంట్రాక్టర్‌ని రూరల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం ఇంటి నిర్మాణం కోసం స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ ద్వారా ప్రతి పట్టాదారునిక లక్షా ఎనభైవేల రూపాయలు మంజూరు అవ్వగా పట్టణంలోని మారీసుపేటకి చెందిన కాంట్రాక్టర్ మరియు ఏజెంట్ అయిన ఎం.పున్నారావు, లబ్ధిదారుల దగ్గరకు వెళ్ళి సకాలంలో ఇల్లు కట్టిస్తామని నమ్మించి మాయమాటలు చెప్పి అందరి వద్ద డబ్బులు తీసుకుని లబ్ధిదారులందరితో అగ్రిమెంట్లు చేయించుకుని ఏ ఒక్క ఇంటిని పూర్తిగా నిర్మించకుండా సగం సగం మాత్రమే పనులు చేసి అందరిని మానసికంగా ఇబ్బందులకు గురి చేసి నమ్మించి, నమ్మకద్రోహం చేసిన ఏజెంట్ మరియు కాంట్రాక్టర్ పున్నారావుని గతంలో బుర్రిపాలెం, నేలపాడు గ్రామాలకు సంబంధించిన ఇళ్ళ స్థలాల కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించగా సోమవారం పెదరావూరు గ్రామంలోని లేఔట్‌కు సంబంధించిన కేసులో పీటీ వారెంట్‌పై నరసరావుపేట సబ్‌జైలు నుండి తీసుకొచ్చి తెనాలి మెజిస్ట్రేట్ ముందు ఆధారపరచగా, పద్నాలుగు రోజులు రిమాండ్ విధించగా తిరిగి నరసరావుపేట సబ్‌జైల్‌కి తరలించారు. అలాగే మోసగించిన పలువురు కాంట్రాక్టర్లు కోటేశ్వరరావు, నరేష్, బాలరాజు, ఆలీ, మోషే, కొండ మరి కొంత మంది కాంట్రాక్టర్లపైన దర్యాప్తు జరుగుతోందని త్వరలో వీరిని కూడా కోర్టు నందు హాజరుపరచటం జరుగుతుందని రూరల్ పోలీసులు తెలిపారు.

# ఎమ్మెల్యే ఎవరో ప్రజలకు తెలుసు

## సర్పంచ్ పసుపులేటి, మండల అధ్యక్షులు అంచుల





**రాజుపాలెం, జూలై 21 ప్రభాతవార్త :** సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అని ప్రజలందరికీ తెలుసునని సర్పంచ్ పసుపులేటి వెంకటస్వామి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీమంత్రి అంబటి రాంబాబు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఎవరికీ తెలియదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యలు చెప్పేందుకు వచ్చినవారిపట్ల అంబటి రాంబాబు ఎగతాళిగా మాట్లాడేవారన్నారు. సంక్రాంతి సంబరాల పేరుతో డబ్బులు వసూలు చేసి డ్యాన్సులు వేసింది అంబటి రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నారని ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటస్వామి అన్నారు.

**ప్రజలు ఓడించినా బుద్ధి రాలేదు : తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నరసింహారావు**

ప్రజలు అంబటి రాంబాబును ఓడించినా ఆయనకు బుద్ధి రాలేదని రాజుపాలెం మండల టిడిపి అధ్యక్షులు అంచుల నరసింహారావు అన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గతంలో ఎన్నో మంత్రి పదవులు చేశారన్నారు. అటువంటి నాయకునిపై విమర్శలు చేయడం శోచనీయమన్నారు. 35 సంవత్సరాల క్రితం ఒకసారి గెలవడం గొప్ప కాదన్నారు. ప్రతి నిత్యం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రజల వెంట నడుస్తున్నారని, కళ్ళు పెట్టుకోవాలని చూడాలని అంచుల నరసింహారావు అంబటి రాంబాబును విమర్శించారు.

# కూటమి హామీలు ఎంతవరకు నెరవేరాయో ప్రజలే తేలుసుకోవాలి : బలసాని

**పెదనందిపాడు జూలై 21 (ప్రభాతవార్త) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన



హామీలను ఎంతవరకు అమలుపరిచారు ప్రజలే తేల్చుకోవాలని. పత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి బలసాని కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం రాత్రి పెదనందిపాడు వైయస్సార్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికైనా ప్రజలు కూటమి ప్రభుత్వ మోసాలను గ్రహించాలన్నారు. అనంతరం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెదనందిపాడు మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు షేక్ ఖాసిం పీరా. పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి చెరుకూరి సాంబశివరావు. ఎంపీపీ హెప్సీబా. ఎంపీటీసీ సాంబశివరావు. సర్పంచి దాసరి పద్మారావు. పలు గ్రామాల కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# రావిపాడులో 102 మందికి ఉచిత వైద్య పరీక్షలు



**పెదనందిపాడు జూలై 21 (ప్రభాతవార్త) :** పెదనందిపాడు మండలం రావిపాడు లోని కంకణాల కొండయ్య నాగరత్నం కళ్యాణ మండపం లో ఆదివారం గుంటూరు శ్రావణి హాస్పిటల్ వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ శిబిరమునందు ఎఫ్ బి ఎస్, పి పి బి ఎస్, బిపి. ఈసీజీ పరీక్షలు ఉచితంగానిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందు లను ఆసుపత్రి వారే అంద చేశారు. 102 మందిని పరీక్షలు చేసిన సిబ్బంది. ఇబ్బంది ఉన్నవారికి మెరుగైన వైద్యం కోసం హాస్పిటల్ కి పంపించడం జరిగింది.ఈ శిబిరంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ పోసాని శ్రీనివాస్ రావు. డాక్టర్ సిరాజ్. డాక్టర్ రాజీవ్, డాక్టర్ వినయ్ కుమార్. మేనేజర్ మక్బూల్ ను రావిపాడు గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలోహాస్పిటల్ సిబ్బంది. పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంటిలో చోరీ

**యడ్లపాడు, జులై 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మైదవోలు గ్రామంలో తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగిన సంఘటన శనివారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబందించి ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం బండారి వరలక్ష్మీ అనే మహిళ ఒక్కతే ఉంటుందని, అయితే గత రెండు రోజుల క్రితం కుమారులు హైదరాబాద్‌లో ఉంటే వారి వద్దకు వెళ్ళటం జరిగిందని, ఇంటిలో ఎవరూ లేరని గమనించి నిందుతుడు తాళం పగల కొట్టి ఇంటిలోకి వెళ్లి చోరీకి పాల్పడటం జరిగిందని, ఆదివారం చుట్టుపక్కల వారు తెలపటంతో హైదరాబాద్ నుండి వచ్చి పరిశీలించగా 4గ్రాముల బంగారం, 40గ్రాముల వెండి, కిడ్డీ బాక్సులో ఉన్న 30వేల వరకు నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించుతున్నామన్నారు. ఇందులో భాగంగా సోమవారం క్లూస్ టీమ్ విచ్చేసి వేలిముద్రల సేకరణ చేయటం జరిగిందన్నారు.



# గాలికుంటు వ్యాధి నివారణా చర్యలు తప్పనిసరి

**యడ్లపాడు, జులై 21, ప్రభాతవార్త :** పశువులకు ఈసీజన్‌లో సూక్ష్మ జీవుల కారణంగా గాలి కుంటు వ్యాధిసోకుందని పశువైద్యులు



తెలుపుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను వారు వివరిస్తూ సంకర జాతి పశువుల్లో మార్చి, ఏప్రిల్, అగస్టు, సెప్టెంబర్ మాసాల్లో ఈ వ్యాధిఎక్కువగా సోకుతుందని, వ్యాధి ఇలా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుపుతున్నారు. ఈ వ్యాధి సూక్ష్మతి సూక్షజీవులు(వైరస్) కారణంగా సంక్రమిస్తుంది. వ్యాధిసోకిన అవుల, గేదెల పాలద్వారా దూడలకు వ్యాపిస్తుంది.

**వ్యాధి లక్ష్మణాలు :** నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి 3.4వారాల్లో బొబ్బలు చితికి పుండ్లుగామారి చర్మం గరుకుగా మారుతుంది. పశువుల నోటిలోను చిగుళ్లపైన పొక్కులు ఏర్పడడంతో పశువులు మేత, నీరు తీసుకోక నీరసించి పోతాయి. నోటి నుంచి చొంగ కారుతూ ఉంటుంది. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాధి పీడిత అవులు, గేదల పాలు తాగిన దూడలు మరణిస్తాయి. గిట్టలలో పుండ్లు కారణంగా ఎద్దులు, దున్నలు వ్యవసాయ పనులు చేయలేవు.

**నివారణ ఇలా :** వ్యాధి సోకిన పశువులను వేరుచేయాలి. పశువుల పాకలను క్రిమసంహారక మందులు, వాషింగ్ సోడాతో కడగాలి, వ్యాధి సోకిన పశువుల మలమూత్రాలను గడ్డితో కాల్చివేయాలి, చనిపోయిన పశువును సున్నపు గోతిలో పూడ్చాలి. మార్చి, ఏప్రిల్, అగస్టు, సెప్టెంబర్ మాసాలకు ముందుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

**చికిత్స ఇలా :** కాలి గిట్టల మధ్య పుండ్లను పోటాషియం పెరా మ్రంగనేట్ ద్రావణంతో కడిగి ఈగలు వాలకుండా వేపనూనే వాడాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. ఎప్పటికప్పుడు వైద్యాధికారిని సంప్రదించి అవసరమైన ముందులు వాడావల్సి ఉంటుంది.

# బిజేపి గుంటూరు జిల్లా నూతన పదాధికారులు

**గుంటూరు విద్య, జూలై 21, ప్రభాతవార్త :** భారతీయ జనతాపార్టీ గుంటూరు జిల్లా నూతన పదాధికారులను బిజేపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు సోమవారం ప్రకటించారు.జిల్లా ఉపాధ్యక్షులుగా... మంత్రి సుగుణ,సాధు రామకృష్ణ,వంగిపురపు విమలాదేవి,రెడ్డి శివపార్వతి,కటారి వాసుదేవ నాయుడు,కత్తి మేరీ సరోజినీలను ప్రధాన కార్యదర్శులుగా...హెచ్ రామకృష్ణ,దేసు సత్యనారాయణ,తోట శ్రీనివాసరావులనుకార్యదర్శులుగా పంచుమర్తి ప్రసాద్,ఆర్ వెంకట లక్ష్మీ,మార్తా నరేంద్ర,నారదాసు వీరమణింద్ర,కె.నారాయణరెడ్డి,సురేష్ కుమార్ జైన్, దానబోయిన శివయ్యలను నియమించారు.కోశాధికారిగా ఆమతి వెంకట రమణఐటీ కన్వీనర్‌గా ..కటకం అనూష,సోషల్ మీడియా కన్వీనర్‌గా..తూనుగుంట్ల రాజేష్‌లను నియమించారు.

# జిల్లా స్థాయి బ్యాడ్మింటన్‌లో సుమేధ విద్యార్థిని ప్రతిభ

**గుంటూరు విద్య, జూలై 21, ప్రభాతవార్త :** స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 19,20తేదీల్లో జరిగిన 52వ జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-11, 13 గర్ల్స్ విభాగం సింగిల్స్,డబుల్స్ విభాగంలో ప్రథమస్థానం సాధించిన సుమేధ హైస్కూల్ విద్యార్థిని "సంకట సాయి అక్షర" ని ఘనంగా అభినందించారు.ఈ పోటీల్లో జిల్లాస్థాయిలో అనేకమంది పోటీదారులను అధిగమించి ప్రథమస్థానం సాధించడం గర్వకారణం అని స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.మా స్కూల్ నందు చదువుతోపాటు ఆట పాటల్లో కూడా విద్యార్థులు అభివృద్ధి సాధించగలరని తెలియజేశారు.కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ కే.రాంబాబు,పిఈటి కిరణ్‌రెడ్డి,విద్యార్థిని తల్లిదండ్రులు సంకటి దుశ్యంత్‌రెడ్డి,ప్రశాంతి,తాత గుజ్జుల జయరామిరెడ్డి,విద్యార్థులు పాల్గొని అభినందించారు.




# 27న ఏపి ఎస్సీ కమీషన్ ఛైర్మన్‌కు సత్కారం

**గుంటూరు విద్య, జూలై 21, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమీషన్ ఛైర్మన్,మాజీ మంత్రి ఆంధ్రక్రైస్తవ కళాశాల పూర్వ విద్యార్థి కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌కు ఉద్యోగ దళిత ప్రజా సంఘాల ఎస్సీకుల సంఘాల ఆధ్వర్యంలో ఏసి కళాశాల్లోని అసెంబ్లీ హాల్లో ఈనెల 27వ తేది ఆదివారం ఉదయం 10.30గంటలకు ఘన రీతిలో సన్మాన సత్కార అభినందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపి షెడ్యూల్ కాస్ట్ వేల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడిద బాబురావు తెలిపారు.సోమవారం ఏసి కళాశాల్లోని మిని ఏసి కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో వివిధ దళిత ఉద్యోగ కుల సంఘాల నాయకులతో కలపి మేడిద బాబురావు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కెఎస్ జవహర్ అభినందన సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ అభినందన సభకు ప్రతిఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్సీలకు సంబందించిన వివిధ సమస్యలపై కూడా అర్జీలు తీసకోవడం జరుగుతుందని,ఈ అవకాశాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన 59కులాల వారు వారి వారి సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకురావడం కోసం అలానే ఛైర్మన్ సన్మానం జయప్రదం చేయడం కోసం తమ వంతు బాద్యతగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎస్సీ కమ్యూనిటీ కి చెందినవారు వేలాదిగా తరలి రావాలని పిలుపునివ్వడం జరిగింది.మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని దళిత సంఘాలు, ఉద్యోగసంఘాలు పాల్గొంటాయిని రాజకీయాలకు, కుల,మతాలకు అతీతంగా దళితుల్లోని 59కులాలు సమిష్టిగా ఈ కార్యక్రమం జరుపుతున్నామన్నారు .కనుక దళితులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుక్కమళ్ళ సంజీవరావు,బత్తుల వీరాస్వామి, డాక్టర్ క్రరా హానోన్ బెంజిమన్, బత్తుల అనిల్,డేవిడ్ విలియమ్స్,వినయ్ సముద్రాల చిన కోటేశ్వరరావు,దారా అంబేడ్కర్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవీ జాగృతి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

**కారంపూడి, జులై 21 ప్రభాతవార్త:** కారంపూడి శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం వైభవంగా జరిగింది. 50 మంది లైఫ్‌లాంగ్ చార్టెడ్ సభ్యులను ఉమ్మడి గుంటూరు జిల్లా గవర్నర్ రంగా రత్నశ్రీ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆర్యన్ తిరువీధి




వేణుగోపాలరావు మాట్లాడుతూ వాసవీ జాగృతి క్లబ్బు సమాజంలో సేవా కార్యక్రమాలు చేయడం, ఆర్యవైశ్యుల వ్యాపార అభివృద్ధి కోసం, పేద ఆర్యవైశ్యులను చదువు నిమిత్తం ఆరోగ్యం నిమిత్తం సహాయంగా ఉండాలని, ప్రతిఒక్కరూ ఐక్యతతో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ ప్రోగ్రాం ఇన్‌ఛార్జి తుమ్మల వెంకటసాయి నాగభూషణం, క్యాబినెట్ సెక్రటరీ అన్నవరపు సంచిత, వీఎంసీ కార్డు ఇన్‌ఛార్జి రంగా చంద్రశేఖర్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ భవిరిశెట్టి రామారావు, సంకా శ్రీనివాసరావు, డిప్యూటీ గవర్నర్ ముచ్చర్ల రామకోటేశ్వరరావు, పీఆర్వో బొలిశెట్టి కిరణ్, వాసవీ జాగృతి క్లబ్ చార్టెడ్ అధ్యక్షులు కరాలపాటి ఆదినారాయణ, చార్టెడ్ సెక్రటరీ కర్నాటి మహేష్, చార్టెడ్ ట్రెజరర్ ఆతుకూరి భాస్కర్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎస్పీఆర్ కృష్ణ, వాసవీ దేవస్థానం అధ్యక్షుడు మద్దు హనుమంతరావు, నగరేశ్వర స్వామి ధర్మకర్త యక్కల శ్రీనివాసరావు, యువజన సంఘం అధ్యక్షులు సముద్రాల సాయి, మహిళా సంఘం అధ్యక్షురాలు గుండా నాగమల్లేశ్వరి, కన్వీనరు చిట్టిప్రోలు కృష్ణకుమారి, జోన్ ఛైర్మన్లు, డిస్టిక్ ఆఫీసర్లు, జాగృతి క్లబ్ కారంపూడి చార్టెడ్ సభ్యులు, ఆర్యవైశ్యులు, మహిళా సభ్యులు, యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గత పాలకులు రైతులను ఇబ్బందిపెట్టి ప్రశాంతమైన పల్లెలలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేశారు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల, జులై21,ప్రభాతవార్త:** రైతులు తమ ఉత్పత్తులు అమ్ముకోకుండా చేసినవారు, ఇప్పుడు రైతు సంక్షేమం గురించి మాట్లాడటం సిగ్గుచేటని, గత పాలకులు చేసిన అరాచకాలు, విధ్వంసం, దుర్మార్గపాలనకు విసిగిపోయే ప్రజలు గత ఎన్నికలలో వారికి సరైన బుద్ధి చెప్పారని మాజీమంత్రి,



శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. దాదాపు 60 నియోజకవర్గాలలో ఎన్నడూ రానంత మెజారిటీ గత ఎన్నికల్లో కూటమిపార్టీలకు రావటానికి కారణం గత ప్రభుత్వ తప్పుడు విధానాలేనని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశంలో భాగంగా సోమవారం మండలంలోని బుక్కాపురం, ఎండుగుంపాలెం గ్రామాలలో జోరు వానలోనూ ప్రత్తిపాటి ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ప్రజల గడపతట్టి వారితో మాట్లాడుతూ వారి ఆలోచనలు, అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

**వైసిపి పాలనపై విసుగుచెందే ప్రజలు కూటమి పార్టీలను గెలిపించారు**

నియోజకవర్గంలో సుబాబుల రైతులను గత పాలకులు ఎన్నో ఇబ్బందులు పెట్టి ప్రశాంతమైన గ్రామాలలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేశారని ప్రత్తిపాటి అన్నారు. రైతుల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని, అసెంబ్లీలో పొగాకు, మిర్చి రైతుల సమస్యలపై మాట్లాడానని ప్రత్తిపాటి ఈ సందర్భంగా తెలిపారు. వైసిపి పాలనపై తీవ్ర విసుగుచెందే, స్వాతంత్ర్యం వచ్చాక ప్రజలు ఎన్నడూ లేనంత మెజారిటీ కూటమిపార్టీల అభ్యర్థులను గెలిపించారన్నారు. ఎండుగుంపాలెం గ్రామంలో నెలకు ఫించన్లకే రూ 14లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. రూ 17లక్షల వరకు తల్లికి వందనం సాయం అందించిందని అన్నారు. త్వరలోనే మరెన్నో పథకాలు అమలు చేయటానికి ముఖ్యమంత్రి, యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. సాగునీటి సంఘాల చైర్మన్‌గా ఎన్నికైన రామారావుని గ్రామస్తుల సమక్షంలో ప్రత్తిపాటి అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్‌మోహన్, నల్లమోతు హరిబాబు, కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, గట్టినేని రమేష్, సింగయ్య, జయప్రసాద్, రాయన్న, ఇన్నయ్య, రాజు, అజితా, కళ్లం రామారావు, గేరా అశోక్, సుభాని, సుజాతారావు, నాగబాబు, విజయసాయి, గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**బాపట్ల, జులై21,ప్రభాతవార్త:** సీయం సహాయ నిధి నిరుపేదలకు వరం వంటిదని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మఅన్నారు. బాపట్ల పట్టణం లోని ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో బాపట్ల



నియోజకవర్గంలో సోమవారం అర్హులైన 27 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సంక్షేమ నిది సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన చెక్కులను లబ్ధిదారులకు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఇది ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సంక్షేమ దృక్పథానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తుందని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా జాప్యత కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు సీయం సహాయ నిధి అందజేసి కూటమి ప్రభుత్వం వారికి అండగా అండగానిలుస్తుందని అన్నారు. వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మద్దతు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తామని,అర్హులైన మధ్యతరగతి పేద కుటుంబాలకు సీయం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత మందికి ఈ సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ. 19,46,083/ విలువ గల చెక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు,పార్టీ నాయకులు,కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

-బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీని పక్కాగా నిర్వహించాలి
-ఎమ్మెల్యే ప్రోద్భలంతోనే నాగమల్లేశ్వరరావుపై దాడి
-ఎమ్మెల్యే నరేంద్ర పేరు చేర్చే వరకు ఉద్యమిస్తాం
-వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు, జులై 21,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త ఒక సైనికుడిగా పనిచేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మురళీకృష్ణ కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష పార్టీలపై, ప్రతిపక్ష నేతలపై,




వైకాపా సానుభూతిపరులపై దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే పోలీసులు ప్రభుత్వ పక్షాన బోగస్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతుందన్నారు. మన్నవ గ్రామ సర్పంచి బొనిగల నాగమల్లేశ్వరరావుపై జరిగిన దాడిలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రమేయం ఉందన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌పై కేసు నమోదు చేసేవరకు విశ్రమించమన్నారు. ఇప్పటికే ఈ విషయంపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టనుందన్నారు. నియోజకవర్గంలో పొన్నూరు రూరల్ ఎస్సై జి.కిరణ్‌బాబు,చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ చౌదరిలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు.వీరిద్దరికి న్యాయ, అన్యాయాలతో సంబంధం లేదని, టిడిపి ఎమ్మెల్యే ఏది చేయమంటే అదే చేస్తున్నారన్నారు. బొనిగల నాగమల్లేశ్వరరావుపై జరిగిన దాడి కేసులో కూడా ఎస్సై కిరణ్‌బాబు ఏకపక్షంగా వ్యవహరించారని, దాడి జరిగిన ప్రదేశంలో సీసీటీవి ఫుటేజిని కూడా ఎత్తుకెళ్ళారన్నారు. కిరణ్‌పై కూడా మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, త్వరలో విచారణ ఎదుర్కొంటారన్నారు. మళ్ళీ మా ప్రభుత్వం వచ్చేదాక వేచి ఉండమని, త్వరలోనే ఈ ఇరువురి ఎస్సైలపై చట్టపరమైన చర్యలు తీసుకునేవిధంగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. ముమ్మాటికి ఎమ్మెల్యే ప్రమేయంతో మినీ మహానాడులో మాట్లాడిన విధంగానే నాగమల్లేశ్వరరావుపై దాడి జరిగిందన్నారు. నాగమల్లేశ్వరరావుకు రాష్ట్రంలోని వైకాపా నాయకులు, కుల సంఘాలు మద్దతుగా నిలిచాయన్నారు. రాష్ట్రంలో ఏ చిన్న సంఘటన జరిగిన హోంమంత్రి అనిత విలేకర్ల సమావేశంలో మాట్లాడేవారన్నారు. ఈ విషయంలో మాట్లాడకపోవడంలో ఆంతర్యమేమిటంటే ఈ దాడి వెనుక ఎమ్మెల్యే ప్రమేయం ఉందని ప్రభుత్వం కూడా విశ్వసిస్తున్నందు వల్లేనన్నారు. వైకాపా కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దని,ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాన్నారు. కార్యకర్తలపై దాడులు జరిగితే చూస్తూ కూర్చోమన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ అరాచకాలపై తమదైన శైలిలో ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో ఎంపిపి భవనం పద్మలీల, చింతలపూడి మురళీకృష్ణ, ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు, లంకపోతు పిచ్చిరెడ్డి, ఎందేటి వెంకటసుబ్బయ్య, షేక్ నాజర్, షేక్ మహమ్మద్(మామ్ము), నల్లమోతు రవీంద్రబాబు, శాబాసు ఈశ్వరయ్య, సుశోభిత, గేరా కుమారి, దేవరకొండ గోపి, మరియరాణి, దుర్గాప్రసాద్, అంబటి రాఘవయ్య, గేరా సంజీవ్ తదితరులున్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

## -వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల


పొన్నూరు, జులై 21,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజానీకం నమ్మి ఓట్లేసి అధికారాన్ని అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ముకాకుండా సుపరిపాలన చేస్తున్న ఘనత కూటమికే దక్కుతుందని వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో పంచాయితీ గ్రాంటు నుంచి రూ.7.5లక్షల వ్యవయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాదల మాట్లాడుతూ గ్రామ సీమలను అభివృద్ధి చేసిన, చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలు కూడా ఏ ప్రభుత్వం



మేలు చేస్తుందో గుర్తించి కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, గనిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు, చలమశెట్టి సీతారామయ్య, బొప్పన బాపనయ్య, యలవర్తి వెంకటేశ్వర్లు, పక్కెల వెంకట కోటేశ్వరరావు, నాగిశెట్టి శ్రీనివాసరావు, జల్లిపల్లి వెంకటేశ్వరరావు, మద్ది శ్రీనివాసరావు, కొచ్చెర బెనర్జీ, పూల సుబ్రహ్మణ్యం, శిఖినం వీరయ్య తదితరులున్నారు.

# ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**పొన్నూరు, జులై 21,ప్రభాతవార్త:** ఏపిఎస్ఆర్టీసి సంస్థ రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ పనిచేస్తుం దని యూనియన్ రీజియన్ కార్యదర్శి ఈ.విజయకుమార్ అన్నారు. స్థానిక ఇటికంపాడు రోడ్డులోని శ్రీ అబ్దుల్ కలామ్ మార్గ్ రోడ్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రిటైరైన




ఉద్యోగులకు అదే రోజున వారికి ఇవ్వాల్సిన బినిఫిట్స్‌ను ఇచ్చేవారన్నారు.అయితే ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేశాక రిటైరైన వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఆలస్యం అవుతున్న కారణంగా ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూనియన్‌చీఫ్ విప్ డి.వి స్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10గంటలు పని అమలు చేసే ప్రయత్నం చేస్తున్నాయని, అందువల్ల కార్మికులను బానిసలుగా మార్చే దిశగా వెళుతున్నాయన్నారు. ఈ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా మాట్లాడుతూ సంస్థ ఆదాయం పెంచడంలో కార్మికులు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అయితే కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు మాత్రం ఇవ్వడంలో మీన మేషాలు లెక్కించడం సరైన విధానం కాదన్నారు. ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు ఆర్టీసి ఎంప్లాయీస్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. పొన్నూరు డిపో అధ్యక్షుడిగా ఆర్జీ రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎవి బేగ్, కోశాధికారిగా షేక్ బుడే, మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో షేక్ రహీంసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి అరెస్టు అక్రమం : జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి

**నరసరావుపేట టౌన్, జులై 21 ప్రభాతవార్త :** వైకాపా ఎం.పి. పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి అరెస్ట్ అక్రమమని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మద్యం స్కాం పేరుతో మిధున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. అసలు ఎటువంటి స్కాం లేని వ్యవహారాన్ని ఎల్లో మీడియాతో పాటు కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా ఆరోపణలు, వార్తలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మాజీమంత్రి పెద్దిరెడ్డితో కళాశాల స్థాయి నుండి సిఎం చంద్రబాబుకు వైరం ఉందన్నారు. ఆ కక్ష్యతోనే ఆయన కుమారుడు మిధున్‌రెడ్డిని ఈ కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచే ప్రతి నాయకునిపైనా అక్రమ కేసులతో భయపెట్టే ప్రయత్నం టిడిపి చేస్తుందన్నారు. వారికి ఎట్టి పరిస్థితులలో భయపడబోమన్నారు. వైఎస్సార్‌సీపీ మిధున్‌రెడ్డి వెంట ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కేసులో కడిగిన ముత్యంలా ఎం.పి.మిధున్‌రెడ్డి బయటకు వస్తారని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.



# పల్నాడు జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌కు 98 ఫిర్యాదులు

**నరసరావుపేట క్రైం, జులై 21 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా ఎస్పీ సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 98



ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి పోలీస్ అధికారులకు ఎస్పీ పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. వినుకొండ మండలం దొండపాడు గ్రామానికి చెందిన కరుణ తన భర్త చని పోయాడని, తమ ఇల్లు, పొలం భర్త అన్న కొప్పులవెంకట్రావు ఆక్రమించుకుని వేధిస్తు న్నాడని తెలిపారు. మేకల సాంబశివరావు తన ఫిర్యాదులో కరెంట్ బైక్‌ల సంస్థ తన వద్ద నుండి రూ.20లక్షలు తీసుకుని డీలర్‌షిప్ ఇచ్చి ఇప్పడు వాహనాలు సరఫరా పూర్తిగా ఆపివేసి మోసం చేసిందన్నారు. పట్టణానికి చెందిన వీర రాఘవులు మాట్లాడుతూ అప్పుగా విజయకృష్ణ అనే అతనికి రూ.20లక్షలు ఇవ్వటం జరిగిందని 3సంవత్సరాలు దాటిన చెల్లించటంలేదని తెలిపారు. పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు స్టాక్ అడ్వైజర్ పేరుతో ఉన్న ఆజాద్ సింగ్, సుమిత్రా అగర్వాల్ అనే వారిని నమ్మి పెట్టుబడికి రూ.57లక్షలుగా పైగా పెట్టి మోస పోయిన్నట్లు, న్యాయం చేయాలనివిజ్ఞప్తి చేసారు. అంచులవారిపాలెం గ్రామానికి చెందిన వెంకటేష్ హైదరాబాద్ కు చెందిన ఖలీల్ అనే వ్యక్తికి వీసా కొరకు రూ.1,35,000 చెల్లించి మోసానికి గురి కావటం జరిగిందన్నారు. ఫిర్యాదులు అందించేందుకు వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు.

# సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అమోఘం : డీఎస్పీ మురళీకృష్ణ

**మంగళగిరి, జులై 21 ప్రభాతవార్త :** సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని మంగళగిరి డిఎస్పి మురళీకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో యూనియన్ ఏపీడబ్ల్యూఏ యూనియన్ జర్నలిస్టులకు అందజేసిన హెల్త్ కార్డులు ఎంతో విలువైనవని అన్నారు. ఏదో ఒక సందర్భంలో ఈ కార్డులు కుటుంబానికి అక్కరకు వస్తాయని తెలిపారు. నిరంతరం ఏపీడబ్ల్యూజే యూనియన్





సభ్యులకు గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు హెల్త్ కార్డులను ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో రోడ్డు లో గల రాయల్ బ్యాంకెట్ ఫంక్షన్ హాలు నందు సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డిఎస్పీ మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా కార్యదర్శి కే రాంబాబు అధ్యక్షత వహించారు. డి.ఎస్.పి మురళీకృష్ణ మాట్లాడుతూ, ఎండనకా, వాననకా, సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి జర్నలిస్టులు విశేషమైన కృషి చేస్తున్నారని అభినందించారు. నేటి సమాజంలో వైద్యం అత్యంత ఖరీదైనదని, ఈ పరిస్థితుల్లో గుంటూరులో లలిత సూపర్ స్పెషాలిటీ వంటి కార్పొరేట్ వైద్యశాల తరపున 50 రాయితీతో కూడిన హెల్త్ కార్డులను పంపిణీ అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేసిన ఏపీయూడబ్ల్యూజె జిల్లా నాయకులను అభినందిస్తున్నట్లు చెప్పారు. ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎస్ ఎన్ మీరా మాట్లాడుతూ, లలిత సూపర్ స్పెషాలిటీ వారు జర్నలిస్టుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. మంగళగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వానపల్లి బ్రహ్మానాయుడు మాట్లాడుతూ, జర్నలిస్టుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న ఏకైక యూనియన్ ఏపీయూడబ్ల్యూజే అని ప్రశంసించారు. రాయల్ బ్యాంకెట్ ఫంక్షన్ హాల్ ఎండి నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను కూడా గతంలో జర్నలిస్టుగా పనిచేశానని జర్నలిస్టులు ఎదుర్కొనే సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. డీఎస్పీ మురళీకృష్ణ, నన్నపనేని నాగేశ్వరరావు లను యూనియన్ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు జొన్న వెంకటేష్, కార్యదర్శి బత్తుల సాంబశివరావు (సాంబ), ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భక్తవత్సలం, ఐజేయూ సభ్యులు మార్కండేయులు, కోశాధికారి ఫణీంద్ర, ఏపీయూడబ్ల్యూజే తెనాలి అధ్యక్షులు చందు సాంబశివరావు, ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు తాడిబోయిన నాగేశ్వరరావు, జొన్న రాజేష్, జిల్లా నాయకులు సింహాద్రి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్‌గా నియమితులైన షేక్ కరిముల్లాను సత్కరించిన తెలుగు మహిళా,తెదేపా నాయకులు

**చిలకలూరిపేట, జులై21,ప్రభాతవార్త:** చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆశీస్సులతో నియమితులైన షేక్ కరిముల్లాను సోమవారం టిడిపి



కార్యాలయంలో తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మిరియాల రత్నకుమారి, టిడిపి మహిళా నాయకులు కలసి సత్కరించి అభినందనలు తెలియచేశారు. అదేవిధంగా మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, నాదెండ్ల మండల టిడిపి అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మురకొండ మల్లిబాబు, టిడిపి నాయకులు షేక్ అజారుద్దిన్, ఐటిడిపి నాయకులు మహ్మద్ రఫీ, తెలుగు యువత నాయకులు షేక్ కరిముల్లా,గోపాళం నాగేశ్వరరావు,తన్నీరు పుల్లారావు తదితరులు కలిసి సత్కరించి అభినందనలు తెలియచేశారు. అదేవిధంగా నాదెండ్ల మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు,నాదెండ్ల సొసైటీ అధ్యక్షులుగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన నల్లమోతు హరిబాబును ఈ సందర్భంగా టిడిపి నాయకులు పార్టీ కార్యాలయంలో సత్కరించి అభినందనలు తెలియచేశారు.

# మహిళా భద్రతపై అవగాహన

**గుంటూరు తూర్పు, జులై 21 (ప్రభాతవార్త) :** మహిళల భద్రతకు ప్రత్యేక దృష్టి పెట్టామని డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం లలాపేటలోని ఓ కళాశాలలో విద్యార్థులకు మహిళల భద్రతపై అవగాహన సదస్సు



నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, శక్తి బృందాల సేవల గురించి వివరించారు. ఆపదలో ఉన్నపుడు 112, లేదా 1098కి కాల్ చేయాలని సూచించారు. మహిళా కానిస్టేబుళ్ళతో కూడిన శక్తి బృందాల సేవలు గురించి వివరించి తమ శిక్షణతో విద్యార్థినులు నిర్భయంగా జీవించగలిగే విధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీతో పాటు, సిఐ నారాయణ, మహిళా ఎస్సై ప్రమీల, శక్తి బృందాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కారం

## -అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు

**గుంటూరు తూర్పు, జులై 21 (ప్రభాతవార్త) :** స్థానిక సమస్యల పరిష్కారం కోసం చేపట్ట యువర్ కమీషనర్ పిజిఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. నగర కమీషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమీషనర్ ఛాంబర్‌లో డయల్‌యువర్ కమీషనర్, డిప్యూటీ కమిషనర్ల చాంబర్లలో పిజిఆర్ఎస్‌ను అదనపు కమీషనర్ నిర్వహించారు. ఈ



సందర్భంగా అదనపు కమీషనర్ డయల్‌యువర్ కమీషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 11ఫిర్యాదులు తీసుకుని అధికారులతో మాట్లాడుతూ డయల్‌యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్ళాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమీషనర్ ఛాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిఎంసి పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకుని అదనపు కమీషనర్ అధికారులతో మాట్లాడి పిజిఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా మొత్తం 19ఫిర్యాదులు అందాయని, పట్టణ ప్రణాళిక విభాగం 3, ఇంజనీరింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 3, ప్రజారోగ్య విభాగం 3, ఉపాసెల్ విభాగానికి సంబంధించి 1 ఫిఆర్యదులు అందాయన్నారు. పిజిఆర్ఎస్‌లో ప్రజల నుండి అందిన అర్జీలను విబాగాల వారిగా విభజించి సంబంధిత విభాగాధిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, పిసి రాంబాబు, ఈఈలు సుందరామిరెడ్డి, కోటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓలు రామారావు, సోమశేఖర్, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కు 8ఫిర్యాదులు

**పొన్నూరు, జులై 21,ప్రభాతవార్త:** ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు సోమవారం ఎనిమిది అర్జీలు వివిధ సమస్యలకు సంబంధించి వచ్చినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు.



అందులో రెవెన్యూకు సంబంధించి మూడు అర్జీలు, సర్వేకి సంబంధించి నాలుగు అర్జీలు, పంచాయితీరాజ్ శాఖకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు చెప్పారు. వీటిని పరిష్కారం నిమిత్తం ఆయా శాఖలకు పంపినట్లు తెలిపారు. ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఈఓపిఆర్డీ మల్లికార్జునరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వెలగపూడి సచివాలయానికి ప్రతి రోజూ ఆర్టీసీ బస్సు సర్వీస్సు

**నరసరావుపేట, జులై 21 ప్రభాతవార్త :** నరసరావుపేట ఆర్టీసీ డిపో నుండి వెలగపూడి సచివాలయానికి ప్రతి రోజూ ఆర్టీసీ బస్ సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బి.శ్రీనివాస రావు సోమవారం తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వెలగపూడి సచివాలయానికి వెళ్ళే ఉద్యోగులతో పాటు వివిధ పనుల నిమిత్తం అక్కడికి ప్రయాణించే వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. వారు పూర్తిగా ప్రైవేట్



వాహనాలపై ఆధారపడి ఉండటంతో భారంగా ఉందని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వారిని దృష్టిలో ఉంచుకొని ఉదయం 7.15 నిమిషాలకు, మధ్యాహ్నం 3.30 గంటలకు డిపో నుండి బయల్దేరుతుందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా ప్రతి రోజూ సర్వీసులు ఉంటాయని డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు తెలియజేశారు.

# సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

**నకరికల్లు, జులై 21 ప్రభాతవార్త :** మండలంలోని గుండ్లపల్లి రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కేజీకి రూ.5 ల సబ్సిడీతో వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఒకే కేజీ విత్తన ధర రూ.43లు ఉండగా రైతులు చెల్లించాల్సిన ధర రూ.38 లు అని తెలియజేశారు. కెఎన్ఎం -1638, బిపిటి 5204 వరి రకాలకు సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు పట్టాదారు పాసు బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్లు రైతు సేవా కేంద్రానికి తీసుకురావాలని వ్యవసాయ విస్తరణ అధికారి దిలీప్‌కుమార్, ఉల్లిగడ్డల ప్రియదర్శిని, సునీలకుమారి సూచించారు.

# కండ్లకుంట మోడల్ స్కూల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల, జులై 21 ప్రభాతవార్త:** మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న మోడల్ స్కూల్‌ను సందర్శించారు. అనంతరం అక్కడున్న మౌలిక వసతులు, విద్యాబోధనలకు సంబంధించిన అంశాలను స్కూల్ వైస్ ప్రిన్సిపల్





పాండురంగారావును అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ప్రాంగణం, తరగతి గదులను కలియతిరిగి పరిశీలించారు. తాగునీరు, విద్యుత్తుకు సంబంధించిన ఇబ్బందులపై ఆరాతీశారు. వసతిగృహం ఏర్పాటుకు కావలసిన వసతులు, నిధుల గురించి ఏపీ మోడల్ స్కూల్ ప్రాజెక్టు డైరెక్టర్ దేవానందరెడ్డితో మాట్లాడి సాధ్యమైనంత త్వరలో నిధులు కేటాయించి, వసతిగృహానికి తాగునీరు, విద్యుత్తు, ప్రహరీగోడ, సోలార్ ఫెన్సింగ్ వంటివి నిర్మించాలని కోరారు.

**హాస్టల్ వసతి లేక ఐదేళ్లుగా విద్యార్థుల అవస్థలు**

2019 నుంచి అప్పటి వైసీపీ ప్రభుత్వానికి మోడల్ స్కూల్లో వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు వినతులు సమర్పిస్తున్నా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. వెల్దుర్తి మండలంలో కీలకంగా ఉన్న ఈ ప్రభుత్వరంగ విద్యాసంస్థకు దాదాపు మండలంలోని అన్ని గ్రామాల నుంచి విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు సుముఖత వ్యక్తం చేస్తుంటారు. ప్రతి ఏటా 700 మంది విద్యార్థులకు తగ్గకుండా నిండుగా ఉండే ఈ పాఠశాలలో వసతిగృహం లేక 450 మందికి పడిపోయింది. మండలంలో ప్రస్తుతానికి గుండ్లపాడు, గొట్టిపాళ్ల, కేపీగూడెం, గంగలకుంట, మండాది గ్రామాల నుంచి విద్యార్థులు డైలీ సర్వీసు చేస్తున్నారు. అదే హాస్టల్ వసతి కల్పిస్తే, విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాలలో వసతిగృహం ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్ మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి విన్నవించగా, సానుకూలంగా స్పందించిన ఆయన సాధ్యమైనంత త్వరగా హాస్టల్ ఏర్పాటుకు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. వసతి గృహానికి సంబంధించిన మౌలిక వసతుల కల్పన యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం మోడల్ స్కూల్‌ను స్వయంగా సందర్శించి, వసతిగృహ ప్రాధాన్యతను ప్రాజెక్టు డైరెక్టర్ దేవానందరెడ్డికి వివరించి నిధులు కేటాయించాల్సిందిగా ఎమ్మెల్యే జూలకంటి విజ్ఞప్తి చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలి

## -ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

**నూజెండ్ల, జులై21, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించాలని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలకేంద్రమైన ఎంపిడివో కారా ్యలయంలో జరిగిన




మండల సర్వసభ్య సమావేశానికి జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీ.వీ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మేడం జయరాంరెడ్డి, ఎంపిడివో ఉమాదేవి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ మీసాల మురళి, జెడ్పిటిసి జడ్డా సుబ్బులు రామయ్య, సొసైటీ ఛైర్మన్ ముంద్రు సుబ్బారావు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించటం చట్టరీత్యా నేరం : డిహెచ్‌ఎంఓ అన్నపూర్ణ

**తెనాలి, టౌన్ జులై 21 (ప్రభాతవార్త) :** గర్భశిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించటం చట్టరీత్యా నేరమని, అలా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ వెల్లడించారు. పిసిపిఎన్డిటి యాక్ట్ సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ సలహా సంఘ



సమావేశము సోమవారం సంఘ అధ్యక్షులు డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ అధ్యక్షతన కొత్తపేటలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో గల ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధి . కారి కార్యాలయం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ మాట్లాడుతూ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, లేబరేటరీ వారు లింగనిర్ధాణపై ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ఇచ్చి చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు. తొలి విడత నిబంధనలు ఉల్లంఘిస్తే మూడు సంవత్సరములు జైలుశిక్ష, ఐదు వేల రూపాయలు అపరాధ రుసుముతో పాటు, వైద్య మండలి వారి ధృవీకరణ పత్రం ఐదు సంవత్సరాల పాటు తొలగించబడుతుందన్నారు. రెండోసారి కూడా ఉల్లంఘిస్తే ఐదు సంవత్సరాలు జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానాతో పాటు వారి ధృవీకరణ పత్రం శాశ్వతంగా వైద్య మండలి నుండి రద్దు చేయబడుతుందన్నారు. ఆడపిల్ల అయినా మగ బిడ్డ అయినా ఒకటేనని ఈ రోజుల్లో ఆడ పిల్లలకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, వైద ్య రంగంలో పారిశ్రామిక రంగంలో అంతరిక్ష రంగంలో కూడా ఆడ పిల్లలు రాణిస్తూ తమ ప్రతిభను ప్రపం వ్యాప్తంగా చాటుచున్నారని, ప్రతి తల్లి, తండ్రి ఆడపిల్లను తక్కువ చూపు చూడవద్దనే విషయం తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వినీల్, డాక్టర్ సురేష్, డాక్టర్ మానస, డాక్టర్ వేముల ప్రియాంక, రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షురాలు ముమ్మనేని భానుతి, పెనుగొండ వెంకటేశ్వరరావు, నాళం శ్రీమన్నారాయణ, తదితరులు హాజరై తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.

# ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, జులై 21 ప్రభాతవార్త :** మండలంలోని పాకాలపాడు గ్రామంలో పిఏసియస్ ఛైర్మన్ కొనికినేని సత్యనారయణ, మెంబర్లు పేరం హరిబాబు, అన్నదాసు వెంకటరామయ్యల ప్రమాణ స్వీకార మహోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో కోఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకం అన్నారు. కొత్తగా నియమితులైన సొసైటీ ప్రతినిధులు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సొసైటీలో బకాయిలు త్వరగా చెల్లించే విధంగా చూడాలన్నారు. సొసైటీలను విజయవంతంగా నడిపించాలని సూచించారు. అదే విధంగా నియోజకవర్గంలో గత ఐదేళ్లలో సొసైటీలకు సంబంధించి జరిగిన అవకతవకల గురించి విచారణ జరిపి చర్యలు



తీసుకుంటామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎల్లినేడి రామస్వామి, మండల, జిల్లా, నియోజకవర్గ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత

**సత్తెనపల్లి, జులై 21 ప్రభాతవార్త :** కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 85 మంది విద్యార్థులకు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. గత 13 సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లు, ఉచిత త్రాగునీరు, మెగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన సహకారాన్ని ట్రస్ట్ ద్వారా



అందజేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సత్తెనపల్లిలో రోజుకు 14 వేల లీటర్లు మంచినీటిని పాఠశాలలకు, ప్రభుత్వ ఆసుపత్రికి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పి-4 కార్యక్రమం ద్వారా పేదలకు సహాయం అందిస్తామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : ఎంఈవో

**కొల్లిపర, జులై 21 (ప్రభాతవార్త) :** ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని చివలూరు, కొల్లిపర, ప్రాథమిక




పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థులు హాజరు పట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అనేక మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. ప్రతినెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం మంచిదన్నారు. విద్యార్థుల యక్క పురోగతిని వారికి తెలియజేయడం మంచిదన్నారు. మధ్యాహ్నభోజన పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

# విజ్ఞాన్స్‌లో ప్రారంభమైన ఇన్నోవేషన్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్

**పొన్నూరు, జులై 21, ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజా ్న్ టీబీఐ ఆధ్వర్యంలో ఎఐసీటిఈ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్స్ ఇన్నోవేషన్ సెల్‌ల ఆర్థిక సౌజన్యంతో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఆన్



ఇన్నోవేషన్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన 60కిపైగా ఉన్నత విద్యాసంస్థల అధ్యాపకులు ఇందులో పాల్గొన్నారు. వీరు విభిన్న అకాడమిక్ శాఖల నుంచి రావడం విశేషం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అస్పైర్ టీబీఐ సీఈవో డాక్టర్ బీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఇంటర్‌డిసిప్లినరీ లెర్నింగ్ ప్రాముఖ్యతను వివరించారు. క్రియేటివిటీ, ఐడియా జనరేషన్ గురించి వివరించారు. మానసిక అడ్డంకులను ఎలా అధిగమించాలో, కొత్త ఆలోచనలను ఎలా కల్పించాలో అధ్యాపకులకు వివరించారు. సృజనాత్మకత ఒక స్వభావ లక్షణం కాదు. అది అభ్యాసం ద్వారా అభివృద్ధి చేసుకునే నైపుణ్యమని తెలియజేశారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన అశోక ఫెలో, ఇన్నోవేషన్ కోచ్ డాక్టర్ రవిచంద్రరాజు మాట్లాడుతూ సమస్యలపై విద్యార్థుల్లో దృష్టికోణాన్ని పెంపొందించేలా అధ్యాపకులు మారాలని సూచించారు. విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనలను పెంపొందించడం గురించి వివరించారు. విద్యార్థుల్లో జిజ్ఞాస, సృజనాత్మకత, రిస్క్ టేకింగ్ లక్షణాలను ఎలా ప్రేరేపించాలో వివరించారు. విద్యార్థులు వాస్తవ జీవిత సమస్యలను గుర్తించడంలో అధ్యాపకులు మార్గనిర్దేశం చేయాల్సి బాధ్యతలను ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో చివరగా నిర్వహించిన ఇన్నోవేటిక్ వర్క్‌షాప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో భాగంగాసృజనాత్మక సాధనాలతో, లాటరల్ థింకింగ్ ప్రక్రియలతో పాల్గొన్నవారు సమస్యలకు వినూత్న పరిష్కారాలు రూపొందించారు. ఇది స్టార్టప్ పర్యావరణంలో ఎదురయ్యే ఒత్తిడి, సమయ పరిమితులను అనుకరించేలా రూపొందించబడింది. కార్యక్రమానికి హాజరైన ఫ్యాకల్టీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని సంప్రదాయ శిక్షణలకంటే చాలా భిన్నంగా, ఎంతో ప్రామాణికంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఐపీఆర్, డిజైన్ థింకింగ్, ఇంక్యుబేషన్ స్ట్రాటజీలు వంటి అంశాలపై వచ్చే సెషన్లతో ఈ ఎఫ్‌డిపీ విద్యాసంస్థలో ఆవిష్కరణ వేగవంతం చేయడానికి అధ్యాపకులను సిద్ధం చేస్తుందని, తద్వారా వారు భవిష్యత్ మార్పు దృక ్పథంతో ఉన్న యువతలో స్ఫూర్తిని నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# భీమా ప్రభుత్వమే చెల్లించాలి : పిడిఎఫ్

**పెదకూరపాడు, జులై 21 ప్రభాతవార్త :** భీమా ప్రభుత్వమే చెల్లించాలని పిడిఎఫ్, రైతు సంఘం నాయకులు దర్శి శేషారావు, ఎం.మస్తాన్, ఆలీ కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పత్తి, కంది, శనగ, మొక్కజొన్న, పసుపు పంటలకు భీమా ప్రభుత్వమే చెల్లించాలన్నారు. గ్రామ యూనిట్‌గా



నష్టపరిహారం ఉండాలన్నారు. వ్యవసాయ సహాయకులను నియమించాలన్నారు. పెదకూరపాడులో ఉద్యానవన సహాయక పోస్టు యధావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరావు, జి.శ్రీను, హరిబాబు, సాంబశివరావు పాల్గొన్నారు.

# మిధున్‌రెడ్డి అరెస్ట్ ప్రజాస్వామ్య గెలుపు : మద్దిరాల

**పెదకూరపాడు, జులై 21 ప్రభాతవార్త :** మద్యం కుంభకోణంలో ఎం.పి.మిధున్‌రెడ్డి అరెస్ట్ ప్రజాస్వామ్య గెలుపు అని నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఐదేళ్ళలో రూ.30 వేల కోట్లు ఆ పార్టీ నాయకులు దోచుకున్నారని తెలిపారు. సొంత బ్రాండ్‌లతో కల్తీ మద్యాన్ని అధిక ధరలకు అమ్మారని ఆరోపించారు. వందల మంది ప్రజలు ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్తీ మద్యంపై ఉక్కుపాదం మోపిందని మద్దిరాల గంగాధర్ అన్నారు.



# కూటమి ప్రభుత్వ మోసాలను ప్రతి గడపకు తీసుకెళ్ళండి : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట, జులై 21 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వ మోసాలను ప్రతి గడపకు తీసుకెళ్ళాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా




విస్మరించారని విమర్శించారు. తల్లికి వందనం ఎక్కడ చూసినా తమకు రాలేదని రాస్తారోకోలు, ధర్నాలు మహిళలు చేస్తున్నారని తెలిపారు. శ్రీకాకుళం కలెక్టరేట్ ఎదుట ఈ రోజు పెద్ద ఎత్తున మహిళలు తమకు తల్లి వందనం డబ్బులు రాలేదని, యూనిఫాం, పుస్తకాలు సక్రమంగా ఇవ్వలేదని ధర్నా చేయడం జరిగిందన్నారు. అదే విధంగా స్వయంగా టిడిపి ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలో ఒక్కొక్క పాఠశాలలో 20 మందికి, 50 మందికి తల్లికి వందనం రాలేదని బహిరంగంగా చెప్పడం ఈ పథకంలో మోసాన్ని తెలియజేస్తుందన్నారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీని లేకుండా చేసేందుకు ఎం.పి. మిధున్‌రెడ్డి, కీలకమైన నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంటి వారిపై లేని స్కాంలను సృష్టించి కేసులతో వేధించి కూటమి ప్రభుత్వం జైళ్ళకు పంపుతుందన్నారు. అదే విధంగా విజయవాడలో రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఒక ప్రైవేట్ సంస్థ షాపింగ్‌మాల్ నిర్మించేందుకు ఇవ్వడం విడ్డూరంగా ఉందని, సంపద సృష్టి అంటే ఇదేనా అని ప్రశ్నించారు. రాజధాని పేరుతో మళ్ళీ లక్షల ఎకరాలు ఇవ్వాలని రైతులను బలవంతం చేస్తున్నారన్నారు. తీసుకున్న భూమిని ఇప్పటివరకు ఏం చేశారని అక్కడి రైతులు ప్రశ్నిస్తున్నారని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. పార్టీ పట్టణ కమిటీతో పాటు వార్డు స్థాయిలో, గ్రామస్థాయిలో బలోపేతం చేసి ముందుకు వెళ్ళాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇ.ఎం.స్వామి, సుజాతపాల్, మాగులూరి రమణారెడ్డి, ఎన్.కె.ఆంజ నేయులు, అచ్చి శివకోటి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ, ఎమ్మెల్యేలు కృషి చేయాలి


## నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రామచంద్రారెడ్డి

**మాచర్ల, జులై 21 ప్రభాతవార్త:** పార్ల మెంటు, అసెంబ్లీ సమావేశాల్లో వరికపూడి సెలపై చర్చించి నిధులు తేవాల్సిన బాధ్యత ఎంపీ, ఎమ్మెల్యేలపై ఉందని కాంగ్రెస్ పార్టీ




నియోజకవర్గ ఇన్‌ఛార్జి యరమల రామచంద్రారెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రోజు ప్రారంభమైన సమావేశాల్లో అయినా ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వరికపూడిసెల, మాచర్ల అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంటు సమావేశాల్లో ఢిల్లీలో ఎంపీ గారిపై గట్టిగా ఒత్తిడి తెచ్చి మాచర్ల అభివృద్ధిలో వరికపూడిసెల, పర్యాటక ప్రాజెక్టు, కేంద్ర ప్రభుత్వ పరంగా ఒక భారీ పరిశ్రమ వెంటనే వచ్చే విధంగా చేయాల్సిన అవసరం ఎమ్మెల్యేపై ఉందన్నారు. ఈ మూడు పనులు పూర్తయితే మాచర్ల నియోజకవర్గంలో యువతకు వేల ఉద్యోగాలు, రైతులు వ్యవసాయపరంగా సస్యశ్యామలంగా ఉంటారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లి అక్కడే ఉండి కేంద్రంచే మంజూరు చేయాల్సిన అవసరాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గి, మాచర్ల, రెంటచింతల అధ్యక్షులు చిమటా వెంకటేశ్వర్లు, గాదె పుల్లారెడ్డి, దొడ్డ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు షేక్ బాబు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సారు.. మా ఆఫీస్ పరిస్థితి చూడండి సారు..



**సత్తెనపల్లి, జులై 21 ప్రభాతవార్త :** పట్టణంలో చిన్నపాటి వర్షానికే ప్రభుత్వ కార్యాలయం అయిన ఉప ఖజానా అధికారి వారి కార్యాలయం చిత్తడిగా మారుతుంది. ఈ కార్యాలయంలో పాత భవనంలో ఉండటంతో పాములు, తేళ్ళు వంటి విషసర్పాలు సైతం సంచరిస్తున్నాయి. కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు సమస్యను అధిగమిస్తూ తమ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఖజానా కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

# పార్టీ బలోపేతానికి నూతన సభ్యులు కృషి చేయాలి

## -అంబటి మురళీకృష్ణ పిలుపు

**పొన్నూరు, జులై 21, ప్రభాతవార్త:** వైకాపా గ్రామ, వార్డు, బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు, నూతనంగా పదవులు పొందిన వారు కృషి చేయాలని వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నూతనంగా పదవులు పొందిన నాయకులు వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకుల అభీష్టం మేరకే మండల, పట్టణ, వివిధ విభాగాల బాధ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్నికైన బాధ్యులందరూ సక్రమంగా పనిచేయాలని కోరారు. రానున్న కాలంలో పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. పార్టీని 2029లో అధికారంలోకి తెచ్చేవిధంగా నాయకత్వం పనిచేయాలన్నారు. పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. తద్వారా నాయకులుగా మనకు కూడా గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. పార్టీ నాయకులకు,



కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పార్టీని పటిష్టపరచాల్సిన బాధ్యత పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చుండూరు వీరయ్య, చింతలపూడి మురళీకృష్ణ, ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపిపి భవనం పద్మలీల, అంబటి వెంకటేశ్వరరావు, ఎందేటి వెంకట సుబ్బయ్య తదితరులున్నారు.

# చిన్నపాటి వర్షానికి చెరువును తలపిస్తున్న మండల పరిషత్

గురజాల, జులై 21 ప్రభాతవార్తః గురజాల నగర పంచాయతీ పరిదిలో సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటలకు పైగా కురిసిన వర్షానికి మండల పరిషత్ కార్యాలయం వద్ద వర్షపునీరు నిలిచి చెరువును తలపిస్తోంది. కార్యాలయం లోపల, వెలుపల జలమయం అయ్యాయి. పాదాచారులకు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నేళ్లుగా మండల పరిషత్ కార్యాలయం వద్ద చిన్నపాటి వర్షానికే వర్షపునీరు చేరుతోంది. సంబందిత అధికారులు వెంటనే చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలాన్ని పరిశీలించిన జిల్లా హెల్త్ కో ఆర్డినేటర్ వినయ్

చిలకలూరిపేట, జులై 21, ప్రభాతవార్త: పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి పడగొట్టిన స్థలం ఎన్నో సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నది. దానిలో తల్లి, పిల్లల హస్పటల్ నిర్మించాలని కోరుతూ గతంలో మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించిన షేక్ జమాల్‌భాషా ప్రభుత్వానికి, మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటికి విజ్ఞప్తి చేశారు. కాగా ఇటీవల ఆ స్థలంలో తల్లిపిల్లల హస్పటల్ నిర్మించాలనే పట్టుదలతో తల్లిపిల్లల హస్పటల్ సాధన కమిటి అనే దానిని ఏర్పాటుచేశారు. ఆ కమిటి విజ్ఞప్తి మేరకు సోమవారం జిల్లా హెల్త్ కో ఆర్డినేటర్ వినయ్, మండల సర్వేయర్ ప్రసాద్‌తో కలిసి వచ్చి ఆ స్థలాన్ని పరిశీలించారు. దీనిలో ఆసుపత్రి నిర్మించటానికి అవసరమయ్యే అనుకూలత ఉందా లేదా అని పరిశీలించారు దీనిపై డియంహెచ్‌ఓకు ఒక నివేదికను ఆయన అందచేయనున్నారు. ఈ కార్యక్రమంలో తల్లిపిల్లల హస్పటల్ సాధన కమిటి గౌరవ అధ్యక్షులు జమాల్‌భాషా, అధ్యక్షులు చేవూరి కృష్ణమూర్తి, కార్యదర్శి నాయుడు శివకుమార్, సభ్యులు పేలూరి రామరావు, తోట సత్యనారాయణ, రాచుమల్లు నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



22-7Pg5.qxd:22-7Pg5.qxd 01/01/01 7:37 AM Page 1



# పహల్గాంపై చర్చ జరపవలసిందే






## లోక్‌సభ, రాజ్యసభలో పట్టుపట్టిన విపక్షాలు
## చర్చకు సిద్ధమేనన్న ఎన్డీయే పక్షం
## తొలిరోజే ఉభయసభల్లో వాడివేడి చర్చలు

**న్యూఢిల్లీ,జూలై 21:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే పహల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు లోక్ సభ, రాజ్యసభలో విపక్షాలు పట్టుపట్టాయి. భారత్ పాక్ కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 24 సార్లు చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డాయి. దీనిపై పార్లమెంటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ చీఫ్, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో పాటు ఇతర విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'లపై చర్చ కోసం రూల్ 267 కింద వారు రాజ్యసభలో వాయిదా నోటీసులను అందించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలపై చర్చలో పాల్గొనేందుకు నిరాకరించారు. పహల్గామ్ ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'లపై రెండు రోజుల పాటు ఉభయ సభల్లో చర్చించాలని జీరో అవర్‌లో ఖర్గే డిమాండ్ చేశారు. దీనిపై విపక్ష ఎంపీలంతా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభ కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. 12 గంటలకు రాజ్యసభలో క్వశ్చన్ అవర్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈక్రమంలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులను నేటికీ గుర్తించలేదన్నారు. ఉగ్రదాడి జరిగిన రోజు ఏప్రిల్ 22న పహల్గాంలో భద్రతా లోపాలు ఉన్నాయని స్వయంగా జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఆ ఉగ్రదాడికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని అన్ని పార్టీలు కోరుకుంటున్నాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన కొన్ని వివరాలను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్), డిప్యూటీ ఆర్మీ చీఫ్, మరో సీనియర్ ఆర్మీ ఉన్నతాధికారి వెల్లడించారని ఖర్గే చెప్పారు.

మరోవైపు విపక్షాల డిమాండ్‌పై రాజ్యసభలో కేంద్ర మంత్రి జెపి నడ్డా స్పందించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర చర్చకు నరేంద్ర మోడీ సారథ్యంలోని ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అలాంటి సైనిక ఆపరేషన్ ఎన్నడూ జరగలేదన్నారు. పహల్గాం ఉగ్రదాడపైనా చర్చిస్తామని తెలిపారు. ఇంతకుముందు పార్లమెంటు బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలోనూ ఈ వివరాలను విపక్షాలకు తాము తెలిపామని నడ్డా చెప్పారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై సభ్యులు కోరుకున్నన్ని రోజులు పూర్తిస్థాయి చర్చ జరుగుతుందని విపక్ష ఎంపీలకు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ కూడా హామీ ఇచ్చారు. దీనిపై తాను అన్ని పార్టీల నేతలతో మాట్లాడతానన్నారు. అయితే ఆలస్యం చేయకుండా ఆపరేషన్ సిందూర్‌పై వెంటనే చర్చను మొదలుపెట్టాలని ఖర్గే కోరారు. దీనిపై నడ్డా స్పందిస్తూ, తాము చర్చ నుంచి తప్పించుకునే యత్నం చేయడం లేదన్నారు. ఈక్రమంలో రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్ కలుగజేసుకుంటూ, అన్ని పార్టీల ఎంపీలు పరస్పర గౌరవ భావంతో మెలగాలని కోరారు. పరుష పదజాలాన్ని, వ్యక్తిగత దూషణలను ఏ వేదికపైనా చేయొద్దన్నారు.

ఘర్షణలు, విమర్శలు అనేవి అర్థవంతమైన రాజకీయాలు కానే కావని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో ఏఒక్కరు కూడా భారత ప్రయోజనాలను వ్యతిరేకించరని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. భారత నాగరికతలోని విలువలకు వ్యతిరేకంగా ఉండే నడవడిని వీడాలన్నారు. పార్లమెంటు సమావేశాలు అర్థవంతంగా జరగాలంటే, చర్చలు, సంప్రదింపులు మాత్రమే మార్గాలని జగదీప్ ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. భారతదేశ చారిత్రక బలం కూడా చర్చలు, సంప్రదింపులు, సంభాషణలపైనే ఆధారపడి ఉందన్నారు. ఆ బాటలోనే పార్లమెంటు చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఎంపీలకు ఆయన పిలుపునిచ్చారు. అంతర్గత కుమ్ములాటల వల్ల మన శత్రువులకు బలం వస్తుందని, మనల్ని విభజించే సామర్థ్యం వాళ్లకు లభిస్తుందన్నారు. తన నివాసంలో నోట్ల కట్టలు లభ్యమైన వ్యవహారంలో జస్టిస్ యశ్వంత్ వర్మపై 200 మందికిపైగా ఎంపీలు పార్లమెంటులో సోమవారం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. లోక్‌సభలో 145 మంది ఎంపీలు, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఈ తీర్మానానికి సంబంధించిన నోటీసులు అందించారు. లోక్‌సభలో ఈ నోటీసులు అందించిన ఎంపీల్లో అనురాగ్ ఠాకూర్, రవిశంకర్ ప్రసాద్, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, రాజీవ్ ప్రతాప్ రూడీ, పిపి చౌదరి, సుప్రియా సూలే, కెసి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217, 218 కింద ఈ నోటీసులు అందించారు. జడ్జి తొలగింపునకు సంబంధించిన తీర్మానంపై కనీసం 100 మంది లోక్‌సభ ఎంపిలు, 50 మంది రాజ్యసభ ఎంపిలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. 145 మంది లోక్‌సభ ఎంపీలు, 63 మంది రాజ్యసభ ఎంపిలు సంతకాలు చేసినందుకు ఈ తీర్మానం తదుపరి దశకు చేరడం దాదాపు ఖాయమైంది. దీనిపై రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్ తుది నిర్ణయాన్ని తీసుకోనున్నారు. నివాసంలో నోట్ల కట్టలు లభ్యమైన వ్యవహారంతో తనకు సంబంధం లేదని జస్టిస్ యశ్వంత్ వర్మ అంటున్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత దర్యాప్తు కమిటీ విచారణ జరిపి, నోట్ల కట్టలు లభ్యమైన స్టోర్ రూంపై జడ్జి, ఆయన కుటుంబానికే పూర్తి పట్టు ఉందని తేల్చింది.



## గాజాలో అన్నార్తులపై ఆగని దాడులు
### తాజా కాల్పుల్లో 90 మంది మృత్యువాత

**డెయిర్ అల్‌బలా, జూలై 21:** హమాస్ ఉగ్రవాదులను ఏరివేసేందుకు చేపట్టిన యుద్ధం కారణంగా గాజా మరుభూమిగా మారిపోయింది. ఎక్కడచూసినా శిథిలాలే కనిపిస్తున్నాయి. అక్కడక్కడా గాజా పౌరులు దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారు. తిండి, నీరులేక ఆకలితో అలమటిస్తున్నారు. ఇటు ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు, అటు హమాస్ ఉగ్రవాదుల ఎదురుకాల్పుల మధ్య వారు నలిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో గాజా పౌరుల ఆకలి తీర్చేందుకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు గాజాలో మానవతా సహాయ కేంద్రాలను ఏర్పాటుచేశాయి. ఈ కేంద్రాలవద్ద ఇజ్రాయెల్‌సైన్యం కాపలా కాస్తోంది. ఆకలి తట్టుకోలేక జనం ఈ కేంద్రాల వద్ద పోటెత్తుతున్నారు. వారిని నియంత్రించేందుకు సైనికులు కాల్పులు జరుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా నార్త్ గాజాలోని ఓ ఆహార పంపిణీ కేంద్రం వద్ద గుమిగూడిన జనాలను నియంత్రించేందుకు ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు జరిపిందని, ఈ ఘటనలో ఏకంగా 80 మంది మరణించారని గాజా సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ ఆరోపించింది. మరో రెండు కేంద్రాల వద్ద 10 మందికిపైగా గాజా పౌరులు మృత్యువాత పడ్డారని తెలిపింది. ఆకలి తట్టుకోలేక సాయం కోసం వచ్చిన అమాయకులపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడిఎఫ్) తూటాల వర్షం కురిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది.

కాగా, గాజాలో పౌరుల దీనస్థితికి అద్దంపట్టే సంఘటన గురించి ఐక్యరాజ్య సమితి అధికారులు వివరిస్తూ.. ఇటీవల గాజా సిటీలోకి ఐక్యరాజ్య సమతి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ కింద 25 ట్రక్కులనిండా ఆహార పదార్థాలు, నిత్యా వసర వస్తువులను పంపించిందనిచెప్పారు. సరిహద్దుల్లో తనిఖీల తర్వాత ట్రక్కులు ఇలా గాజా సిటీలోకి ప్రవేశించాయో లేదో వందలాది మంది పౌరులు వాటిని చుట్టుముట్టారని తెలిపారు.

## అక్రమ వలసదారులను బయటకు విసిరేయాల్సిందే!
### సిబిపి అధికారిపై కాల్పులతో ట్రంప్ ఆగ్రహం

**వాషింగ్టన్,జూలై 21:** యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సిబిపి) అధికారిపై అక్రమ వలసదారుడు కాల్పులు జరిపిన ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. అక్రమ వలసదారులను సరిహద్దు బయటకు విసిరేస్తామని చెప్పారు. దాడిచేసిన వ్యక్తిని 2023 ఏప్రిల్‌లో పట్టుకున్నప్పటికీ బహిష్కరించకుండా విడుదల చేశారని విమర్శించారు. కాల్పుల ఘటనపై ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ జో బైడెన్ పాలనలో విడుదలైన ఒక అక్రమ వలసదారుడు నిన్న రాత్రి న్యూయార్క్‌లో సిబిపి అధికారిపై కాల్పులు జరిపాడు. అతడిని 2023 ఏప్రిల్‌లో సరిహద్దు వద్ద పట్టుకున్నారు. కానీ బహిష్కరించకుండా విడుదల చేశారు. కాల్పుల్లో సిబిపి అధికారి గాయపడినప్పటికీ దాడి చేసిన వ్యక్తితో ధైర్యంగా పోరాడి ధైర్యాన్ని ప్రదర్శించాడు. డెమోక్రాట్లు మన దేశాన్ని నేరస్థుల ఆక్రమణలతో నింపారు. ఇప్పుడు వారందరినీ బయటకు విసిరివేయాలి, లేదా కేసులు నమోదు చేయాలి, ఎందుకంటే వారు మళ్లీ తిరిగి వచ్చే అవకాశం ఇవ్వకూడదు. వారు చాలా ప్రమాదకరమైన వారని ట్రంప్ ఆ పోస్టులో పేర్కొన్నారు.

న్యూయార్క్ పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ కథనం ప్రకారం.. ఈ ఘటన రాత్రి 11:50 గంటల సమయంలో ఫోర్ట్ వాషింగ్టన్ పార్క్‌లో జరిగింది. 42 ఏళ్ల ఫెడరల్ ఏజెంట్ ఒక మహిళతో కలిసి హడ్సన్ నది ఒడ్డున ఒక రాతిపై కూర్చొని ఉండగా ఇద్దరు వ్యక్తులు మోపెడ్‌పై వచ్చారు. ఒక వ్యక్తి దిగి అధి కారి వద్దకు వచ్చాడు. అతడు దోపిడీకి గురవుతున్నట్టు గ్రహించి వెంటనే తన సర్వీస్ వెపన్‌ను బయటకు తీశాడు. ఇద్దరూ కాల్పులు జరిపారు. అధికారి ముఖం, ఎడమ చేతికి గాయాలయ్యాయి. దాడిచేసిన వ్యక్తి కూడా గాయపడ్డాడు. తర్వాత నిందితులిద్దరూ పారిపోయారు. పారిపోయిన వారిలో ఒకరిని 21 ఏళ్ల అక్రమ వలసదారుడు మిగ్యూల్ మోరాగా గుర్తించారు.



## టేకాఫ్‌కు రెడీ అయిన బ్రిటిష్ రాయల్ నేవీ జెట్!

**తిరువనంతపురం,జూలై 21:** కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ నెల 14 నుంచి చిక్కుకుపోయిన బ్రిటీష్ రాయల్ నేవీ ఎఫ్35బి స్టెల్త్ యుద్ధ విమానం హైడ్రాలిక్ సిస్టమ్ లోపాన్ని ఎట్టకేలకు సరిచేశారు. ఈ విమానం యూకేకు బయలుదేరడానికి ముందు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో రాయల్ నేవీకి చెందిన విమాన వాహక నౌక హెచ్‌ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ నుంచి విమానాన్ని డైవర్ట్ చేసి ఈ నెల 14న కేరళలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానం ఖరీదు దాదాపు 115 మిలియన్ డాలర్లు. హైడ్రాలిక్ వైఫల్యం కారణంగా గత నెల రోజులుగా ఇది తిరువనంతపురంలోనే హ్యాంగర్‌కు ఉండిపోయింది. ఈ నెల 6న బ్రిటీష్ రాయల్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఎ400ఎం అట్లాస్‌లో వచ్చిన 25 మంది బ్రిటిష్ ఇంజనీర్ల బృందం ఎయిర్ ఇండియా మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) హ్యాంగర్‌లో ఈ విమానానికి మరమ్మతులు ప్రారంభించింది. ఈ ఉదయం ఎఫ్35బి విమానాన్ని హ్యాంగర్ నుంచి బయటకు తీసుకొచ్చారు, మరమ్మతులు విజయవంతం కావడంతో యూకేకు తిరిగి వెళ్లేముందు నేడు కానీ, రేపు కానీ ట్రయల్ ఫ్లైట్ నిర్వహించేందుకుసన్నాహాలు జరుగుతున్నాయి.

## ముంబయి రైళ్లలో పేలుడు కేసులో సంచలన తీర్పు
### ప్రాసిక్యూషన్ విఫలం అయిందని బాంబే హైకోర్టు వెల్లడి

**ముంబయి,జూలై 21:** రెండుదశాబ్దాలనాటి ముంబయి రైళ్లలో పేలుళ్ల కేసులో 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2006లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి దోషులని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైందని జస్టిస్ అనిల్ కిలోర్ జస్టిస్ శ్యామ్ చందక్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నిందితులు నేరం చేశారని నమ్మడం కష్టమని వివరించింది. అందువల్ల దిగువ కోర్టు విధించిన శిక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన బాంబే హైకోర్టు, వారిని నిర్దోషులుగా విడుదల చేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పుతర్వాత వివిధజైళ్లనుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా కోర్టుముందుహాజరైన దోషులు తమ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనపై సుదీర్ఘ దర్యాప్తు అనంతరం 2015 అక్టోబరులో ప్రత్యేక కోర్టు 12 మందిని దోషులుగా నిర్ధారించింది.

వారిలో బాంబు అమర్చారన్న అభియోగాలపై ఐదుగురికి మరణ శిక్ష విధించింది. మిగతా ఏడుగురికి జీవితఖైదు విధిస్తూ తీర్పు అప్పట్లో వెలువరించింది. అందులో దోషుల్లో ఒకడైన కమల్ అన్సారీ అనే వ్యక్తి 2021లో కొవిడ్ కారణంగా నాగ్‌పుర్ జైల్లో మృతి చెందాడు. అయితే ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై దోషులు హైకోర్టును ఆశ్రయించారు. వాటిని సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

## కేవలం రూ. 100కే ఇల్లు..! ఎక్కడో తెలుసా?



**ప్యారిస్, జూలై 21:** ఎప్పటికైనా సొంతిల్లు కొనుగోలు చేయాలనే ఆశ అందరికీ ఉంటుంది. తాము కలలు కనే నివాసం తక్కువ ధరకే.. విదేశాల్లో సొంతమయితే! ఇంకేముంది ఎగిరి గంతేస్తారు. ఇలా సొంతింటి కోసం కలలు కంటున్న ప్రజల కోసం ఫ్రాన్స్ ఓ సూపర్ ఆఫర్‌ను మన ముందుకు తీసుకువచ్చింది. ఆ దేశంలోని అంబర్ట్ అనే పట్టణంలో కేవలం ఒక్క యూరో (రూ. 100) చెల్లించి.. ఇల్లు కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించింది. ఫ్రాన్స్‌లో పుయ్-డి-డోమ్ ప్రాంతంలో ఉన్న ప్రశాంతమైన పట్టణం అంబర్ట్‌లో రోజురోజుకు తగ్గిపోతున్న జనాభాను పునరుద్ధరించేందుకు ఈ వినూత్న ప్రయత్నం చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మెరుగైన మౌలిక సదుపాయాల కోసం ప్రజలు నగరాల వైపు తరలివెళ్లడంతో 19వ శతాబ్దం నుంచి ఈ ప్రాంతంలో జనాభా తగ్గుతూ వస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ పట్టణంలో 6,500 మంది నివసిస్తున్నారు. జనాభాను మరింత పెంచడానికి అక్కడి అధికారులు ఐదేళ్ల ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగానే ప్రజలకు రూ. 100కే ఇల్లు కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నారు. జనాభాను పునరుద్ధరించడం, స్థానిక పాఠశాలలు, వ్యాపారాలు వంటి వాటిని అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాలతో ఈ ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇళ్లకొనుగోలుకు కేవలం వందరూపాయలు మాత్రమే అవుతున్నప్ప టికీ.. శతాబ్దాలనాటి అక్కడి భవనాలను పునరుద్ధరించడానికి దాదాపు రూ. 20నుంచి రూ. 50 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంటిని కొనుగోలుచేసే సమయంలోనే కొనుగోలు దారులు ఆ ఇంటి పునరుద్ధరణకు కట్టుబడి ఉంటామని తెలియ జేస్తూ.. హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ఫ్రాన్స్ ప్రజలతోపాటు, విదేశీయులు కూడా అంబర్ట్‌లో ఇళ్లను కొనుగోలు చేయవచ్చు. భవనాల పునరుద్ధరణకు డబ్బు కావాలనుకుంటే అక్కడి ప్రభుత్వం తక్కువ వడ్డీకి రుణాలు, పునరు ద్ధరణ గ్రాంట్లు వంటి రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది. అయితే ఇంటిని కొన్నాక కనీసం మూడేళ్లపాటు అక్కడే నివసించాల్సి ఉంటుంది. ఫ్రెంచ్‌భాష తెలిసిఉండడం తప్పనిసరి కానప్పటికీ అక్కడిస్థానికులు, వ్యాపారు లతో కమ్యూనికేట్ చేయగలిగితే బాగుంటుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## అమెరికాలో గ్రీన్‌కార్డుకు రెడ్ సిగ్నల్..





**వాషింగ్టన్, జూలై 21:** అమెరికాలో ట్రంప్ సర్కారు వచ్చిన తర్వాత గ్రీన్‌కార్డులు, వీసాల జారీ, వలసపోవడం కష్టతరంగా మారాయి. అయితే.. వీటిల్లో వీసాలు, గ్రీన్‌కార్డుల జారీలో జాప్యం వల్ల ఇప్పుడు ఆ దేశ కార్పొరేట్ రంగంపై దుష్ప్రభావం చూపడం మొదలుపెట్టింది. వివిధ రంగాల్లోని కార్పొరేట్ లీడర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల వర్క్ పర్మిట్లు ముగియడం.. వాటి పునరుద్ధరణ వెంటనే జరగకపోవడంతో వారు పదవుల నుంచి వైదొలగాల్సి వస్తోంది. ముఖ్యంగా శాశ్వత నివాసం కల్పించే గ్రీన్‌కార్డుల జారీలో జాప్యం వల్ల .. సక్రమమార్గంలో దేశంలోకి వచ్చి కొన్నేళ్లుగా వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న వారు కూడా వెళ్లిపోయేటట్లు చేస్తోంది. అమెరికాలోనే అతిపెద్దదైన మెట్రోపాలిటన్ ర్యాపిడ్ ట్రాన్సిట్ అథారిటీ (మార్టా) సిఇఒ కొల్లిన్ గ్రీన్‌వుడ్ జూలై 17న పదవి నుంచి వైదొలిగారు. ఆయనకు వర్క్‌పర్మిట్ కాలవ్యవధి ముగిసిపోవడం.. గ్రీన్‌కార్డ్ జారీలో జాప్యంతో ఆయన తన పదవిలో కొనసాగడం అసాధ్యంగా మారింది. దీంతో ముందస్తు రిటైర్‌మెంట్‌ను ఆయన ఎంచుకొన్నారు. ఆయన స్వస్థలం కెనడా. తమ సిఇఒకు గ్రీన్‌కార్డ్ త్వరలోనే వస్తుందని మార్టా చెప్పినా.. పదవిని వీడేందుకే గ్రీన్‌వుడ్ మొగ్గ చూపారు.

**భారతీయులకు గ్రీన్‌కార్డుల్లో భారీ జాప్యం..**

అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొన్న భారతీయులు.. ప్రాసెసింగ్‌లో తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఇమిగ్రేషన్ బ్యాక్‌లాగ్‌లో 1.13 కోట్ల దరఖాస్తులున్నాయి. ఈ స్థాయిలో పెండింగ్‌లో ఉండటం ఓ రికార్డ్. ఇక ఈ యేడాది రెండో త్రైమాసికంలో మరో 16 లక్షల కొత్త దరఖాస్తులు వచ్చి చేరనున్నాయి. ఇటీవల యుఎస్ సిఐఎస్ ప్రచురించిన డేటాషీట్‌లో ఈ వివరాలున్నాయి. ఇక రెండో త్రైమాసికంలో ప్రాసెస్ చేసిన దరఖాస్తుల సంఖ్య కూడా తగ్గింది. గతేడాది 3.3 మిలియన్లు చేయగా.. ఈసారి 2.7 మిలియన్లకే పరిమితమైంది. ఇక గ్రీన్‌కార్డ్ దరఖాస్తుదారులు వాడే ఫారమ్ ఐ-90 సగటు వెయిటింగ్ టైమ్ 0.8 నెలల నుంచి 8 నెలలకు చేరింది. ఫారమ్ ఐ-765ల్లో దాదాపు 2 మిలియన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

## 'ఒబామా అరెస్టు'! ఎఐ విడియో పోస్టు చేసిన ట్రంప్



**వాషింగ్టన్, జూలై 21:** డెమోక్రాట్లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు సంబంధించి ఓ విడియో పోస్ట్ చేశారు. ఓవల్ ఆఫీసులో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) అధికారులు ఒబామాను అరెస్టు చేస్తున్నట్లుగా ఎఐ సాయంతో రూపొందించిన విడియో అది. 'చట్టానికి ఎవరూ అతీతులు కారు' అనే మెసేజ్ ఇస్తూ మాజీ అధ్యక్షుడిపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఆ విడియోలో తొలుత ఒబామా మాట్లాడుతూ.. 'చట్టానికి అధ్యక్షుడు అతీతుడే' అని అన్నట్లుగా ఉంది. ఆ వెంటనే పలువురు రాజకీయ నాయకులు 'చట్టం కంటే ఎవరూ ఎక్కువ కాదు' అని మాట్లాడినట్లు ఉంది. చివరకు ఓవల్ ఆఫీసులో ట్రంప్, ఒబామా మాట్లాడుకుంటుండగా ఎఫ్‌బిఐ అధికారులు అక్కడికి వచ్చి మాజీ అధ్యక్షుడి చేతికి సంకెళ్లు వేసినట్లుగా ఈ విడియోను రూపొందించారు. ఆ సమయంలో ట్రంప్ నవ్వుతూ కన్పించడం గమనార్హం. తర్వాత ఒబామా ఖైదీ దుస్తుల్లో జైల్లో కూర్చుని ఉన్నట్లు చూపించడంతో విడియో ముగుస్తుంది. ఈ విడియోను ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేయగా..ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్‌గా మారింది. అధ్యక్ష ఎన్నికల్లో ఒబామా భారీఎత్తున మోసాలకు పాల్పడ్డారంటూ ట్రంప్ ఇటీవల ఆరోపించిన సంగతి తెలి సిందే. దాన్ని ఉద్దేశిస్తూనే అధ్యక్షుడు తాజావిడియో పోస్టు చేసినట్లు తెలు స్తోంది. గత వారం యుఎస్ నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ సంచలన ఆరోపణలు చేశారు. 2016 ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆతర్వాత ఆయనపాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని ఆమెఅన్నారు. ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ తప్పుడు వాదన తెచ్చారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి తన వద్ద బలమైన సాక్ష్యాలున్నాయని పేర్కొన్నారు. ఒబామా హయాంలో పనిచేసిన వారందరినీ విచారించాలని తులసీ గబ్బార్డ్ పిలుపునిచ్చారు.

## సంక్షిప్తంగా..

### నన్ను మాట్లాడనీయడంలేదు: రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ,జూలై 21:** కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నేతనైన తనకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. సభలో అధికార పక్ష సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంలోని మంత్రులకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చి... తనకు మాత్రం తమ అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతగా మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వకపోవడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమేనని రాహుల్ అన్నారు. లోక్ సభలో చర్చ ప్రారంభమైన వెంటనే ప్రధాని మోడీ వెళ్లిపోయారని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అన్ని విషయల్లో వారికి అనుకూలమైన కొత్త విధానాలను సృష్టించుకుంటోందని విమర్శించారు.

### అమర్‌నాథ్ యాత్రకు పెరుగుతున్న భక్తులు

**శ్రీనగర్,జూలై 21:** అమర్‌నాథ్ యాత్రకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఈ నెల 3న యాత్ర ప్రారంభం కాగా 18 రోజుల్లో మూడు లక్షలకు పైగా మంది భక్తులు హిమాలయాల్లోని మంచు శివలింగాన్ని దర్శించుకున్నారు. ఆదివారం నాటికి 3.07 లక్షల మంది యాత్రికులు పవిత్ర దర్శనం చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఆగస్టు 9న యాత్ర ముగియనుంది. ఇంకా 20 రోజులు మిగిలి ఉన్నందున ఈ ఏడాది 3.50 లక్షలకు పైగా మంది భక్తులు దర్శనం చేసుకునే అవకాశం ఉందని అధికారిక అంచనా. సోమవారం భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి రెండు ఎస్కార్ట్ కాన్వాయ్‌లలో 3,791 మంది యాత్రికులు లోయకు బయలుదేరారు. 1,208 మంది యాత్రికులతో బాల్టాల్ బేస్ క్యాంప్‌కు 52 వాహనాలతో కూడిన మొదటి ఎస్కార్ట్ కాన్వాయ్ తెల్లవారుజామున 3.33 గంటలకు బయలుదేరగా, 2,583 మంది యాత్రికులతో పహల్గామ్ బేస్ క్యాంప్‌కు 96 వాహనాలతో కూడిన రెండవ ఎస్కార్ట్ కాన్వాయ్ తెల్లవారుజామున 4.06 గంటలకు బయలుదేరిందని అధికారులు తెలిపారు.

### డెల్టా ఎయిర్ విమానాన్ని ఢీకొట్టబోయిన యుద్ధ విమానం

**ప్యారిస్,జూలై 21:** ఆకాశంలో పెను ప్రమాదం తప్పింది. ఒక ప్రయాణికుల విమానం.. యుద్ధ విమానాన్ని ఢీకొట్టే ఘటన త్రుటిలో తప్పింది. గత వారం జరిగిన ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పారిస్ నుంచి సిన్సినాటి నార్తర్న్ కెంటకీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న డెల్టా ఎయిర్ లైన్స్ విమానానికి అమెరికాకు చెందిన యుద్ధ విమానం బీ52 బాంబర్ అతి సమీపానికి వచ్చింది. అప్రమత్తమైన డెల్టా విమాన పైలట్ ఫ్లైట్‌ను వెంటనే కొన్ని అడుగుల కిందికి దించడంతో ప్రమాదం తప్పింది. యుద్ధ విమానం సమీపంలోకి వచ్చిన విషయాన్ని 'ఎవరూ మాకు చెప్పలేదు' అని పైలట్ చెప్పడం గమనార్హం. రాడార్ కంట్రోల్‌లో కమ్యూనికేషన్ లోపం కారణంగానే ఇది జరిగినట్టు తెలుస్తోంది. ఈ నెల 10న ఒక బీ52 హెచ్ స్ట్రాటోఫోర్ట్రస్ బాంబర్ సమీపంలోకి వచ్చి డెల్టా విమానాన్ని ఢీకొన్నంత పనిచేసింది. అప్పుడు డెల్టా విమానం 30 వేల అడుగుల ఎత్తులో ఎగురుతోంది. బీ52 విమానం సమీపంలో ఉందని గుర్తించిన పైలట్ వెంటనే అప్రమత్తమై అగ్రెసివ్ మాన్యువర్ చేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

### బోర్డును తప్పుగా ప్రదర్శించిన కండక్టర్ సస్పెన్షన్

**తిరువణ్ణామలై,జూలై 21:** తిరువణ్ణామలై వెళ్లే బస్సులో తిరువణ్ణామలైకి బదులుగా అరుణాచలం అని బోర్డు ప్రదర్శించినందుకు తమిళనాడు ఆర్టీసీ యాజమాన్యం ఒక కండక్టర్‌ను సస్పెండ్ చేసింది. ఈ సంఘటన ఈ నెల 15వ తేదీన చోటు చేసుకుంది. కళ్లకురిచ్చి ప్రభుత్వ రవాణా సంస్థ డిపో నుంచి ఒక బస్సు బెంగళూరుకు బయలుదేరింది. ఈ బస్సు ముందుభాగంలో ఎల్‌ఈడీ తెరపై తిరువణ్ణామలైకు బదులుగా అరుణాచలం అని ఆంగ్ల అక్షరాలలో ప్రదర్శించారు. దీనిని గమనించిన కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఒక సామాజిక కార్యకర్త ఈ విషయంపై ప్రభుత్వ రవాణా సంస్థను ప్రశ్నించారు.

### సాంబార్‌లో విషం కలిపి భర్తను హత్యచేసిన భార్య

**చెన్నై,జూలై 21:** దేశ వ్యాప్తంగా భర్తలను హతమారుస్తున్న భార్యల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతుంది. ఈ మధ్య కాలంలో ఈ ఘటనలు మరింత ఎక్కువయ్యాయి. తాజాగా తమిళనాడులో ఇదే కోవకు చెందిన ఘటన మరొకటి చోటుచేసుకుంది. తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ భార్య తన భర్తను సాంబారులో విషం కలిపి హతమార్చింది.

22-7Pg6exHMNWJQE.qxd:22-7Pg6exHMNWJQE.qxd 01/01/01 9:15 AM Page 1



# గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో నాబార్డ్ ప్రధాన పాత్ర

## - రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు



నాబార్డు,సహకార వ్యవస్థ మాన్యుల్‌ను ఆవిష్కరిస్తున్నరిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీలు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు

**విజయవాడ.జూలై 21,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో నాబార్డ్ ప్రధాన పాత్ర పోషిస్తుందని కమిషనర్ ఆఫ్ కోఆపరేషన్ , రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీలు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ తెలిపారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నాబార్డ్ 44 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కమిషనర్ ఆఫ్ కోఆపరేషన్ మరియు రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీలు మరియు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు ఏ మాట్లాడుతూ గ్రామీణ భారత దేశ అభివృద్ధిలో ప్రతి దశలోను నాబార్డు సహకారం ఉందని తెలిపారు. సహకార రంగాన్ని ఆధునీకరించడంలో మరియు డిజిటలైజేషన్‌లో చేసిన సహకారాన్ని కొనియాడారు. 26 జిల్లాలన్నింట్లో సహకార సంస్థల బలోపేతం కోసం మరింత సమన్వయం అవసరమని ఆయన అన్నారు. దేశంలోను, రాష్ట్రంలోను ప్రతి రంగంలోను అభివృద్ధికి నాబార్డు సహకారం తప్పనిసరిగా ఉంటుందన్నారు. అమరావతి రాజధానిలో నాబార్డు కేంద్ర కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిందన్నారు. దేశ జీడీపీ కి వ్యవసాయ రంగం నుంచి ఎక్కువ మొత్తంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వస్తుందన్నారు. నా కెరీర్ మొదట్లో నేను నాబార్డు లో మేనేజర్ గా భోపాల్ లో జాయిన్ అయ్యానన్నారు. తదనంతరం సివిల్ సర్వీస్ కు రావడం జరిగిందన్నారు. గ్రామీణ భారతావని నిర్మాణానికి నాబార్డు ఎన్నో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కంప్యూటరీకరిణతో ముందుకు వెళ్లడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో ఈఆడిటింగ్ చేసే దిశగా వెళ్లే అవకాశాలున్నాయన్నారు. నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయ ప్రధాన మేనేజర్ ఎం.ఆర్. గోపాల్ మాట్లాడుతూ 1982 లో పార్లమెంట్ యాక్ట్ ద్వారా నాబార్డు ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నాబార్డ్ సాధించిన అభివృద్ధిని విజయాలను వివరించారు. ఆర్థిక సంవత్సరంలో మొత్తం .. 42,842 కోట్ల రుణాలను మంజూరు చేసిందన్నారు. నాబార్డ్ రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాలు, సంస్థల అభివృద్ధికి మద్దతు ఇచ్చిందన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నంద్యాల జిల్లాల్లో కొత్త డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ కార్యాలయాలు ప్రారంభించిందన్నారు.

# రామకృష్ణ నాట్యమండలి స్వర్ణోత్సవ వేడుకలు కళారంగానికి స్ఫూర్తిదాయకం

## - ఐదుగురు ప్రముఖులకు విశిష్ట కళా సేవక్ పురస్కారాలు

**విజయవాడ జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక పౌరాణిక నాటక సంస్థ 50 వసంతాలు పూర్తి చేసుకోవడం అపూర్వమైనటువంటి విషయమని మచిలీపట్నం పురపాలక సంస్థ చైర్మన్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. రామకృష్ణ నాట్యమండలి స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.మండలి 50 వసంతాల వేడుక సందర్భంగా ఐదుగురికి "విశిష్ట కళా సేవక్ పురస్కారాలను" బహుకరించి సత్కరించారు.

వ్యక్తిత్వ వికాస నిపుణులు

డాక్టర్ విడియాల చక్రవర్తి కి (జంధ్యాల రాధాకృష్ణ స్మారక పురస్కారం ),

ప్రముఖ హార్మోనిస్టు కె. పరబ్రహ్మాచారికి( గుత్తి కొండ కోటేశ్వరరావు స్మారక పురస్కారం), విష్ణుభట్ల సూర్యనారా యణ శర్మ ఘనాపాటికి (ఆధ్యాత్మిక వేత్త జొన్నలగడ్డ సుబ్రహ్మణ్య శాస్త్రి స్మారక పురస్కారం)

ప్రముఖ గాయని వై. రాధికా సుబ్రహ్మణ్యం కు (అయినంపూడి వెంకటేశ్వరరావు స్మారక పురస్కారం )ప్రముఖ రంగస్థలం నటులు పుప్పాల వీరాంజనేయులు కు ( డి.వి. సుబ్బారావు స్మారక పురస్కారం) బహుకరించి సత్కరించారు.

జ్యోతి ప్రజ్వలనతో ఈ వేడుకలను మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్టణం కవులు,కళాకారులకు పుట్టినిల్లుఅన్నారు. 50 వసంతాలుగా మన సంస్కృతిని పరిరక్షిస్తున్న గొప్ప కళాకారుడు సమస్త నిర్వాహకులు జగన్మోహన్రావు అని ఆయన వ్యాఖ్యానించారు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ సాంస్కృతిక వికాసంతోసమాజ వికాసం కలిగిస్తుందని అన్నారు మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు మాట్లాడుతూ మానసిక ఆనందంతోపాటు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తూ సామాజిక చైతన్య స్ఫూర్తిని రగిలించినటువంటి రామకృష్ణ నాట్యమండలి కార్యక్రమాలు చాలా అద్భుతంగా ఉన్నాయని కొనియాడుతూ జగన్మోహన్ రావు గారికి శతదా సర్వదా కృతజ్ఞతలు తెలిపారు ప్రముఖ న్యాయవాది సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షులు , ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో రామకృష్ణ నాట్యమండలి చేసిన కార్యక్రమాలు అభినందనీయమని మచిలీపట్నంలో పుట్టిన సంస్థ విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొంగటం అభినందనీయమని అన్నారు

ప్రముఖ వైద్యులు డాక్టర్ ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ కళలు ఆరోగ్యంతో పాటు సామాజిక చైతన్యాన్ని కలిగిస్తాయన్నారు నాట్యమండలి నిర్వాహకులు జొన్నలగడ్డ జగన్మోహన్రావు మాట్లాడుతూ నా ఊపిరి ఉన్నంతవరకు పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూనే ఉంటానని ,నిర్వహిస్తూనే ఉంటానని నేనే కాదు నా కుటుంబం మొత్తం కళా సేవకే అంకితమైందని చెప్పారు.

# సిఎం పాలనానుభవంతో రాష్ట్రాభివృద్ధి

## - యేడాది కాలంలో చేపట్టిన సంక్షేమాన్ని వివరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు

## - రూ.6కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించిన నేతలు



**కావలి (నెల్లూరు), జూలై 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనానుభవంతోనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యుల వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారని వివరించారు. సోమవారం కావలి నియోజకవర్గంలోని కావలి మండలం, చలంచర్ల పంచాయతీలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా చలంచర్ల పంచాయతీలో రూ.6కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ తల్లికి వందనం, పింఛన్లు వంటి పథకాల అమలుపై ప్రజలను అడిగి వారి అభిప్రాయాలు సేకరించారు. సీఎం చంద్రబాబు పాలన బాగుందా అని తెలుసుకున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి.. వారి సమాధానాలపై హర్షం వ్యక్తం చేశారు. ఇంకా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయని ఆరా తీశారు. ఇంటింటికి తెలుగుదేశం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలను ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ ఏడాది కాలంలో20 సార్లు ఢిల్లీ వచ్చిన సీఎం.. ఒక్క క్షణం కూడా తీరక లేకుండా పని చేస్తున్నారని వివరించారు. నిత్యం కేంద్ర మంత్రులను కలుస్తూ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులను సాధిస్తుంటారని పేర్కొన్నారు. ఇంతలా కష్టపడి పని చేసే సీఎం పాలనలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. కావలి అభివృద్ధికి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఎంతో కష్టపడుతున్నారని, ఈ రోజు దాదాపు 6 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కావలి నియోజకవర్గం తన సొంత ప్రాంతమని, ఈ ప్రాంత అభివృద్ధికి తప్పకుండా కట్టుబడి ఉన్నామన్నారు. బీపీసీఎల్, దగదర్తి ఎయిర్‌ఫోర్ట్ వంటి ప్రాజెక్టులతో కావలిలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ప్రజలకు పేరు పెట్టి పిలవడం అమితానందాన్ని ఇస్తోందన్నారు. 2018లో చలంచర్ల గ్రామంలో వీపీఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ పెట్టామని, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా పని చేస్తోందన్నారు. గ్రామంలో ప్రజల ఆప్యాయతానురాగాలు మర్చిపోలేమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 200 వాటర్ ప్లాంట్లను స్థాపించామని పేర్కొన్నారు. కావలి అభివృద్ధి గురించి ఎమ్మెల్యే కృష్ణారెడ్డితో చర్చించానని, ఖచ్చితంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుతామన్నారు.

# లైంగిక దాడికేసులో ఒడిశా ఎన్‌ఎస్‌యుఐ చీఫ్ అరెస్ట్

**భువనేశ్వర్, జూలై 21:** విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో కాంగ్రెస్ పార్టీ ఒడిశా యూనిట్ విద్యార్థి నాయకుడు ఉదిత్ ప్రధాన్‌ను భువనేశ్వర్‌లోని మంచేశ్వర్ పోలీసులు అరెస్ట్ చేశారు. 19 ఏళ్ల విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం మార్చి 18న ఈ ఘటన జరగ్గా, జులై 20న రాత్రి 8.30 గంటలకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు తన ఇద్దరు స్నేహితులతో కలిసి మాస్టర్ క్యాంటీన్ చౌక్‌లో ఉన్నప్పుడు ఉదిత్ ప్రధాన్‌ను కలిసింది. ఒక స్నేహితుడు ఆమెను ఉదిత్‌కు పరిచయం చేశాడు. అతడు తనను తాను నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ) ఒడిశా అధ్యక్షుడిగా పరిచయం చేసుకున్నాడు. తర్వాత వారు ఉదిత్ వాహనంలో నయాపల్లిలోని ఒక హోటల్‌కు వెళ్లారు. అక్కడ వారు మద్యం తాగారు. బాధితురాలు మద్యం తాగేందుకు నిరాకరించింది. దీంతో ఉదిత్ ఆమెకు కూల్‌డ్రింక్ ఇచ్చాడు. అది తాగిన కాసేపటికి బాధితురాలికి మైకం కమ్మినట్టు అనిపించడంతో ఇంటికి తీసుకెళ్లమని కోరింది. అయితే, ఉదిత్, అతడి స్నేహితులు ఆమె అభ్యర్థనను తిరస్కరించారు. ఆ తర్వాత కాసేపటికే ఆమె స్పృహ కోల్పోయింది. స్పృహ వచ్చాక తనపై లైంగికదాడి జరిగినట్టు గుర్తించింది. దీంతో ఉదిత్‌ను ఆమె ప్రశ్నించగా, ఈ విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. బాధితురాలు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది.

# అచ్యుతానందన్ మరణం తీరనిలోటు

## పిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** కేరళ మాజీ ముఖ్యమంత్రి కమ్యూనిస్టు యోధుడు వి.ఎస్ అచ్యుతనందన్ మరణం పట్ల టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న శతాధిక కమ్యూనిస్టు నేత అచ్యుతనంద్ మరణం రాజకీయాలకు తీరని లోటు అని ఆయన అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన బంధువులకు ఆయన లేని లోటు పూడ్చుకొనేందుకు సర్వశక్తివంతుడైన దైవం వారికి మనోధైర్యం నింపాలని మహేష్ కుమార్ గౌడ్ కోరుకున్నారు.

# ఎపిలో స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కింద కొత్తగా 953 పాఠశాలలు



## : కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి

**విజయవాడ,జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎమ్ఎస్‌హెచ్‌ఆర్ఐ) పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పాఠశాలలు చేర్చే అవకాశముందని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 953 పాఠశాలలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఆ జాబితాలో ఎన్టీఆర్ జిల్లాలో 29 పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. అందుకోసం రూ. 1620.6 లక్షలు వినియోగిస్తామన్నారు. ఛాలెంజింగ్ మెథడ్‌లో భాగంగా ఏడు దశల్లో 935 పాఠశాలలు ఎంపిక చేసినట్లు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. రాష్ట్రంలో పీఎమ్ఎస్ఆర్ఐ పథకం కింద జిల్లాల వారీగా అభివృద్ధి కోసం ఎంపిక చేసిన పాఠశాలల సంఖ్య, నిర్మించాల్సిన సదుపాయాలు, నిధుల కేటాయింపుతోపాటు ఈ పథకంలో మరిన్ని పాఠశాలలు చేర్చే అవకాశం ఉందా? అనే అంశాలు తెలియజేయాలంటూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి రాత పూర్వకంగా సమాధానమిచ్చారు.రాష్ట్రంలో ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద అత్యధికంగా కర్నూలు జిల్లాలో 54 పాఠశాలలు, విశాఖపట్నంలో కేవలం 6 పాఠశాలలు మాత్రమే ఎంపికైనట్లు ఆయన గణాంకాలతో సహా సోదాహరణగా వివరించారు. ఇక ఎన్టీఆర్ జిల్లాలో ఈ పథకం కింద 29 పాఠశాలలు ఎంపిక కాగా.. ఈ పాఠశాలల కోసం రూ.3,404.1 లక్షలు నిధుల కేటాయించామని చెప్పారు. అందులోభాగంగా రూ.1628.2 లక్షలు నిధులు విడుదల చేసి.. రూ.1620.6 లక్షలు వినియోగించినట్లు తెలిపారు. ఈ పాఠశాలల అభివృద్ధిలో ప్రధానంగా సైన్స్ ల్యాబ్స్, స్మార్ట్ తరగతులు, డిజిటల్ బోర్డులు, లినిదీ లైటింగ్, గ్రంథాలయాలు, ఆటల మైదానాలతోపాటు "గ్రీన్ స్కూల్స్ లక్ష్యంగా ఉన్నాయని విద్యా శాఖ సహాయ మంత్రి తెలిపారు. అలాగే జాతీయ విద్యా విధానం - 2020లో పేర్కొన్న అన్ని అంశాలను ఆచరణలో పెట్టే విధంగా ఈ పాఠశాలలు తీర్చిదిద్దబడుతున్నాయని పేర్కొంది. పారదర్శక పోటీ పద్ధతిలో ఎంపిక చేసిన ఈ పాఠశాలల్లో విద్యార్థులకు సమాన అవకాశాలు, ఆధునిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ పాఠశాలలు.. విద్యార్థులకు కేవలం పాఠాలు బోధించడం మాత్రమే కాకుండా సమగ్ర వ్యక్తిత్వ అభివృద్ధితో పాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తాయని స్పష్టం చేశారు. ఈ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూములు, సైన్స్ ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు, ఎల్.ఈ.డి లైటింగ్, ఔషధ తోటలు, గ్రీన్ కంపోస్టింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఆధునిక విద్యను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. పారదర్శక పోటీ పద్ధతిలోపాఠశాలల ఎంపిక జరిగినట్లు తెలిపారు.

# దుర్గమ్మకు మంగళసూత్రాలు కానుక

## - జగన్మాతకు వేడుకగా ఆషాఢం సారె సమర్పణ



బంగారు మంగళసూత్రాలు



ఆషాడం సారె తెస్తున్న భక్తబృందాలు

**ఇంద్రకీలాద్రి, జూలై 21, ప్రభాతవార్త** దుర్గమ్మవారికి విజయవాడకు చెందిన జంధ్యాల కుమారస్వామి తమ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం రు.5లక్షలు విలువైన 61 గ్రాముల బంగారు మంగళసూత్రాలు, బంగారు చైనులను కానుకగా అందించారు. దాతకు వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. - దుర్గమ్మవారికి సెక్యూరిటీ విభాగం ఆషాడం సారె: దుర్గమ్మవారికి ఆలయంలో సెక్యూరిటీ విభాగంలో సేవలందిస్తున్న ఏజిఎల్ఐఇ సెక్యూరిటీ సర్వీసెస్ వారు సోమవారం ఆషాడం సారెను అందించారు. ముందూ జమ్మిదొడ్డిలోని శ్రీ అమ్మవారికి ఇఒ వికె శీనా నాయక్ కొబ్బరికాయకొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాడం సారెను తీసుకుని శ్రీ అమ్మవారి ఆలయానికి రాగా అక్కడ మేళతాళాలు, మంగళవాయిద్యాలతో మంత్రపఠనాల నడుమ స్వాగతం పలికి ఆషాడం సారెను శ్రీ అమ్మవారికి నివేదించారు. - జగన్మాతకు భక్తుల జయనాదాలతో ఆషాడం సారె: జగన్మాత దుర్గమ్మ వారికి సోమవారం భక్తబృందాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆషాడం సారెను సమర్పించారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన బృందాలు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు. ఆషాడం సారె సమర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనంఏర్పాటు చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు.

# పిఆర్సి కమిటీని వెంటనే నియమించండి, చీఫ్ సెక్రటరీ ను కలిసిన ఎన్జీవో నాయకులు..

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేత

**విజయవాడ.జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** పిఆర్సి కమిటీని వెంటనే నియమించాలని పెండింగ్ డిఏలు మంజూరు చేయాలి,ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని ఎన్జీజివో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు.ఎపి జేఏసి చైర్మన్ ఎ . విద్యాసాగర్ డిమాండ్ చేసారు. వెలగపూడి సచివాలయంలో నూతన ఎన్జీజివో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు.ఎపి జేఏసి చైర్మన్ ఎ . విద్యాసాగర్ సెక్రెటరీ జనరల్ కే ఎస్ ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాల నేతలు సోమవారం వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఉద్యోగులకు సంబంధించిన పి ఆర్ సి కమిటీని వెంటనే నియమించాలని, రెండు సంవత్సరాలకు పైగా కాలాతీతం అయినందున వేతన సవరణ కమిషను వెంటనే నియమించి వేతన సవరణ ప్రక్రియని ప్రారంభించాలని కోరారు. ఉద్యోగులకు సంబంధించి మూడు డి ఏ లు పెండింగ్ ఉన్నాయని కనీసం రెండు డి ఎ లు అయినా మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల సరెండర్ లీవ్ బకాయిలు తదితర వాటి మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులపై 2019 24 సంవత్సరాల మధ్య వివిధ ఆందోళనలో నమోదైన పెండింగ్ కేసులన్నీ ఎత్తివేయాలని, ఇంటీరియమ్ రిలీఫ్ చెల్లించాలని వినతి.

# 'సాహిత్య రంగంలోనే అభివృద్ధి నిరోధక, తిరోగామి శక్తులపై తీవ్ర పోరాటం అవసరం'

**విజయవాడ,జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** సాహిత్య రంగంలోనే అభివృద్ధి నిరోధక, తిరోగామి శక్తులపై తీవ్ర పోరాటం జరుగుతోందని తెలకపల్లి రవి రచనల్ని ఆవిష్కరణ సభలో పాల్గొన్న పలువురు వక్తలు అన్నారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ప్రజాశక్తి బుక్ హౌస్ సంపాదకులు ఎంవిఎస్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసంగించిన పలువురు ఆ మేరకు లెనిన్ చెప్పిన మాటలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం మన దేశంలో అదే పరిస్థితి కనపడుతోందని అన్నారు. దానిలో భాగంగానే తెలకపల్లి రవి సైతం తనకు ప్రావీణ్యమున్న సర్వప్రక్రియలను ప్రజా ఉద్యమాల కోసమే వినియోగించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలకపల్లి రవి రాసిన ఆశయపథం, అభద్ర, సజీవం, ప్రజాగానం, మీరే ప్రేరణ మీదే సాధనలతోపాటు "నేనెప్పుడూ కమ్యూనిజానికే సొంతం : ఆరుద్ర సంకలనాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి "ఆశయ పథం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సాధారణంగా పత్రికా సంపాదకులు ఏదో ఒక అంశంపై నైపుణ్యం కలిగి ఉంటారని, తెలకపల్లి అనేక అంశాల్లో ప్రావీణ్యం సంపాదించారని చెప్పారు. సంపాదకుడిగా, కవిగా, రచయితగా, విమర్శకుడిగా, రాజకీయ విశ్లేషకుడిగా అన్ని అంశాల్లో నైపుణ్యం సాధించిన రవి ఆ నైపుణ్యాలన్నింటినీ ప్రజా ఉద్యమాలకే వినియోగించారని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిజం, ఉద్యమాల గురించి ఎంతో మంది రాశారని, రవి రాస్తే అందులో ఎంతో ప్రత్యేకత ఉంటుందని అన్నారు. "ప్రజాగానం" పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్ మాట్లాడుతూ.. ప్రజాగానంలో పాటలు అందరికీ సుపరిచితమైనవని, వివిధ కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఈ పాటలు వినిపిస్తుంటాయని అన్నారు. సాహితీ, రచన, వ్యాసం,

ఉపన్యాసం రాజకీయం, అన్ని ప్రక్రియల్లో ప్రత్యేక నైపుణ్యం తెలకపల్లి రవికి ఉందని చెప్పారు. "అభద్ర" పుస్తకాన్ని ఆవిష్కరించిన నవ తెలంగాణ

సంపాదకులు కె.ఆనందాచారి మాట్లాడుతూ, నిత్య చెతన్య, చలన శీలి తెలకపల్లి రవి అని పేర్కొన్నారు. అభద్రలో కథలు చైతన్యంగా ఉంటాయన్నారు. ఒక మహిళ అంతరంగాన్ని అద్భుతంగా విష్కరించారని తెలిపారు.

# కల్తీ మద్యం తయారీ ముఠా గుట్టురట్టు

## ఆంధ్ర పోలీసుల సమాచారంతో తెలంగాణ ఎక్సైజ్ పోలీసులు దాడులు

## మేళ్లచెరువు, వేపల మాదారం, రామాపురంలో తయారుచేస్తున్న వైనం

## భారీఎత్తున లభ్యమైన కల్తీ మద్యం, స్పిరిట్ క్యాన్లు

## మద్యం దుకాణంలో పనిచేస్తున్న వారే సూత్రధారులు



**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), జూలై 21, ప్రభాతవార్త :** హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మేళ్లచెరువు మండలంలో కల్తీ మద్యం తయారు చేసే ముఠా గుట్టు రట్టయింది. ఆంధ్ర పోలీస్ సమాచారంతో తెలంగాణ ప్రాంతంలోని హుజూర్నగర్ ఎక్సైజ్ పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించి మూడు ప్రాంతాల్లో కల్తీ మద్యం తయారు చేసే ముఠాను పట్టుకున్నారు. కల్తీ మద్యం తయారు చేస్తున్న ప్రాంతంలో కనిపించిన స్పిరిట్ కల్తీ మద్యం సీసాలు 20 లీటర్ల క్యాన్లు కనిపించిన తీరు ఎక్సైజ్ పోలీసులను కంగు తినిపించింది. మేళ్లచెరువు మండల కేంద్రంలో, మండల పరిధిలోని వేపల మాదా రం, రామాపురం గ్రామం లో ఈ కల్తీ మద్యం దందా నిర్వహిస్తున్న తీరు చూసి పోలీసులే అవాక్కయ్యారు. ఈ మూడు ప్రాంతాల్లో వివిధ మద్యం దుకాణంలో పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులు కల్తీ మద్యాన్ని తయారు చేస్తూ రెడ్ హ్యాండెడ్ గా దొరికారు. వీరందరూ తయారు చేస్తున్న కల్తీ మద్యాన్ని ఆంధ్ర ప్రాంతానికి తరలించగా గుంటూరు జిల్లా రేపల్లెలో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. దీంతో తీగలాగితే డొంకంతా కలిగినట్టు దొరికిన వ్యక్తులు మేళ్లచెరువు మండలం నుంచి వచ్చినట్లు సమాచారం ఇవ్వగా, ఆ సమాచారాన్ని హుజూర్నగర్ ఎక్సైజ్ పోలీసులకు అందించారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు మేళ్లచెరువు, వేపల మాదారం, రామాపురం గ్రామంలో దాడులు చేసి కల్తీ మద్యం తయారు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామంలో శంకర్ అనే వ్యక్తి స్థానికంగా ఉన్న నూకల ప్రకాష్ వ్యక్తి యొక్క రైస్ మిల్ లో కల్తీ మద్యం తయారు చేస్తూ ఆంధ్ర ప్రాంతానికి సరఫరా చేస్తున్నట్లు తేలింది. రైస్ మిల్లులో భారీ ఎత్తున కల్తీ మద్యం లభ్యమయింది. కల్తీ మద్యం తో పాటు 40 కాటన్ల కల్తీ మద్యం సీసాలు, మద్యం తయారీకి ఉపయోగించే 830 లీటర్ల స్పిరిట్ కూడా లభ్యమైనట్టు తెలిసింది.

# వివేకా హత్య కేసులో సిబిఐ అభిప్రాయాన్ని కోరిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు పలు అంశాలపై సిబిఐ తన అభిప్రాయాలను తెలపాలని కోరింది. వివేకా హత్య కేసులో కడప ఎంపి వై.ఎస్ అవినాష్ రెడ్డి సహా పలువురు నిందితులకు తెలంగాణ హైకోర్టు బెయిల్ ఇవ్వడం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు తీర్పును వివేకా తనయ సునీత రెడ్డితో పాటు సిబిఐ సుప్రీం కోర్టులో సవాల్ చేయడం విదితమే. వివేకా హత్య కేసులో కీలక నిందితులకు తెలంగాణ హైకోర్టు బె యిల్ ఇవ్వడం సరికాదని సునీతా రెడ్డితో పాటు సిబిఐ వేరు వేరుగా పిటిషన్లు దాఖలు చేయగా ఇదే అంశమై సుప్రీం కోర్టులో సోమవారం ఉదయం విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనం సిబిఐ నుంచి కొన్ని అంశాలలో అభిప్రాయాలను కోరింది. వివేకా హత్య కేసులో ఇంకా వి చారణ అవసరం అని సిబిఐ భావిస్తోందా...? దీంతో పాటు కడప సెషన్స్ కోర్టులో ఏపి ప్రభుత్వం వేసిన క్లోజర్ రిపోర్టుపై మీ అభిప్రాయం ఏమిటి.

# రేవంత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు సంయమనంతో ఉండాలి



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి

## నేనే రాబోయే పదేళ్లు సిఎంనని రేవంత్ ఎందుకన్నారో రాజగోపాల్‌రెడ్డికి తెలియదు


### క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి సూచనలు

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** 'నేనే రాబోయే పదేళ్ల ముఖ్య మంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ఏ సందర్భంలో అన్నాడో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డికి తెలియద'ని కాంగ్రెస్ క్షమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి అన్నారు. సోమవారం విలేకరు లతో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, దానిని కాంగ్రెస్ శ్రేణులు తిప్పి కొట్టాలని సూచించారు. పదేళ్ల సిఎంగా ఉంటాననే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు సంయమనంతో ఉండాలని కోరారు. సిఎం రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అధిష్టానం చూసుకుంటుందని అన్నారు. పార్టీ విషయాలు బహిరంగంగా మాట్లాడొద్దు అని హితవు పలికారు. ముఖ్యమంత్రిగా మరో పదేళ్లు తానే ఉంటానని రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన రాజకీయ దుమారం రేపింది. ముఖ్యమంత్రి పదవి ఆశించే అనేక మంది కాంగ్రెస్ నాయకులకు ఆగ్రహం తెప్పించింది. ప్రతిపక్షంను కాదు స్వపక్ష నేతలను సవాల్ చేసేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని రాష్ట్రంలోని సీనియర్ నాయకులు వారి అంతరంగికుల వద్ద ఈ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మండిపోతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏలాంటి భేషజాలు లేకుండా బహిరంగానే సామా జిక మాధ్య మాల వేదికగా తీవ్రంగా స్పం దించారు. రేవంత్ ప్రక టన కాంగ్రెస్ విధా నాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను కాంగ్రెస్ కార్యకర్తలు సహించరని రాజగోపాల్ రెడ్డి ట్విట్టర్ వేదికగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతికి దారితీస్తున్నాయి. ఇప్పటికే కోమటిరెడ్డి వ్యాఖ్యలపై పలువురు నేతలు స్పందించి కౌంటర్ ఇవ్వగా, తాజాగా మల్లు రవి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తూ మాట్లాడినతీరు మరింత అగ్గికి ఆజ్యం పోసేలా తరయారైంది.

## రాజకీయ నాయకులు అసభ్యపదజాలం ఉపయోగించడం తగదు

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** పెద్దల సభలోని సభ్యుల ప్రవర్తన వారి విజ్ఞతకు వదిలేస్తున్నానన్నారు. శాసనమండలి సభ్యులు ఇలా మాట్లాడవచ్చా? ఇలా దాడులు చేయవచ్చా అనేది వారే ఆలోచన చేసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ అన్నారు. ఎమ్మెల్సీలు కవిత, తీన్మార్ మల్లన్న పరస్పర ఫిర్యాదులపై సోమవారం ఆయన స్పందించారు. సభలో జరిగే వ్యవహారాలపై తక్షణం చర్యలు ఉంటాయని కానీ బయట జరిగే అంశాలపై మన పరిధి మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఇలాంటి చర్యలతో వ్యక్తిగతంగా వారి గౌరవంతో పాటు పెద్దల సభ గౌరవం కూడా పోతుంద న్నారు రాజకీయ నాయకులు అసభ్య పదజాలం వీడనాడాలని గుత్తా సుఖేందర్ సూచించారు. మాట్లాడే భాషపై ఎవరైనా కూడా వ్యక్తిగతంగా ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఈ పద్ధతి రాష్ట్ర రాజకీయాలకు, ప్రజాప్రతి నిధులకు మంచిది కాదని మన భవిష్యత్ తరాలకు చెడుమాటలను నేర్పించే పరిస్థితి ఉండకూడదన్నారు. కొంత మంది మాట్లాడే అసభ్య మాటలకు పక్కనున్న కొంతమంది జిందాబాద్‌లు కొట్టవచ్చు కానీ ప్రజలు హర్షించ దన్నారు. ఈ విధానం మార్చుకోవాల్సిన అవసరం అన్నారు. తిడితేనే రాజకీయ నాయకులం అవుతామనే పద్ధతి మార్చుకోవాలన్నారు. రాజకీయాల్లో అనుభవం ఉండి మంత్రులుగా ఎదిగిన వారు కూడా ఇలాంటి అసభ్యపదజాలం వాడటం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రతిపక్ష నేతలతోపాటు అధికారపక్షం కూడా హుందాతనంతో వ్యవహరించాలని సూచించారు.




జిఒ నంబర్ 49ను వ్యతిరేకిస్తూ ఆదిలాబాద్‌లోని ఉట్నూరులో బంద్‌లో పాల్గొన్న ఆదివాసీ సంఘాల నేతలు

## ఆదిలాబాద్ బంద్ ప్రశాంతం

### జిఒ నంబర్ 49ను రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ అటవీ సంరక్షణ పేరిట కేంద్రం తీసుకువచ్చిన జిఒ 49ను వ్యతికేకిస్తూ ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు సోమవారం జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ సందర్భంగా ఆర్టీసీ బస్సుల రాక పోకలకు అంతరాయం కలిగింది. బంద్‌లో భాగంగా ఆదివాసీల హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) పలుచోట్ల శాంతియుతంగా ఆందోళనలు చేబట్టింది. బంద్ ప్రభావం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు ఉట్నూరులో ఎక్కువగా కనిపించింది. ఈ రెండు చోట్ల బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆదివాసీలు ఎక్కువగా వుండే ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యకలాపాలకు కూడా అంతరాయం ఏర్పడింది. మంచిర్యాల్, నిర్మల్‌లో బంద్ ప్రభావం పాక్షికంగా కనిపించింది. బంద్ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందుగానే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఆర్టీసీ బస్సులను డిపోల నుంచి బయటకు రాకుండా ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బంద్‌కు నాయకత్వం వహించిన ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ జిఒ నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల ఆది వాసీలు తమ జీవనాధారాన్ని కోల్పోతారని వారు తెలిపారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పేరిట తమ జీవితాలను నాశనం చేయవద్దని వారు కేంద్రాన్ని కో రారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తమ విషయంలో అన్యాయంగా ఆలోచిస్తే పోరాటం ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. కాగా బంద్ సందర్భంగా వ్యాపారాలు, విద్యా సంస్థలు, హోటళ్లు స్వచ్ఛందంగా మూతపడ్డాయి.

## ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలి

**గుంటూరు తూర్పు, జూలై 21 (ప్రభాతవార్త) :** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీనగర్, పిఎస్.నగర్, బొంగరాలబీడు తదితర ప్రాంతాల్లో పర్యటించి వర్షప్రభావం వలన ప్రజలకు ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడా నీరు నిల్వకుండా లోతట్టు ప్రాంతాల్లో నిలిస్తే బెయిల్ అవుట్ చేయడానికి తగిన మోటార్లతో సిద్దంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. త్రాగునీటి సరఫరాకు సమస్య రాకుండా జనరెటర్లను సిద్ధం చేసుకోవడం, క్లోరిన్, ఆలం తగిన మోతాదులో ఉండేలా శ్యాంపిల్స్ సేకరణ చేయాలన్నారు. ప్రజారోగ్య కార్మికులు, డ్రైన్లలో ఎప్పటికప్పుడు వ్యర్ధాలను తొలగించడానికి కార్మికులను కేటాయించుకోవాలని, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. డ్రైన్లపై ఆక్రమణలను తొలగించాలని, పురాతన భవనాల్లో నివాసం ఉండే వారికి నోటీసులు ఇవ్వాలని, పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. వర్షాల వలన ఏమైనా సమస్యలు ఎదురైతే తెలిపేందుకు జిఎంసిలో 24గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ 0863-2345103అందుబాటులో ఉంటుందని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు సచివాలయం పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పిర్యాదులను పరిష్కారానికి యుద్ధప్రాతిపధికన చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులను ఆదేశించారు. ఈ పర్యటనలో డిఈఈ కళ్యాణరావు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రమోషన్లకు అడ్డంకిగా ఉన్న అడ్వకసీ ఉత్తర్వులను ఉపసంహరించాలి

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పనిచేస్తున్న ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల ప్రమోషన్లకి అడ్డంకిగా ఉన్న అడ్వకసీ ఉత్తర్వులను వెంటనే ఉపసంహారించుకోవాలని ఎస్‌సి, ఎస్‌సి ఉపాధ్యాయ సంఘం టిఎస్ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘాలు ఐక్యమై ఒకే బలమైన సంఘంగా ఏర్పడాలని భావించి సోమవారం హైదరాబాద్‌లో సమావేశమైన సంఘాలు ఎస్‌సి, ఎస్‌సి ఉపాధ్యాయ సంఘ: తెలంగాణ స్టేట్‌గా ఏర్పడినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులు ఐక్యంగా కలిసి పనిచేసి, సంఘాన్ని బలోపేతం చేస్తూ ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకోవాలని నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ నూతన రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెంట అంజయ్య తెలిపారు. రెండు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘాలు ఐక్యమై, ఏకీకరణ చెంది, ఒకే బలమైన సంఘంగా ఏర్పడి.. మహానీయులు మహత్మ జ్యోతిబాపూలే, భారతరత్న బాబా సాహెచ్ బిఆర్ అంబేద్కర్, సావిత్రి బాయి పూలేల ఆశయ సాధన కొరకు పనిచేయాలని తీర్మానించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు వెంటనే ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల ప్రమోషన్లకు అడ్డంగా ఉన్న అడ్వకసీ ప్రభువ్వ ఉత్తర్వును నంబర్ 2ను, మెమో నంబర్ 26559ను రద్దు పర్చాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘాల ఏకీకరణ సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లోని సామ్రాట్ అశోక భవనంలో నిర్వహించి ఏకగ్రీవంగా నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అక్యక్షులుగా తొంట సత్యనారాయణ (యాదాద్రి భువనగిరి జిల్లా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా సూర్యదేవర దానయ్య (రంగారెడ్డిజిల్లా), చాగంటి ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెంట అంజయ్య(సిరిసిల్ల జిల్లా), రాష్ట్ర కోశాధికారిగా నాంది సుశీల్ కుమార్(నిజామాబాద్ జిల్లా) రాష్ట్ర ప్రధాన సలహాదారుగా బండారు రవి వర్ధన్, రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా పారునంది రామయ్య, మోతె సాయన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నూతన రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ తెలిపారు.

### ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదలీలు చేపట్టాలి

### ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

## జిఒ 49ని నిలుపుదల చేసిన ప్రభుత్వం

### ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 21:** రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదివాసీలకు శుభవార్తను అందించింది. కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ని ప్రభుత్వం నిలుపుదల చేసింది. జీవో 49పై స్థానిక ఆదివాసీలలో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జీవోను నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జీవోను నిలిపివేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, తుడుం దెబ్బ ఆదివాసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీల అభిప్రాయాలను పరిగణ నలోకి తీసుకొని, వారి ఆందోళనలను నివృత్తి చేసే వరకు జీవో అమలు ను నిలిపి ఉంచాలని ప్రభుత్వం స్పష్టం చేసిం ది. జీవో 49 ద్వారా కొమురంభీమ్ ఆసిఫా బాద్‌లో 3 లక్షల ఎకరాల అటవీ భూమిని కన్జర్వే షన్ ఫారెస్ట్ కారిడార్‌గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, కన్జర్వేషన్ కారిడార్ వల్ల తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది!



## పెదనందిపాడుకు చెందిన డాక్టర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆఫ్రికా అత్యున్నత శిఖరమైన కిలిమంజారోను అధిరోహించిన అంతర్జాతీయ బృందం

**పెదనందిపాడు జులై 21 (ప్రభాతవార్త)** తూర్పు ఆఫ్రికాలోని టాంజానియాలో ఉన్న మోంట్ కిలిమంజారో ఆఫ్రికా ఖండంలోనే అత్యున్నత శిఖరం. దీని ఎత్తు 19,341 అడుగులు (5,895 మీటర్లు) కాగా, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్రీ స్టాండింగ్ మోంటైన్ గా గుర్తించబడుతుంది. అలాగే ఇది ప్రపంచ ప్రసిద్ధ సెవెన్ సమ్మిట్స్ లో ఒకటి. గుంటూరు జిల్లా పెదనందిపాడు కు చెందిన ప్రముఖులు. దాసరి శేషగిరిరావు కుసుమాంబ దంపతుల 3 సంతానం. డాక్టర్ దాసరి కిషోర్ కుమార్ యూకే లోని బర్మింగ్ హోంలో దశాబ్ద కాలం పైగా వైద్య వృత్తి సాగిస్తున్నారు. డాక్టర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో భారత్. యునైటెడ్ కింగ్




డమ్. యునైటెడ్ స్టేట్ దేశాల నుండి 18 మంది సభ్యులతో ఈనెల 13 నుండి 20 వరకు 5895 మీటర్ల ఎత్తులో ఉన్న శిఖరాన్ని ఈ అంతర్జాతీయ డాక్టర్ల బృందం విజయవంతంగా అధిరోహించింది. ఈ ప్రయాణంలో చివరి రోజు అర్ధరాత్రి ప్రారంభించి, కోసోవో క్యాంప్ (4870 మీటర్లు) నుంచి 6-7 గంటల ప్రయాణం తర్వాత 5895 మీటర్ల ఎత్తులో ఉదయోదయంను చూసారు. ఈ దృశ్యం చూసిన బృందానికి మనసు పులకరించినట్లు తాము పడ్డ శ్రమను మరిపించింది. ఆ సమయంలో తాపమానం 12 డిగ్రీల సెల్సియస్ ఉండేది. ఈ ప్రయాణాన్ని సులభతరం చేయడంలో 102 మంది టాంజానియన్ సిబ్బంది మద్దతుగా నిలిచిందని డాక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు. వారు గుడారాలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి, ఆహారం తయారుచేసి ట్రెక్కర్లకు మానసికంగా, శారీరకంగా సహాయం అందించారని వారు పేర్కొన్నారు. ఈ గ్రూప్ ట్రెక్కులో స్త్రీలకూ సమాన అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో, ప్రారంభ దశలో మహిళా సభ్యులే లీడ్ చేయడంతో వారికి అవసరమైన వేగం, విరామాలకు అవకాశమిచ్చారు. ఈ విధానం బృంద ఐక్యతను పెంపొందించింది. ఈ ప్రయాణం ప్రతి ఒక్కరికి ఒక మైలురాయిగా నిలిచింది శారీరకంగా, మానసికంగా సవాలుతో కూడిన ఈ ప్రయాణం, విజయంతో ముగియడము .వారికే గాక మనకు గర్వకారణం. ఈసందర్భంగా డాక్టర్ కిషోర్ కుమార్ కు వారి కుటుంబ సభ్యులు స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

## 24న ఢిల్లీలో సిఎం రేవంత్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రెజంటేషన్

### డా. మల్లు రవి

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త :** రేవంత్‌రెడ్డి కులగణన, బిసి రిజర్వేషన్ అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఢిల్లీలో ఇవ్వబోతున్నారని ఎంపి మల్లు రవి తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపిల కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపి డా. మల్లు రవి. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నాడు ఢిల్లీలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లి కార్జున ఖర్గేలతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు సమావేశమై రాష్ట్రం లో చేపట్టిన కులగణన,బీసీ లకు 42శాతం రిజర్వేషన్ అంశాలపై వారికి వివరించి వారి సలహాలను, సూచనలను స్వీకరించ నున్నారని తెలిపారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు కులగణన, బిసి రిజర్వేషన్లపై ఇందిరా భవన్ లో దేశంలోని కాంగ్రెస్ ఎంపీలందరికీ సిఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తారని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్ లో చర్చించాలని కోరనున్నారని తెలిపారు. పార్లమెంట్ లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరపాలని పట్టుబడితే పదేపదే సభను వాయిదా వేస్తున్నారని చెప్పారు.

## సిఎంగా రేవంత్ కనిష్టంగా పదేళ్లు.. గరిష్ఠంగా ఎన్నేళ్లయినా..!

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** రేవంత్‌రెడ్డి కనిష్టంగా పదేళ్లు ముఖ్యమంత్రి గా ఉంటాడు గరిష్టం గా సిఎంగా గా ఎన్నేళ్లైనా ఆపదవిలో ఉండొచ్చు అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మాదే అని ధీమా వ్యక్తం చేశార. 31 జిల్లాపరిషత్ లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. పాపం హరీష్ రావును చూస్తుం టే జాలేస్తుందని తుక్కు తుక్కై ఫామ్ హౌస్ గ్యారేజ్‌లో పడి ఉన్న కారు కు మళ్లీ గాలికొట్టేందుకు ఆయన అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కారు టైర్లగాలిపోయింది, పార్లమెంట్ ఎన్నికల్లో ఇంజన్ పనికి రాకుండా పోయిందని భాష్యం చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ బోరుకొచ్చింది దాన్ని బాగుచేయలేరు పాత ఇనుప సామాను కు కూడా పనికి రాదని అపహాస్యం చేశారు. హరీష్ రావు మాత్రం ఫామ్ హౌస్ లో మామతో కలిసి కూర్చుని దొంగ సర్వేలు తయారు చేసుకు వచ్చి ప్రచారం చేస్తున్నాడని ఆయన అన్నారు. 31 జిల్లా పరిషత్ లకు 16 నుంచి 18 జిల్లా పరిషత్ లు బిఆర్ఎస్ గెలుస్తుందని హరీష్ రావు కాకమ్మ కబుర్లు చెపుతున్నాడని ఆయన అన్నారు. హరీష్ రావు ముందు సిద్ధిపేటజిల్లా పరిషత్ గెలువు అని సవాల్ విసిరారు. నీ దగ్గర జడ్పీటీసీలు గెలిపించుకో చాలు అని ఆయన అన్నారు. హరీష్ రావు కు గత అసెంబ్లీ ఎన్నికల్లో 82 వేల మెజార్టీ వచ్చిందని పార్లమెంటు ఎన్నికలకు వచ్చే సరికి సిద్ధిపేట లో బిఆర్ఎస్ అభ్యర్థి కి 40 వేల ఓట్లు తగ్గాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ సెగ్మెంట్లో అసెంబ్లీ ఎన్నికల కంటే ఇప్పుడు 26,252 ఓట్లు తగ్గాయి., అంటే పార్లమెంటు ఎన్నికల నాటికి మీ గ్రాఫ్ సగానికి సగం పడిపోయిందని అన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ పరిస్థితి ఏమిటో మీరే అర్థం చేసుకోండని అన్నారు. చచ్చిన పాము బిఆర్ఎస్ పార్టీ మీరెన్ని లేపనాలు పూసినా ఉపయోగం లేదు.. అది లేవదు అని అన్నారు. తెలంగాణ లో బిఆర్ఎస్ పార్టీకి ఒక్క జడ్పీ కూడా దక్కే అవకాశం లేదని ఆయన అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని జడ్పీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని చెప్పారు.

## పల్నాడు జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడిగా మల్లెల శివనాగేశ్వరరావు నియామకం

**చిలకలూరిపేటటౌన్, జులై21, ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అనుమతితో పల్నాడుజిల్లా బిజెపి అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ కార్యవర్గంలో చిలకలూరిపేటకు చెందిన మల్లెల శివనాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా నియమితులైన మల్లెల శివనాగేశ్వరరావును కాపుసంఘం నాయకులు తోట శ్రీనివాసరావు, గోవింద శంకర శ్రీనివాస్, వట్టెం శ్రీనివాసరావు, జగ్గాపురం రామారావు, ఎ వెంకటేశ్వర్లు, ఎ లీలాకిషోర్, తోట సతీష్‌కుమార్ నాయుడు తదితరులు అభినందనలు తెలియచేశారు.

## కందుకూరి అవార్డు గ్రహీత రంగస్థల నటుడు విసిహెచ్‌కె ప్రసాద్‌కు నటశేఖర అవార్డు

**చిలకలూరిపేట, జులై21, ప్రభాతవార్త:** ప్రముఖ రంగస్థల నటుడు, పాత్రికేయుడు, విశ్రాంత ఉద్యోగి వంకాయలపాటి చెన్నకేశవ ప్రసాద్‌కు కాకినాడలో అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నటశేఖర బిరుదును ప్రధానం చేశారు. ఈ బిరుదను పరిషత్



అధ్యక్షులు కర్రి అచ్యుతరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపక దయానందబాబు, ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్‌ల సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకటరామారావు, మజీమంత్రి చిట్యాల రామచంద్రరావులు ప్రసాద్‌ను సత్కరించి బిరుదును ప్రధానం చేశారు. ఐదు దశాబ్దాలుగా రంగస్థలం మీద ప్రసాద్ 70 నాటికలు, వెయ్యికి పైగా ప్రదర్శనలు ఇచ్చిన ప్రసాద్ విలక్షణ పాత్రలలో పరకాయ ప్రవేశం చేసి, విలక్షణ నటుడిగా ఉభయ తెలుగురాష్ట్రాలలో గుర్తింపు పొందారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి కందుకూరి అవార్డును అందుకున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది అవార్డును కూడా ప్రసాద్ అందుకున్నారు. కాగా ప్రసాద్ ఈ అవార్డు అందుకోవడం పట్ల చిలకలూరిపేట ప్రాంత కళాపరిషత్‌ల నిర్వాహకులు, కళాపోషకులు, కళాకారులు ప్రత్యేకంగా అభినందనలు తెలియచేశారు

## వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

**చిలకలూరిపేట, జులై21, ప్రభాతవార్త:** చిలకలూరిపేట వాసవీ ప్లాటినం, ఫ్యామిలీస్, గ్రేటర్స్‌క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వాసవి జ్ఞానమందిరంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియో డాక్టర్ మౌనిక రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల మరణించిన ఫ్యామిలీస్ క్లబ్ అధ్యక్షురాలు దామిశెట్టి హేమలతకు క్లబ్ సభ్యులు సంతాపం వెలిబుచ్చారు. అనంతరం ఆమె జ్ఞాపకార్ధం షుగర్ టెస్ట్ మిషన్‌ను క్లబ్‌కు అందచేశారు. ఈ సందర్భంగా పేదలకు ఫించన్లు పంపిణీ చేశారు. విద్యార్దులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీస్ క్లబ్ అధ్యక్షురాలిగా హేమలత స్థానంలో మద్ది నాగలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అర్వపల్లి చరణ్, కోశాధికారి బాలనాగు జయలక్ష్మి, అర్వపల్లి సత్యనారాయణ, తవ్వా నాగమల్లేశ్వరరావు, దామిశెట్టి నాగేంద్రరావు, అన్ని క్లబ్‌లు అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.



## ఖర్గేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పిసిసి చీఫ్

### గాంధీభవన్‌లో బర్త్‌డే కేక్ కట్ చేసిన మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ సోమవారం ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే పుట్టిన రోజు సందర్భంగా ఢిల్లీకి వెళ్లి నేరుగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలి పారు. అయితే ఈ పర్యటన రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆసక్తిగా మారింది. ఖర్గే జన్మ దిన శుభాకాంక్షలు తెలి పేందుకే టిపిసిసి వెళ్ళినప్పటికి రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల దృష్ట్యా మహేశ్ కుమార్ ఢిల్లీకి రప్పించు కొన్నారని పార్టీ వర్గాలు చర్చించుకొంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల రాబోయే పదేళ్ళు నేనే సిఎంగా ఉంటానని అనడం పార్టీలోని కాంగ్రెస్ నాయకులను ఇబ్బంది పెడుతోన్నది. అదే జిల్లా నుంచి చంద్రబాబు కోవర్టులు ఉన్నారంటూ ఒక ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రోజు రోజుకు పెరిగిపోతున్న క్రమశిక్షణా రాహిత్యం, స్థానిక సంస్థల వంటి అంశాలపై ఎఐసిసి పెద్దలతో మహేష్‌కుమార్‌గౌడ్ చర్చించినట్లు తెలుస్తోంది. తెలం గాణలో త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం, నామినేటెడ్ పదవుల భర్తీ అంశంపై కసరత్తు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో టిపిసిసి అధ్యక్షుడి ఢిల్లీ పర్యటన ఆసక్తిగా మారింది. ఆర్డినెన్సు రూపంలో బిసి రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఆర్డినెన్స్ ను గవర్నర్ వద్దకు పంపగా దానిని గవర్నర్ న్యాయసలహా కోసం పంపించారు. గవర్నర్ వద్ద ఏదైనా ఆటంకం ఏర్పడితే రాజకీయంగా బిసి 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధం అనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రె డ్డి గతంలోనే చెప్పారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల నాటికి నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన శుభా కాంక్షలు తెలి పేందుకు ఢిల్లీ వెళ్ళిన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు రాష్ట్ర మైనింగ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరవత్రి అనిల్ కుమారులకు ఢిల్లీ ఎయిర్ పోర్టుల తెలంగాణ పిసిసిఆన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్ విభాగం చైర్మన్ కౌశల్ సమీర్, టిపిసిసి ఎన్నికల ప్రచార కమిటీ కో కన్వీనర్ పృథ్వీరాజ్ నాయక్‌లు ఘనస్వాగతం పలికారు.

## వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో చేతి సంచుల పంపిణీ

కారంపూడి, జులై 21 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు కొణిజేటి రోశయ్య 92వ జయంతిని పురస్కరించుకుని కారంపూడి వాసవీ సేవా సమితి సమైఖ్య ఆధ్వర్యంలో చేతిసంచులు పంపిణీ చేశారు. సేవాసమితి అధ్యక్షులు గరినే పుల్లారావు, సెక్రటరీ వెచ్చా వరలక్ష్మణరావు, కోశాధికారి గజవెల్లి మునేశ్వరరావు, వాసవీ జాగృతి క్లబ్ ఇంగర్నేషనల్ ఫౌండర్ తిరువీధుల వేణుగోపాలరావు చేతుల మీదుగా సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ జాగృతి క్లబ్ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, అధ్యక్ష కార్యదర్శులు కరాలపాటి ఆదినారాయణ, కర్నాటి మహేష్, ఆతుకూరి భాస్కర్, దేవస్థాన అధ్యక్షుడు మధు, హనుమంతరావు, మాజీ అధ్యక్షులు చీతిరాల వెంకట కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పెదనందిపాడు లోనే పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**పెదనందిపాడు జూలై 21. (ప్రభాతవార్త)** పెదనందిపాడు మండలం. నాగులపాడు ఉప మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు సోమవారం తాసిల్దార్ హేన ప్రియ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఏడాది వందలాది ఎకరాల్లో పొగాకు సాగు చేశామని అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని .రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు తమ ఇళ్ళ వద్ద ఉన్న పొగాకు మండేలలో నీరు చేరి పాడైపోతుందని నాగులపాడు కి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తెచ్చిన అప్పులు తీరతాయో లేవో అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నేషనల్ మీన్స్ కం మెరిట్‌స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపికైన వారు అప్లికేషన్లు సమర్పించాలి

**నకరికల్లు, జూలై 21 ప్రభాతవార్త :** నేషనల్ మీన్స్ కం మెరిట్‌స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపికైన వారు ఆగస్టు 31 లోపు కేంద్ర మానవవనరులశాఖ న్యూఢిల్లీ వారి వెబ్‌సైట్ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, అప్లికేషన్లు సమర్పించాలని పరీక్షల సంచాలకులు డాక్టర్ కె.వి.శ్రీనివాసరెడ్డి సోమవారం కోరారు. గత ఏడాది మాదిరిగానే విద్యార్ధుల వివరాలు ఒక అక్షరం కూడా తేడా లేకుండా మెరిట్ లిస్ట్‌లో ఉన్న విధంగా ఆధార్, బ్యాంక్ పాసు పుస్తకాలలో సరి చేయించుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో విద్యార్థి పేరు, పుట్టిన తేది, తండ్రి పేరు అందజేయాలన్నారు. ఈ ఏడాది 10,11,12 తరగతుల ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాలయాల్లో విద్యార్థులు తప్పకుండా రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఈ పథకం విధి విధానాలు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో తీసుకోవాలని డాక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి కోరారు.

22-7pg10exAKP.qxd:22-7pg10exAKP.qxd 01/01/01 7:35 AM Page 1



## ఆసియా జూ.ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఓటమి

### 104-110 తేడాతో జపాన్ విక్టరీ



**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్-2025, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయింది. జూనియర్ ప్రపంచ నంబర్ 1 తన్వి శర్మ నేతృత్వంలోని భారత జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌తో సోమవారం జరిగిన హోరాహోరీ పోరులో 104-110 తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమితో బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్‌లలో మిక్స్‌డ్ టీమ్ పతకం కోసం భారత్ ఆశలు ఆవిరయ్యాయి. దశాబ్దం క్రితం 2011లో ఈ ఈవెంట్‌లో చివరిసారిగా భారత్ పతకం సాధించింది. సెమీఫైనల్స్‌లో, తన్వి తొలి మ్యాచ్‌ను 9-11 తేడాతో యుజునో వటనాబే చేతిలో ఓడించడంతో భారత్ అత్యుత్తమ ఆరంభాలను పొందలేదు. అయితే, పురుషుల డబుల్స్ జత భార్గవ్‌విశ్వ తేజ్, మహిళల డబుల్స్ జత వెన్నలరేషిక, మిక్స్‌డ్ డబుల్స్ జత భవ్యరేషిక అందరూ తమ తమ మ్యాచ్‌లను గెలిచి భారత్ 44-35 ఆధిక్యంలోకి వెళ్లడానికి సహాయపడటంతో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. డబుల్స్ మ్యాచ్‌లలో ఆధిపత్యంతో భారత్ సునాయాస విజయం సాధించాలని చూస్తుండగా, సింగిల్స్ విభాగంలో జపాన్ మరోసారి పరాభవం ఎదురైంది.. ఐదవ మ్యాచ్‌లో హ్యూగ్ టకానో రౌనక్ చౌహాన్‌పై విజయం సాధించగా, వటనాబే మరోసారి తన్విని ఓడించి జపాన్ 66-60 ఆధిక్యంలోకి వెళ్లడానికి సహాయపడింది. అప్పటి నుండి, భారతదేశం తిరిగి వచ్చే అవకాశం లేదు. పదవ మరియు చివరి మ్యాచ్‌లో చౌహాన్ సాహసోపేతమైన ప్రయత్నం చేసినప్పటికీ, భారత్ 104-110తో వెనుకబడి అంతరం పూడ్చడం సాధ్యం కాలేదు. ఈ పోటీలో ముందుగా, భారతదేశం మూడు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో తమ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది.
వారు శ్రీలంక, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మరియు హాంకాంగ్‌లను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు.

## హంగేరీ సిరీస్‌లో భారత్ మహిళల జట్టుకు 10 పతకాలు



**న్యూఢిల్లీ:** హంగేరీ ర్యాంకింగ్ సిరీస్‌లో భారత్ 10 పతకాలతో తన ప్రచారాన్ని ముగించింది. బుడాపెస్ట్‌లో జరిగిన పాలియాక్ మెమోరియల్ ర్యాంకింగ్ సిరీస్-2025లో భారత్ మహిళల జట్టు టైటిల్‌తో పాటు, రెజ్లింగ్‌లో మొత్తం పది పతకాలతో (మూడు స్వర్ణాలు, మూడు రజతాలు మరియు నాలుగు కాంస్యాలతో) విజయవంతమైన ప్రచారాన్ని ముగించింది. పోటీల చివరి రోజున, అండర్ 23 ఆసియా ఛాంపియన్ సుమిత్ 60 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో ఫైనల్‌కు చేరుకోవడం ద్వారా తన తొలి సీనియర్ అంతర్జాతీయ పతకాన్ని సాధించాడు. సెమీఫైనల్‌లో అతను కజకిస్తాన్‌కు చెందిన గాలిమ్ కబ్దునస్సారోవ్‌ను 10-1 తేడాతో ఓడించాడు. అయితే, ఫైనల్‌లో, సుమిత్ 1-5 తేడాతో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అజర్‌బైజాన్‌కు చెందిన నిహత్ మమ్మద్లి చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అంతకుముందు జరిగిన 55 కిలోల కాంస్య పతక పోరులో అనిల్ మోర్ 7-4 తేడాతో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ఇఖ్తియోర్ బొటిరోవ్‌ను ఓడించి, టోర్నమెంట్‌లో భారతదేశానికి తొలి గ్రీకో రోమన్ పతకాన్ని అందించాడు. మహిళల రెజ్లింగ్ జట్టు ఒక రోజు ముందే తమ ఈవెంట్లను ముగించి, 130 పాయింట్లతో జట్టు స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. వారి ప్రచారానికి ఆంటిమ్ పంఘల్ నాయకత్వం వహించారు, ఆమె 53 కిలోల టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా తన స్వర్ణ పరంపరను కొనసాగించింది. 20 ఏళ్ల ఒలింపియన్ గత నెలలో మంగోలియాలోని ఉలాన్‌బాతర్‌లో విజయం సాధించిన తర్వాత, ఫైనల్‌లో రష్యాకు చెందిన నటాలియా మలిషేవాను 7-4 తేడాతో ఓడించి తన వరుసగా రెండవ ర్యాంకింగ్ సిరీస్ స్వర్ణాన్ని గెలుచుకుంది. 72 కిలోల ఫైనల్లో హర్షిత అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది, నాలుగుసార్లు ఆసియా ఛాంపియన్ కజకిస్తాన్‌కు చెందిన జామిలా బక్‌బెర్గెనోవాను 100 తేడాతో ఓడించి బంగారు పతకాన్ని సాధించింది.



## ఆస్ట్రేలియా జయభేరి


### టి 20లో 3 వికెట్ల తేడాతో వెస్టిండీస్ ఓటమి

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో తొలి టీ20లో ఆస్ట్రేలియా జయభేరి మోగించింది. టెస్టు సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన కంగారూలు టీ20లోనూ సుభారంభం చేశారు. జమైకా వేదికగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్లును మూడు వికెట్ల తేఊడాతో ఓడించింది. తద్వారా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముదంజ వేసింది. సబీనా పార్కులో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన విండీస్ ఆదిలోనే ఓపెనర్ బ్రాండన్ కింగ్ (18) వికెట్ కోల్పోయింది. అయితే మరో ఓపెనర్, కెప్టెన్ షాయీ హోప్ (39 బంతుల్లో 55), వన్‌డౌన్ బ్యాటర్ రోస్టన్ ఛేజ్ (60) అర్థ శతకాలతో రాణించారు. సిమ్రన్ హెట్‌మెయిర్ (19 బంతుల్లో 38) తనదైన శైలిలో ధనాధన్ దంచికొట్టగా, మిగిలిన వారంతా విఫలమయ్యారు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో వెస్టిండీస్ 8 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. ఆసిస్ బౌలర్లలో ద్వార్షుయిస్ 4 వికెట్లుతో చెలరేగగా, సీన్ అబాట్, కూపర్ కన్నోలి, నాథన్ ఎల్లిస్, ఆరంగేట్ర ప్లేయర్ మిచెల్ ఓవెన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇక లక్ష్య ఛేదనకు దిగిన మార్షల్ బృందం 18.5 ఓవర్లలోనే పని పూర్తి చేసింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (24) ఫర్వాలేదనిపించగా, మరో ఓపెనర్ జేక్ ఫ్రేజర్ మెగర్క్ (2), వన్‌డౌన్ బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ (18) నిరాశపరిచారు. గ్లిన్ మాక్స్‌వెల్ (11) సైతం విఫలం కాగా, కామెరాన్ గ్రీన్, మిచే ఓవెన్ మెరుపు అర్థ శతకాలతో చెలరేగారు. గ్రీన్ 6 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 51 పరుగులు చేయగా, మిచెల్ ఓవెన్ 6 సిక్సర్లు బాది 50 పరుగులు సాధించాడు. మిగిలిన వారిలో కూపర్ కన్నోలి (13), డార్షున్ (5)తో పేలవ ప్రదర్శన చేయగా, సీన్ అబాట్ (5) అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఫలితంగా 18.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసిన ఆస్ట్రేలియా వెస్టిండీస్‌పై 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

## ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు: టీమిండియాకు బిగ్‌షాక్

### కీలక ప్లేయర్లకు గాయాలు.. ఆల్‌రౌండర్ సహా ఫాస్ట్ బౌలర్ల ఔట్





**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత్ ను ఆటగాళ్ల గాయాలు వేధిస్తున్నాయి. ఇప్పటికే సిరీస్ లో వెనుకంజలో నిలిచిన టీమిండియా ఇప్పుడు గాయాలతో ఆటగాళ్ల దూరం కావడంతో కాస్త డీలా పడింది. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నాల్గో టెస్టు మ్యాచ్ మాంచెస్టర్ వేదికగా ఈ నెల 23 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే మూడు టెస్టు మ్యాచ్‌లలో 21తో ఇంగ్లాండ్ జట్టు ఆధిక్యంలో ఉంది. నాల్గో టెస్టులో విజయం సాధించి ఇంగ్లాండ్ జట్టుకు ధీటైన పోటీ ఇవ్వాలని భారత జట్టు ప్లేయర్లు భావిస్తున్నారు. అయితే, నాల్గో టెస్టుకు ముందు టీమిండియాకు వరుసగా షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇంగ్లాండ్ జట్టుతో నాల్గో టెస్టుకు ముందు భారత జట్టుకు బిగ్ షాక్ తగిలింది. ఓ ఆల్‌రౌండర్ సహా ఇద్దరు ఫాస్ట్ బౌలర్లకు గాయాలు కావటంతో టీమిండియా పరిస్థితి ఆందోళనక రంగా మారింది. ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ అర్ధంతరంగా ఇంగ్లాండ్ పర్యటనను ముగించుకొని స్వదేశానికి వచ్చేస్తున్నట్లు సమాచారం. జిమ్ లో ట్రైనింగ్ సందర్భంగా నితీశ్ గాయపడినట్లు తెలిసింది. అతడి లిగమెంట్ దెబ్బతిన్నట్లు స్కానింగ్ లో తేలింది. దీంతో సిరీస్ లో మిగిలిన రెండు టెస్టులకు దూరంకాక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ పర్యటనలో నితీశ్ రెండు టెస్టులు ఆడాడు. 45 పరుగులు చేశాడు. మూడు వికెట్లు పడగొట్టాడు. ఇప్పటికే గాయాలతో వర్క్ లోడ్ మేనేజ్మెంట్ కారణంగా నాలుగో టెస్టులో జస్ప్రీత్ బుమ్రా ఆడతాడో లేదో అన్న సందిగ్ధత నెలకొంది. దీనికి తోడు నితీశ్ గాయం కూడా టీమ్ మేనేజ్మెంట్ ను కలవరపెడుతోంది. మరోవైపు లెఫ్టార్మ్ పేసర్ బర్మింగ్‌హామ్ టెస్టులో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆకాశ్ దీప్ కూడా గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో అతను కూడా నాల్గో టెస్టులో ఆడే అవకాశం లేదని తెలుస్తోంది. ప్రాక్టీస్ సెషన్ లో బంతిని ఆపుతుండగా, బౌలింగ్ చేసే ఎడమ చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. గాయం తీవ్రత దృష్ట్యా అతడిని పక్కన పెట్టాలని టీమ్ మేనేజ్మెంట్ భావిస్తోంది. అతని స్థానంలో మరో ఆల్ రౌండర్ అన్షుల్ కాంబోజ్ ను టీమ్ లోకి ఎంపిక చేశారు. దేశవాళీల్లో అదరగొట్టిన అన్షుల్ అన్నీ అనుకున్నట్లు జరిగితే నాలుగో టెస్టులో అరంగేట్రం చేసే అవకాశముంది.

## ఫ్రీస్టైల్ చెస్ ప్లే ఆఫ్‌లో అర్జున్ ఓటమి

### ఏడోస్థానానికి ప్రజ్ఞానంద పరిమితం



**న్యూఢిల్లీ:** ఫ్రీస్టైల్ చెస్ ఎట్టకేలకు భారత్ గ్రాండ్ మాస్టర్ ఎరిగేసి అర్జున్ ఓటమిపాలయ్యాడు. మరో గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంత తదుపరి స్థానానికి పరిమితమయ్యాడు. లాస్ వెగాస్‌లో సోమవారం జరిగిన 2025 ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్‌లో భారతదేశానికి చెందిన అర్జున్ ఎరిగైసి మరియు ప్రజ్ఞానంద రమేష్‌బాబు వరుసగా ఆరవ మరియు ఏడవ స్థానాల్లో నిలిచారు. టోర్నమెంట్ ప్రారంభంలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి, ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయుడిగా నిలిచిన అర్జున్, ఐదవ, ఆరవ స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్‌లో ఫాబియానో కరువానా చేతిలో 0-2 తేడాతో ఓడిపోయాడు. 21 ఏళ్ల ఈ భారత ఆటగాడు నాకౌట్ దశలోనే తన లక్ష్యాన్ని కోల్పోయి, సెమీఫైనల్లో విజేత లెవాన్ అరోనియన్ చేతిలో, లోయర్ బ్రాకెట్ సెమీఫైనల్లో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ చేతిలో మరియు కరువానా చేతిలో వరుసగా మూడు ఓటములతో టోర్నమెంట్‌ను ముగించాడు. ఎరియాగిసి తన అత్యుత్తమ ప్రదర్శనను కనబరచలేకపోయాడు. కరువానా పోటీ నుండి రాజీనామా చేసే ముందు భారత రాణిని ట్రాప్ చేస్తూ మ్యాచ్‌ను ముగించాడు. మరోపక్క ప్రజ్ఞానందకు కఠినమైన టోర్నమెంట్ అయినప్పటికీ, ఏడో‌ఎనిమిదో స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్‌లో వెస్లీ సోపై విజయం సాధించాడు. చెన్నైకి చెందిన ఈ 19 ఏళ్ల యువకుడు సోతో జరిగిన మొదటి గేమ్‌లో బ్లాక్ పావులతో అద్భుతమైన డ్రాతో నిష్క్రమించాడు. దీనితో అతను తెల్లవారితో విజయం కోసం ఒత్తిడి తెచ్చే అవకాశం లభించింది. ఎనిమిదో ఎత్తుగడలోనే సో తప్పు చేయడంతో, ప్రజ్ఞానంద ఆ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుని విజయాన్ని నమోదు చేసుకుని ఏడో స్థానంలో నిలిచాడు. టోర్నమెంట్‌లో ఆరో స్థానంలో నిలిచినందుకు ఎరిగైసి 40,000 డాలర్లు (రూపాయల్లో 34,50,580) గెలుచుకోగా, ప్రజ్ఞానంద 30,000 డాలర్లు (రూ.25,87,935) గెలుచుకున్నాడు.


## యుపిఐ చెల్లింపుల్లో అగ్రగామి భారత్!

**న్యూఢిల్లీ, జూలై 21:** ఇప్పుడంతా డిజిటల్ కాలం అయిపోయింది. ఫిజికల్ క్యాష్ తీసుకోవడం ఇవ్వడం చాలా వరకు తగ్గిపోయిందనే చెప్పాలి. చిన్నా పెద్దా అన్ని అవసరాలకు కూడా యూపీఐనే వాడేస్తున్నారు. ప్రస్తుతం ఇండియాలో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు పెరిగి పోయారు. అందుకు తగ్గట్టే డిజిటల్ చెల్లింపులు కూడా భారీగా పెరిగాయి. ఎంతలా అంటే యూపీఐ లావాదేవీల్లో ప్రపంచంలోనే ఇండియా నంబర్ వన్గా నిలిచింది. ఈ విష యాన్ని ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) తన నివేదికలో వెల్లడించింది. నేడు మన దేశంలో ప్రతి నెలా 1800 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగు తున్నాయని ఐఎంఎఫ్ తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో రూ.24.03 లక్షల కోట్లు యూపీఐ ద్వారా బదిలీ అయ్యాయి. మొత్తం 18.39 బిలియన్ లావాదేవీలు నమోద య్యాయి. 2024లో ఇదే నెలలో 13.88 బిలియన్ లావాదేవీ లు కాగా, ప్రస్తుతం 32 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుతం 49.1 కోట్ల మంది సామాన్య ప్రజలు, 6.5 కోట్ల మంది వ్యాపా రులు ఈ యూపీఐ సేవలను వినియోగిస్తున్నారు. 675 బ్యాంకులు యూపీఐ సేవలను అందిస్తున్నాయి. దేశం లో మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో 85 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయి. ప్రపంచంలో రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 50 శాతం ఒక్క మన దేశం లోనే జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. భారత్‌తో పాటు యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ వంటి ఏడు దేశాల్లో యూపీఐ సేవలను అనుమతిస్తున్నాయి. బ్రిక్స్ సభ్యత్వ దేశాలకు యూపీఐని విస్తరించాలని రిజర్వుబ్యాంకు యోచిస్తోంది. సురక్షితమైన, వేగవం తమైన లావాదేవీల వల్ల యూపీఐ చెల్లింపులు ప్రజల్లో ఇంత ఆదరణ పొందాయి.




## జేన్‌స్ట్రీట్ రీఎంట్రీకి సెబి ఓకే

**ముంబై, జూలై 21:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో అక్రమ పద్ధతుల ద్వారా వేల కోట్లు కొల్లగొట్టిన అమెరికా హెడ్జ్ ఫండ్ జేన్ స్ట్రీట్‌పై విధించిన నిషేధాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఎత్తివేసింది. తాము విధించిన రూ.4,800 కోట్ల జరిమానాను ఆ సంస్థ ఎస్క్రో ఖాతాలో డిపాజిట్ చేసిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లోకి మళ్లీ ప్రవేశించేందుకు అనుమతిచ్చి నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. నిషేధం ఎత్తివేసిన విషయాన్ని అటు జేన్‌స్ట్రీట్‌తో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలకు, డిపాజిటరీలకు, కస్టోడియన్లకు సెబి సమా చారం ఇచ్చినట్లు తెలుస్తోంది. జరిమానా మొత్తాన్ని ఎస్క్రో ఖాతాలో జమ చేసిన సందర్భంగా తమపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని ఆ సంస్థ కోరిన నేపథ్యంలో సెబీ నిషేధం ఎత్తివేయడం గమనార్హం. ఒకసారి జేన్‌స్ట్రీట్ ఉదంతం బహిర్గతమైన నేపథ్యం లో ఆ సంస్థ రోజువారీ కార్యకలాపాలపై ఎక్స్ఛేంజీలు నిఘా ఉంచే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొ న్నాయి. అక్రమ పద్ధతులకు పాల్పడిన జేన్‌స్ట్రీట్ సంస్థపై సెబి జులై 3న చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ సంస్థ దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు నిర్ధారిం చింది. అదే సమయంలో స్టాక్ ఫ్యూచర్స్‌లో రూ.7,208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ.191 కోట్లు, నగదు విభాగంలో రూ.288 కోట్లు పోగొట్టుకుంది. ఈ నష్టాలను మినహాయిస్తే, నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించారు. అందులో రూ.4,843 కోట్ల సొమ్మును జరిమానాగా చెల్లించా లని సెబి ఆదేశించింది. దేశీయ స్టాక్‌మార్కెట్ల చరిత్ర లో సెబి ఇంత పెద్దమొత్తాన్ని పెనాల్టీ విధించడం ఇదే ప్రథమం. ఆ మొత్తాన్ని గతవారం జేన్‌స్ట్రీట్ డిపాజిట్ చేసింది.




## ఇన్‌స్టా స్క్రోలింగ్ ఆపి ఎఐ టూల్స్‌పై ఫోకస్ పెంచండి..

### యువతకు పర్‌ప్లెక్సిటీ సిఇఒ సందేశం



**ముంబై, జూలై 21:** ఇన్‌స్టాగ్రామ్‌లో నిరంతరం స్క్రోలింగ్ చేయ డం తగ్గించి, దానికి బదులు గా ఏఐ టూల్స్ వినియోగంలో ప్రావీణ్యం సంపా దించడంపై దృష్టి పెట్టాలని పర్‌ప్లెక్సిటీ సీఈవో అరవింద్ శ్రీనివాస్ యువతకు సూచించారు. ఇటీవల ప్రముఖ టెక్ జర్నలిస్ట్ మాథ్యూ బెర్మాన్‌తో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐని సరిగా ఉపయోగించడం తెలిసిన వారికి జాబ్ మార్కెట్‌లో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత ఏఐ యుగంలో మూడు నుంచి ఆరు నెలల వ్యవధి లోనే భారీ మార్పు లు చోటుచేసుకుంటు న్నాయని శ్రీనివాస్ అన్నా రు. దాంతో పోటీ పడకపోతే ఉద్యోగ అవకాశాల పరంగా వెనకబడి పోతామని పేర్కొన్నారు. సాంకేతికతతో పాటు వృద్ధి చెందడం అంతతేలికైన పని కాదు. ఇప్పటి వరకూ చూసుకుంటే మానవాళి ఇలా పెద్ద స్థాయిలో మార్పులకు త్వరగా సర్దుబాటు కాలేదన్న ఉదాహరణ లెన్నో ఉన్నాయి అని శ్రీనివాస్ అన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్‌ప్లెక్సిటీకి చెందిన ఏఐ కామెట్ బ్రౌజర్ మానవ రిక్రూటర్ల పనిని పూర్తిగా భర్తీ చేసే స్థాయికి ఎదగవచ్చని అభిప్రాయ పడ్డారు. ఒక రిక్రూటర్ వారం రోజుల పాటు చేసే పని, ఒక్క మంచి ప్రాంప్ట్‌తోనే పూర్తవు తుంది. సదరు అభ్యర్థుల వివరాలు సేకరించడం, వారికి మెయిల్ పంపించడం, వారి స్పందనలను ట్రాక్ చేయడం, గూగుల్ షీట్‌లో స్టేటస్ అప్‌డేట్ చేయ డం, ఫాలోఅప్‌లు ఇవ్వడం, గూగుల్ క్యాలెం డర్‌తో సింక్ చేయడం, మీటింగ్‌కుముందు బ్రీఫింగ్ పంపడం.. ఇవన్నీ ఆటోమేటిక్‌గా జరగాలి. ఇదే వచ్చే తరంలోని ఏఐ టూల్స్ లక్ష్యం అని చెప్పారు. ప్రస్తుతం కామెట్ బ్రౌజర్‌ను పెర్‌ప్లెక్సిటీ సబ్‌స్క్రిప్షన్ ఉన్న వినియోగదారులకే పరిమితం చేశారు.

## ఇండియా మార్కెట్‌కు కొత్త ఇ-స్కూటర్లు!

**ముంబై, జూలై 21:** రాబోయే నెలల్లో ఏథర్, కైనెటిక్ వంటి ఎలక్ట్రిక్ వాహనాల బ్రాండ్లు అలాగే యమహా, సుజుకి, టివిఎస్ వంటి తయారీదారులు కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేస్తారు. ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐదు రాబోయే ఎలక్ట్రిక్ స్కూటర్ల గురించి తెలుసుకుందాం. సుజుకి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈయాక్సెస్ స్కూటర్‌ను జనవరి 2025లో జరిగిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో లో ప్రవేశపెట్టారు. దీని మీడియా టెస్ట్ రైడ్‌లు పూర్తయ్యాయి. అలాగే మే 2025 నుండి గురుగ్రామ్ ప్లాంట్‌లో దీని సీరియల్ ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. ఇది 3.07 కెడబ్ల్యూహెచ్ లిథియంఅయాన్ బ్యాటరీని కలిగి ఉంది. ఇది ఒకే ఛార్జ్‌పై దాదాపు 95 కి.మీ.ల పరిధిని ఇస్తుంది. దీని ప్రధాన లక్షణాలలో ఫాస్ట్ ఛార్జింగ్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్, 12అంగుళాల చక్రాలు, ఆల్‌లినిదీ లైటింగ్, బ్లూటూత్‌ఎనేబుల్డ్ టిఎఫ్‌టి ఎల్‌సిడి డిస్‌ప్లే, 2ఎ యుఎస్‌బి స్మార్ట్‌ఫోన్ ఛార్జర్, సైడ్ స్టాండ్ ఇంటర్‌లాక్ సిస్టమ్ ఉన్నాయి. టీవీఎస్ మోటార్ కంపెనీ కొత్త బడ్జెట్ ఈస్కూటర్‌ను విడుదల చేయనుంది. దీనిని టీవీఎస్ ఆర్బిటర్ అని పిలుస్తారు. దీని ధర రూ.లక్ష లోపు ఉండవచ్చు. ఈ స్కూటర్ 2.2 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ, ఐక్యూబ్ ఎంట్రీ వెర్షన్ నుండి బాష్ యొక్క హబ్ మోంటెడ్ మోటారును పంచుకోవచ్చు. ఇది 75, 80కి.మీ మధ్య రేంజ్ కలిగి ఉంటుందని, గరిష్ట వేగం గంటకు 70 కి.మీ. ఉంటుందని భావిస్తున్నారు. రాబోయే నెలల్లో కైనెటిక్ డిఎక్స్ రానుంది. ఇది పాత యుగం ప్రసిద్ధ స్కూటర్‌ను ఎలక్ట్రిక్ అవతార్‌లో తిరిగి తీసుకువస్తుంది. ఈ స్కూటర్‌ను 2025 దీపావళికి ముందు ప్రారంభించవచ్చు. ఇది టిఎఫ్‌టి డిస్‌ప్లే, ఎల్‌ఒటి ఆధారిత స్మార్ట్ ఫీచర్లు, జియో థింగ్స్‌తో కలిసి అభివృద్ధి చేసిన డిజిటల్ ప్లాట్ ఫామ్‌ను అందిస్తుంది. అలాగే, ఇది బహుళ బ్యాటరీ ఎంపికలు, ఫాస్ట్ ఛార్జింగ్ సౌకర్యా న్ని కలిగి ఉంటుంది. యమహా తన మొదటి ఎలక్ట్రిక్ స్కూటర్ ఆర్‌వై01ను 2025 చివరిలో, 2026 ప్రారంభంలో భారతదేశంలో విడుదల చేయవచ్చు. దీనిని బెంగళూరుకు చెందినస్టార్టప్ రివర్ అభివృద్ధి చేసింది. రివర్ ఇండీ ఆధారంగా ఉంటుంది. ఇటీవల దాని పరీక్షా రిపోర్ట్ కూడా వెల్లడైంది. దీనిలో దాని డిజైన్‌అంశాలు రివర్‌ఇండీని పోలి ఉన్నాయి. దీనికి 4 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఉంటుంది. ఇది దాదాపు 100కి.మీ.ల పరిధిని ఇస్తుంది.



## ఫండ్స్ రికవర్ చేస్తే 25% మీకే!

**న్యూఢిల్లీ, జూలై 21:** సైబర్ దాడి కారణంగా సుమారు 44.2 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.378 కోట్లు) పోగొట్టుకున్న దేశీయ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీ కాయిన్‌డీసీఎక్స్ బౌంటీ ప్రోగ్రామ్ ప్రకటించింది. ఈ సొమ్ము రికవరీలో సహకరించిన వారికి రాబట్టిన మొత్తంలో 25 శాతం వరకు రివార్డుగా ఇస్తామని వెల్లడించింది. ఈ మేరకు ఎథికల్ హ్యాకర్స్, వైట్‌హ్యాట్ రీసెర్చర్లు, ఇతర భాగస్వాములకు సోమవారం పిలుపునిచ్చింది. అంతేకాదు సైబర్ క్రైమ్‌పై వెబ్3 కమ్యూనిటీ పోరాడాలని సూచించింది. కాయిన్‌డీసీఎక్స్‌లో ఈనెల 19న ఉదయం 4 గంటలకు సైబర్ దాడి చోటుచేసుకుంది. భాగస్వామి ఎక్స్ఛేంజీలోని తమ ఖాతాల్లో, ఒకదాంట్లో ధ్రువీకరణ లేని చొరబాటు జరిగిందని కాయిన్‌డీసీఎక్స్ భద్రతా వ్యవస్థలు గుర్తించాయి. ఈ ఘటనలో దాదాపు రూ.378 కోట్ల నష్టం వాటిల్లింది. వినియోగదారుల నిధులు భద్రంగా ఉన్నాయని, వీటిపై ఎటువంటి ప్రభావం పడలేదని సంస్థ సహవ్యవస్థాపకులు సుమిత్ గుప్తా, నీరజ్ ఖండేల్‌వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రకటించారు. సైబర్ దాడి వల్ల నష్టపోయిన మొత్తాన్ని కాయిన్‌డీసీఎక్స్ భరిస్తుందని, అంతర్గత నిల్వలను ఇందుకు వినియోగిస్తుందని కంపెనీ తెలిపింది. గతేడాది క్రిప్టో ఎక్స్ఛేంజీ వజీర్‌ఎక్స్‌లో కూడా 230 మి.డాలర్ల సైబర్ చోరీ జరిగిన విషయం తెలిసిందే.




## వాణిజ్యం

### ఈక్విటీ సూచీలకు బ్యాంకింగ్ మద్దతు

**ముంబై, జూలై 21:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. విశ్లేషకుల అంచనాలను మించి త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో రెండ్రోజుల వరుస నష్టాల తర్వాత సూచీలు బయటపడ్డాయి. మరోవైపు రికార్డు త్రైమాసిక ఫలితాలను ప్రకటించినప్పటికీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 81,918.53 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,757.73) స్వల్ప లాభాల్లో ప్రారంభమై వెంటనే నష్టాల్లోకి జారుకుంది. కాసేపటి తర్వాత మళ్లీ లాభాల్లోకి వచ్చిన సూచీ.. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,274.03 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 442.61 పాయింట్ల లాభంతో 82,200.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122.30 పాయింట్ల లాభంతో 25,090.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.30గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్ షేర్లు రాణించాయి. రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్, ఐటీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.04 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3374 డాలర్ల వద్ద ట్రేడయింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14